
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

మంగళవారం 9 డిసెంబరు 2025



కలువాయి బస్టాండులో ఒంటికాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న ప్రజలు

తిరుపతి వద్దే వద్దు!

- వివరాలు 8లో..

కలువాయి, రాపూరు మండలాలను తిరుపతి జిల్లాలో కలపొద్దంటూ సోమవారం ఆందోళనలు జరిగాయి కలువాయిలో రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపారులు, ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి, ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. బస్టాండు సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద దివ్యాంగులు కూడా ఆందోళన చేశారు. ఇక రాపూరు మండలాన్ని నెల్లూరులోనే కొనసాగించాలంటూ బీజేపీ నాయకులు నెల్లూరులోని కలెక్టరేట్‌లో అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు.

పురుగే వణికించేస్తోంది!





కలవర పెడుతున్న స్ర్కబ్ టైఫస్ • జిల్లాలో ఇప్పటిదాకా 59 కేసుల నమోదు • ఇద్దరు మృత్యువాత • జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యనిపుణులు

స్ర్కబ్ టైఫస్.. పేరు చెబితే జిల్లావాసులు కలవర పడిపోతున్నారు. వయసుతో నిమిత్తం లేకుండా ప్రజలు ఈ వ్యాధి బారిన పడుతున్నారు. నవారు, నులక మంచాలు ఎక్కువగా వినియోగించే వారికి ఈ వ్యాధి బారిన పడుతున్నట్లు వైద్యనిపుణులు గుర్తించారు. నల్లిని పోలి ఉండే కీటకం వల్ల వస్తున్న ఈ స్ర్కబ్ టైఫస్‌ను నిర్లక్ష్యం చేస్తే వ్యాధిగ్రస్థులు కోమాలోకి వెళ్లే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటిదాకా 59 మంది ఈ బ్యాధి బారిన పడగా, ఇద్దరు మృతి చెందారు.

స్ర్కబ్ టైఫస్ వ్యాధిగ్రస్థుల సంఖ్య


వయస్సు	మగ	ఆడ	మొత్తం
0 - 5	2	2	4
6 - 10	1	5	6
11 - 15	2	0	2
16 - 20	1	1	2
21 - 30	2	6	8
31 - 45	7	5	12
46 - 60	9	6	15
61 - 75	5	5	10

• జిల్లాలో 59 కేసుల నమోదు

జిల్లాలో జనవరి నుంచి ఇప్పటిదాకా 59 స్ర్కబ్ టైఫస్ కేసులు నమోదయ్యాయి. అక్టోబరు నెలలో 13 కేసులు నమోదవగా, నవంబరులో అత్యధికంగా 26 కేసులు నమోదయ్యాయి. నెల్లూరు నగరంలోనే 7 కేసులు, నెల్లూరు రూరల్‌లో 7, దగదర్తిలో 6, విడవలూరులో 5, అనంతసాగరంలో 4, బుచ్చిరెడ్డిపాళెంలో 4, కొడవలూరు, మనుబోలు, వెంకటాచలం మండలాల్లో 3 కేసులు వంతున నమోదయ్యాయి. కోవూరు, సంగం, తోటపల్లిగూడూరులలో రెండేసి కేసులు, అల్లూరు, అనుమసముద్రంపేట, బోగోలు, చేజర్ల, కొండాపురం, ముత్తుకూరు, పొదలకూరు, రాపూరు, సైదాపురం, వరికుంటపాడు మండలాల్లో ఒక్కో కేసు నమోదయింది. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు బాధిత వ్యాధిగ్రస్తుల నివాసాలు ఉండే చుట్టు పక్కల ఎవరైనా ఈ వ్యాదికి గురయ్యారా అన్న విషయాలపై క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. వ్యాధి లక్షణాలు గుర్తించిన వెంటనే స్ర్కబ్ టైఫస్ నిర్ధారణ కోసం వీల్‌ఫెలిక్స్ పరీక్ష చేస్తున్నారు.

• జాగ్రత్తలు తప్పనిసరి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. పాత మంచాలు, పరుపులు, దిండ్లు లాంటివి తీసివేయాలి. పిల్లలకు కాళ్లు, చేతులు కప్పి ఉంచేలా దుస్తులు వేయటం వల్ల కీటకాలకు దూరంగా ఉండవచ్చు. ఊపిరి తిత్తులలో వాపు వచ్చి ఊపిరి తీసుకోవటం ఇబ్బందిగ్గా ఉంటే స్ర్కబ్ టైఫస్ వ్యాధి పరీక్షలు చేయించుకోవాలి. మెదడులోని రక్షిత పొరలలో వాపు రావటం వల్ల తీవ్రమైన నరాల సమస్యలు తలెత్తే ప్రమాదం కూడా ఉంటుంది. మూత్రపిండాల వ్యాధులు, గుండె కండరాల వాపు వచ్చే అవకాశం ఉంటుంది. ఆయా లక్షణాలు ఉంటే వెంటనే వైద్య నిపుణులను సంప్రదించాలి.



నెల్లూరు (వైద్యం), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్ర్కబ్ టైఫస్ పేరు వింటేనే జిల్లావాసుల్లో ఆందోళన రేగుతోంది. నల్లిని పోలి ఉండే కీటకం వల్ల వస్తున్న ఈ వ్యాధి బారిన ఇప్పటిదాకా 59 మంది పగా, ఇద్దరు మృతి చెందారు. ఈ నెల 4వ తేదీన ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాపూరు మండలం సిద్దవరం గ్రామం దళితవాడకు చెందిన సంతోషి (5) అనే చిన్నారి ఈ వ్యాధితో బాధపడుతూ మృత్యువాత పడింది. అయితే లివర్ వ్యాధి కూడా ఆ చిన్నారికి ఉన్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన రమణమ్మ (32) తీవ్ర అనారోగ్యంతో నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరగా అక్కడ పరీక్షలు చేసిన వైద్యులు స్ర్కబ్ టైఫస్ వ్యాధిగా నిర్ధారించారు. అప్పటికే వ్యాధి ముదరటంతో ఈ నెల 2వ తేదీన మృత్యువాత పడింది. నెల్లూరులోని రామచంద్రా రెడ్డి ఆసుపత్రిలోనే 43 మంది వైద్యం చేయించుకున్నారంటే వ్యాధిగ్రస్థులలో ఎక్కువగా పేద, మధ్య తరగతి ప్రజలేనని తెలుస్తోంది. డెంగీ తరహాలో తీవ్రమైన కండరాల నొప్పి, తలనొప్పి, జీర్ణ సంబంధిత లక్షణాలు ఉంటే వెంటనే ఆసుపత్రులకు వ్యాధిగ్రస్థుల ను తరలించాలని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఇంట్లోనే నక్కి. నల్లిని పోలి ఉండే ఈ చిన్న కీటకం ఎక్కువగా పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి!



జిల్లాలో 59 మంది స్ర్కబ్ టైఫస్ కేసులు నమోదయ్యాయి. వ్యాధిగ్రస్థులకు వెంటనే వైద్య చికిత్సలు అందివ్వడం వల్ల కోలుకుంటున్నారు. ఈ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించి, జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నాం. ఇప్పటివరకు నమోదయిన కేసులకు సంబంధించి చుట్టు పక్కల అనుమానితులకు పరీక్షలు నిర్వహిస్తున్నాము. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోనూ ఈ వ్యాధికి సంబంధించి అన్ని రకాల పరీక్షలు, మందులు అందుబాటులో ఉన్నాయి. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

- డాక్టర్ సుజాత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

ధరలో 'గుడ్డు' గుబేల్!

• కొండెక్కిన కోడి

ఉదయగిరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కోడే కాదు.. కోడి గుడ్డు ధర అమాంతం పెరిగిపోయింది. పది రోజుల క్రితం వరకు చికెన్ (స్కిన్‌లెస్) 250 ఉండగా ప్రస్తుతం మూడొందలకు చేరిపోయింది. అలాగే వంద కోడిగుడ్లు రూ.640 ఉండగా ఇప్పుడు 670కి (హోల్‌సేల్) ఎగబాకింది. దీంతో సామాన్యులు చికెన్ తినాలంటే భారంగా కనిపిస్తోంది. కార్తీక మాసం లో చికెన్ ధరలు భారీగా తగ్గాయి. ఆ మాసం ముగిసిన తరువాత రోజు రోజుకు ధరలు పెరగడం మొదల య్యాయి. డిమాండ్‌కు తగ్గట్టు ఉత్పత్తి లేకపోవడం, దాణా ఖర్చులు పెరిగిపోవడంతోనే ఈ ధరలు పెరుగుతు న్నాయని వ్యాపారు లు చెబుతున్నారు.



పొలంలోనే ఆగిన కర్షకుడి ఊపిరి



ఇటీవల కురిసిన వర్షాలకు పొలంలో నిలిచిన నీటిని తోడేందుకు వెళ్లిన ఓ అన్నదాత ఊపిరి ఆగింది. మనుబోలు మండలం చెరుకుమూడి పొలాల్లో పనులు చేస్తున్న కృష్ణయ్య నాయుడు ప్రమాదవశాత్తు ముందుకు పడటంతో బురదలో కూరుకుపోయి మృతి చెందాడు. కుటుంబసభ్యుల కథనం మేరకు.. దిత్వా తుఫాన్ తరువాత వర్షాలు తగ్గుముఖం పట్టడంతో కయ్యల్లో ఉండిపోయిన నీటిని మండలంలోని చెరుకుమూడికి చెందిన ఆలూరి కృష్ణయ్య నాయుడు (65) సోమవారం ఉదయం పొలానికి వెళ్లాడు. పొలంలో నీరు తీసే క్రమంలో కృష్ణయ్య గుండెపోటుకు గురై ముందుకు పడటంతో తల బురదలో కూరుకుపోయింది. సమీపంలో సహచర రైతులు, కూలీలు లేకపోవడంతో బురదలోనే ఊపిరాడక కృష్ణయ్య చనిపోయాడు. పొలానికి వెళ్లిన కృష్ణయ్య ఎంతసేపటికి రాకపోవడంతో బంధువులు పొలం వద్దకు వెళ్లారు. అక్కడ బురదలో తల కూరుకుపోయి మృతిచెంది ఉన్న కృష్ణయ్యను చూసి బంధువులు బోరున విలపించారు. కాగా, కృష్ణయ్య నాయుడు నీటిసంఘం అధ్యక్షుడి కూడా పని చేశారు. కృష్ణయ్య మృతిపట్ల మాజీ సర్పంచు రామానాయుడు, నాయకులు శ్రీహరినాయుడు, రామయ్య నాయుడు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

- మనుబోలు (ఆంధ్రజ్యోతి)

సోమశిలలో 73.667 టీఎంసీలు

అనంతసాగరం డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశ యానికి ఎగువ నుంచి 14,156 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు అధి కారులు తెలిపారు. ఇక డ్యాంలో 73.667 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 50, దక్షిణ కాలువకు 200, డెల్టాకు 12,650, కండ లేరుకు 2,000 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

పీజీ స్పాట్ అడ్మిషన్ల గడువు పొడిగింపు

వెంకటాచలం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ పీజీ కోర్సుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ గడువును 12వ తేదీ వరకు పొడిగించినట్లు ఆ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత ఒక ప్రకటనలో తెలిపారు. ఇంకా భర్తీ చేయాల్సిన ఖాళీ సీట్లను దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల అభ్యర్థనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రవేశ పరీక్షలు రాయకపోయినా పీజీ కోర్సుల్లో సీటు పొందే అవకాశం ఉన్నందున, ఆసక్తి గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాయితీ అందుకో..
లోడు క్రమబద్ధీకరించుకో!

రాయితీ ఇలా (రూ.లలో)

కిలోవాట్	అసలు	రాయితీ
1	2,250	1,250
2	4,450	2,450
3	6,650	3,650
4	8,850	4,850
5	11,050	6,050

ఉదయగిరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గృహాలకు విద్యుత్ కనెక్షన్ తీసుకునే సమయంలో లైట్లు, ఇతర విద్యుత్ గృహోపకరణాల వినియోగాన్ని అంచనా వేసి లోడును కిలోవాట్లలో లెక్కించి సెక్యూరిటీ డిపాజిట్, డెవలప్‌మెంట్ చార్జీలు వసూలు చేస్తారు. జిల్లాలో సుమారు 8,99,151 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వాటిలో చాలా వరకు దశాబ్దాల క్రితం వాటివే. వాడే బల్బులు, ఫ్యాన్ల లెక్క ఆధారంగా వీటిని ఇచ్చారు. ఆ తరువాత విద్యుత్ గృహోపకరణాల వినియోగం బాగా పెరిగింది. అప్పట్లో విద్యుత్ వాడకం 0.5 కిలోవాట్ ఉంటే ఇప్పుడు అదే సర్వీసుపై రెండు నుంచి మూడు కిలోవాట్‌లు ఉంది. నిర్దేశిత మొత్తం చెల్లించి ఈ అదనపు లోడును క్రమబద్ధీకరించుకోవాల్సి ఉన్నా చాలామంది చేసుకోలేదు. చాలామంది అధిక విద్యుత్ వాడుతున్నా తక్కువ సామర్థ్యానికే అనుమతి తీసుకుంటున్నారు. సాధారణ రోజుల్లో ఇబ్బంది లేకున్నా వేసవిలో



వినియోగం పెరిగి ఆ భారం ట్రాన్స్‌ఫార్మర్లపై పడుతోంది. దీంతో తరచూ విద్యుత్ సమస్యలు తలెత్తుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో సిబ్బంది తనిఖీల సమయంలో గుర్తిస్తే జరిమానా విధించి రూ.వేలల్లో అదనపు లోడు రుసుము వసూలు చేస్తోంది. గతంలో లోడు పెంచుకోవాలంటే ఒక కిలోవాట్‌కు రూ.2 వేలు చెల్లించాల్సి వచ్చేది. దీనికితోడు దరఖాస్తు రుసుం రూ.50, డిపాజిట్ రూ.250 చెల్లించాల్సి ఉండేది. ప్రస్తుతం క్రమబద్ధీకరణ రుసుంలో 50 శాతం రాయితీ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో మార్చి 1 నుంచి జూన్ 30వ తేదీ వరకు 50 శాతం రాయితీ ఇచ్చింది. అయితే ప్రభుత్వం మరోసారి అవకాశమిచ్చి, ఈ నెల 31వ తేదీ వరకు గడువు ఇచ్చింది.

సద్వినియోగం చేసుకోవాలి

వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఉదయగిరి సబ్ డివిజన్ పరిధిలో 36,460 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉండగా ఇప్పటివరకు 691 మంది మాత్రమే సద్వినియోగం చేసుకొన్నారు. క్రమబద్ధీకరణ అనేది ఎప్పుడైనా చేసుకోవాల్సిందే. గడువులోపు చెల్లిస్తే రాయితీ పొందే వీలుంటుంది. ఈ గడువు ముగిస్తే పూర్తి ధర చెల్లించాల్సి ఉంటుంది.

- కొణిదెల సుధీర్‌చౌదరి, డీఈఈ, ఉదయగిరి

పెళ్లికాని ప్రసాదులూ..
సిబిల్ స్కోరెంత!?

• ఆర్థిక క్రమశిక్షణపై ఆరా తీస్తున్న తల్లిదండ్రులు




పొదలకూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : 'ఆ అబ్బాయికేంటండీ రెండు ఇళ్లు.. ఒక కారు.. సాఫ్ట్‌వేర్ కొలువుంది. అమ్మాయిని బాగా చూసు కుంటాడు..' అని చెబితే యువతి తల్లిదండ్రులు గతంలో సంబంధం కుదుర్చుకునేవారు. ఇప్పుడా పరిస్థితి మారింది. కొందరు సదరు యువకుల గురిం చి ఆరా తీస్తున్నారు. ఆర్థిక క్రమశిక్షణ ఏ పాటితో తెలుసుకుంటున్నారు. అందుకు సిబిల్ స్కోర్‌ను పరిశీలిస్తున్నారు. స్కోరు ఏమాత్రం బాగలేకు న్నా.. చెక్ బౌన్స్ వంటి కేసులున్నా.. క్రెడిట్ కార్డు ఓవర్ డ్యూస్, సెటిల్‌మెంట్స్ ఉన్నా.. మాకొద్దు మీ సంబంధమని తెగేసి చెప్పేస్తున్నారు. తమ కుమార్తెను ఇచ్చి పెళ్లి చేసేందుకు కొందరు తల్లిదండ్రులు యువకుల వ్యక్తిత్వం, సంపాదన, కుటుంబ నేపథ్యంతోపాటు ఆర్థిక క్రమశిక్షణ కలిగి ఉన్నాడా! లేదా ఇష్టానుసారంగా ఖర్చు చేసి అప్పుల ఊబిలో కూరుకుపోయాడో తెలుసుకునేందుకు సిబిల్ స్కోర్‌ను ఒక ఆయుధంగా ఎంచుకుంటున్నారు.

• అవివాహితులూ జాగ్రత్త!!

సిబిల్ స్కోర్‌తో ఆ వ్యక్తి ఆర్థిక స్థితిగతులను తెలుసుకునేందుకు అవకాశం ఉంటుంది. అతను ఏ ఏ బ్యాంకుల్లో ఎంతెంత మొత్తం రుణాల రూపంలో తీసుకున్నాడు. అవి ఏ రకం.. నిర్ణీత గడువులోపు నెలసరి వాయిదాలు చెల్లిస్తున్నాడా లేదా.. ఓవర్ డ్యూస్ ఏమైనా ఉన్నాయా తెలుసుకోవచ్చు. ఫైనాన్స్ కంపెనీల నుంచి రుణాలను తీసుకున్నా తెలుస్తుంది. సిబిల్ స్కోరు 750 పాయింట్ల కంటే ఎక్కువ ఉంటే స్కోరు బాగున్నట్లు.. అంతకన్నా తక్కువగా ఉండే మాత్రం ఆర్థిక క్రమశిక్షణ అంతగా లేనట్టే! ఒక్కోసారి బ్యాంకుల వద్ద ఉన్న రుణాలను వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేసుకోవడం ద్వారా స్కోరు దారుణంగా పడిపోతుంది. ఈ నేపథ్యంలో పెళ్లికాని ప్రసాదులు ఆర్థిక క్రమశిక్షణ పాటించకుంటే అంతే సంగతులు.

హత్య కేసులో ఏడుగురికి జీవితఖైదు



నెల్లూరు (లీగల్), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఓ స్వల్ప వివాదం చినికి చినికి గాలివానగా మారి, ఓ మహిళ హత్యకు దారి తీసింది. ఈ కేసులో నేరం రుజువు కావడంతో ఏడుగురికి జీవిత ఖైదు విధిస్తూ నెల్లూరు 8వ అదనపు జిల్లా (ప్రత్యేక మహిళా కోర్టు) న్యాయాధికారి ఎంఎ సోమశేఖర్ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. అనంతసాగరం మండలం వీకేపాడులో ఎంపీటీసీ ఎన్నికల సందర్భంగా సింగనమల రమణమ్మ, ఆమె బంధువులు వడ్డిబోయిన లక్ష్మీరెడ్డికి మద్దతు పలికారు. ఈ కేసులో నిందితులైన అదే గ్రామానికి చెందిన వడ్డిబోయిన వెంకటేశ్వర్లు అలియాస్ వెంకటేశ్వర్లురెడ్డి, వడ్డిబోయిన రత్నయ్య, వడ్డిబోయిన సుబ్బారెడ్డి, వడ్డిబోయిన సుధాకర్ రెడ్డి, కేసరి వెంకటేశ్వర్లు అలియాస్ వెంకటేశ్వరరెడ్డి, కలువాయి ఎల్లారెడ్డి, నాగులకుంట రమణారెడ్డి, దుగ్గిరెడ్డి రత్నారెడ్డిలు లక్ష్మీరెడ్డికి మద్దతు పలికారు. ఈ కేసులో నిందితులు, ఫిర్యాది కేతా నరసయ్య చిన్న తమ్ముడు కేతా కొండారెడ్డి ఒకేవీధిలో ఉంటున్నారు. ఆ వీధిలో మంచినీటి కొళాయిని రత్నారెడ్డి ఇంటి ముందు ఏర్పాటు చేశారు. నీటి విషయమై రత్నారెడ్డి, కేతా కొండయ్య కుటుంబానికి మనస్పర్థలు ఉండేవి. ఈ నేపథ్యంలో రత్నారెడ్డి అన్న వడ్డిబోయిన సుధాకర్‌రెడ్డి వీధి కొళాయిని పగలగొట్టి, అధికారులకు ఫిర్యాదు చేస్తే అంతు చూస్తామని బెదిరించాడు. ఈ విషయమై కేతా నారయ్య, కేతా కొండయ్య గ్రామాధికారులకు ఫిర్యాదు చేశారు. వారు పరిశీలించి మరో కొళాయి ఏర్పాటు చేస్తామని, పగలగొట్టినందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ విషయమై సింగనమల మల్లికార్జున (హత్యకు గురైన రమణమ్మ పెద్ద కుమారుడు) మాట్లాడుతుండగా 2014, నవంబరు 5 సాయంత్రం 4 గంటల ప్రాంతంలో దుగ్గిరెడ్డి రత్నారెడ్డి మినహా మిగిలిన ఏడుగురు నిందితులు కర్రలతో మల్లికార్జునపై దాడి చేశారు. కుమారుడిని కాపాడేందుకు అక్కడకు వెళ్లిన రమణమ్మపై కూడా దాడి చేయగా తీవ్రగాయాలయ్యాయి. కేతా నారయ్యకు కూడా గాయాలయ్యాయి. అనంతరం ఆమెను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు సోమశిల పోలీసులు నిందితులపై సెక్షన్ 302, 307, 324, 323, 120 (బి), 109 ఐపీసీల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. దుగ్గిరెడ్డి రత్నారెడ్డి మినహా మిగతా ఏడుగురిపై నేరం రుజువు కావడంతో పైవిధంగా న్యాయాధికారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ షేక్ రఫీ మాలిక్ వాదించారు.



కుమారుడి మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి మనోజకుమారి

ఉన్నంతలో ఎంతో ఆనందంగా గడుపుతున్న ఆ కుటుంబాన్ని విధి ఆటలాడుకుంది. ఏడు నెలల క్రితం కరెంటు రూపంలో మృత్యువు ఇంటి పెద్ద దిక్కును పొట్టన పెట్టుకుంది. ఆ దుఃఖాన్ని దిగమింగుకుని ఆ ఇల్లాలు అన్నీ తానై కూలిపనులు చేసుకుంటూ తన ఇద్దరు బిడ్డలను పోషిస్తోంది. ఆ ఘటన నుంచి తేరుకోకముందే సోమవారం బస్సు రూపంలో వచ్చిన మృత్యువు చిన్న కుమారుడినీ కబళించింది. రోడ్డుపై విగతజీవిగా పడిఉన్న కన్నపేగును చూసి గుండెలవిసేలా రోదిస్తున్న ఆ తల్లిని చూసి అందరి కళ్లు చెమ్మగిల్లాయి.

విధి ఆడిన వింత ఆట!

- 7 నెలల క్రితం ఇంటిపెద్ద మృతి
- అన్నీ తానై బిడ్డల్ని పోషిస్తున్న తల్లి
- బస్సు ఢీకొనడంతో చిన్నకుమారుడి మృతి
- కన్నపేగును చూసి బోరున విలపించిన మాతృమూర్తి

ఇందుకూరుపేట మండలం గంగపట్నం మజారా వెంకటరెడ్డి కాలనీకి చెందిన పులి మురళి, మనోజ కుమారిలకు ప్రదీప్, కిరణ్ ఇద్దరు మగ సంతానం. ప్రదీప్ 9వ తరగతి, కిరణ్ ఆరవ తరగతి గంగపట్నం హైస్కూలులో చదువుతున్నారు. ట్రాక్టర్ నడుపుకుంటూ మురళి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా, ఈ ఏడాది మార్చిలో మురళి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఇంటి పెద్దదిక్కు చనిపోవడంతో పిల్లల పోషణ మనోజ కుమారిపై పడింది. కూలిపనులు చేసుకుని బిడ్డల్ని చదివి స్తోంది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం అన్నదమ్ములిద్దరూ స్కూలుకు వెళ్లేందుకు సైకిల్‌పై బయలు దేరారు. అయితే, మార్గమధ్యంలో సైకిల్ టైరు పంక్చర్ కావడంతో తోసుకుంటూ షాపు వద్దకు బయలుదేరారు. మార్గమధ్యంలోని వేపచెట్టు సెంటర్ వద్దకు రాగానే గంగపట్నం వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి వారిని ఢీకొంది.



కిరణ్ (ఫైల్)

దీంతో కిరణ్ (11) అక్కడికక్కడే మృతి చెందాడు. అన్న ప్రదీప్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న తల్లి మనోజ కుమారి పరుగున ఘటనా స్థలికి చేరుకుంది. రోడ్డు పక్కన విగతజీవిగా పడి ఉన్న కిరణ్ మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపించింది. వెంకటరెడ్డి కాలనీవాసులు కూడా అక్కడకు చేరుకుని విషాదంలో మునిగిపోయారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ నాగార్జునరెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని బస్సు డ్రైవర్ బాషను అదుపులోకి తీసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం బాలుడి మృతదేహాన్ని నెల్లూరు జీజీహెచ్‌కి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి టీడీపీ మండల అధ్యక్షుడు పవన్ రెడ్డి ద్వారా తక్షణ సాయంగా రూ.20 వేలు అందజేశారు. కిరణ్ మృతి విషయం తెలుసుకున్న తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు సంతాపం ప్రకటించి, సెలవు దినంగా ప్రకటించారు.

- ఇందుకూరుపేట, (ఆంధ్రజ్యోతి)

రేపటి నుంచి ఏపీ టెట్ పరీక్షలు

నెల్లూరు (విద్య), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఏపీ టెట్ పరీక్షలను బుధవారం నుంచి 21వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా ఆరు కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు డీఈవో బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. పొట్టెపాళెంలోని ఆయాన్ డిజిటల్ జోన్, జై శ్రీరామ్ ఇన్‌ఫ్రా అండ్ ఐటీ సొల్యూషన్స్, కావలిలోని పీబీఆర్ విశ్వోదయా ఇంజనీరింగ్ కళాశాల, బోగోలు మండలంలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, నెల్లూరులోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల, గండవరంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలల్లో ఈ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. ఇప్పటికే హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారని, వీటిని డౌన్‌లోడ్ చేసుకుని నిర్ణీత సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. ఏమైనా సందేహాలు ఉంటే 9989002174, 9391061007 నెంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలు

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ మేరీస్ కళాశాల క్రీడా ప్రాంగణంలో మంగళవారం నుంచి 11వ తేదీ వరకు 14 ఏళ్ల బాలబాలికలకు రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి భీమతాటి రమణయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు.

బంగారం, వెండి ధరలు



బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 12314
వెండి కిలో ధర	రూ. 183900
వెండి ఒక గ్రాము	రూ. 188.90

సహకార సంఘ ఉద్యోగుల ఆందోళన



ధర్నా చేస్తున్న సహకార సంఘ ఉద్యోగులు

కోవూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా సోమవారం స్థానిక పడుగు పాడు సొసైటీ కార్యాలయం ఎదుట సహకార సంఘ ఉద్యోగులు ఆందోళనకు దిగారు. జీవో 36ను అమలు చేయాలని నినాదాలు చేశారు. ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కొండూరు గోవర్ధన్ రెడ్డి గ్రాట్యుటీ చట్టాన్ని అమలు చేయాల్సిందిగా డిమాండ్ చేశారు. ఆందోళనలో రాష్ట్ర కమిటీ కోశాధికారి ఆర్. రామానాయుడు పాల్గొన్నారు. సహకార శాఖాధికారికి వినతిపత్రం సమర్పించారు.

కండలేరులో 60.28 టీఎంసీల నీరు

రాపూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కండలేరు డ్యాం నీటి నిల్వ సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 60.28 టీఎంసీలు ఉందని ఏఈ అనిల్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుండి 1450 క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లో వస్తుండగా, 1030 క్యూసెక్కులు అవుట్ ఫ్లో ఉందన్నారు.

మహిళ మృతిపై ఆరా



సర్వే చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీ పరిధిలో సోమవారం కోవూరు సబ్ యూనిట్ అధికారి నాగరాజు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలోని ఏఎన్ఎంలు, ఆశాలు జ్వరాలపై సర్వే నిర్వహించారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'స్క్రబ్ టైఫస్ అనుమానంతో మహిళ మృతి' అనే కథనానికి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది పాత కాశీపాళెం ఏరియాలో లార్వా జ్వరాలపై సర్వే చేపట్టారు. ఇళ్ళ వద్ద చెత్తా చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

డ్రమ్ సీడర్ పద్ధతి అత్యంత లాభదాయకం



పొలం వద్ద రైతుతో సోమసుందర్

రాపూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి నాటడం ద్వారా తక్కువ ఖర్చుతో పాటు అధిక దిగుబడి సాధించి కూలీల కొరతను అధిగమించవచ్చునని రాపూరు వ్యవసాయశాఖాధికారి సోమసుందర్ తెలిపారు. శనివారం మండలంలోని సిద్ద వరం గ్రామంలో వరి విత్తనాలను డ్రమ్ సీడ ర్ ద్వారా వేశారు. ఈ పద్ధతిలో కేవలం 8 నుంచి 10 కేజీల వరి విత్తనాలు సరిపోతాయని, నేరుగా విత్తనాలు పొలంలో వేసుకోవచ్చని తెలిపారు. ముందు పొలాన్ని చదును చేసి, ఆ తర్వాత ఈ పద్ధతిని అవలంబిస్తే నారుమడిలో పెట్టుబడి తగ్గుతుందన్నారు.

వివాదాస్పద స్థలంలో స్వల్ప ఘర్షణ

పొదలకూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) :పొదలకూరు రామ్‌నగర్‌లో ఉన్న వివాదాస్పద స్థలంలో గోడ కూల్చేందుకు ప్రయత్నించిన వ్యక్తిని స్థానికులు అడ్డుకోవడంతో కొంత ఘర్షణ నెలకొంది. స్థానికులు ఎస్ఐకి ఫిర్యాదు చేయడంతో అతన్ని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు. అయితే గతేడాదిగా ఈ స్థల వివాదం జరుగుతూనే ఉంది. స్థలాన్ని ఆనుకుని ఉన్న స్థలం తనకు చెందినదిగా ఆ వ్యక్తి చెబుతూ అక్రమంగా గుడి కట్టారని ఆరోపిస్తున్నాడు. గుడి నిర్మాణ స్థల వివాదం కూడా కోర్టులో ఉంది.

విద్యార్థి మృతి కలచివేసింది!

ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి

ఇందుకూరుపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగపట్నం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థి కిరణ్ మృతి చెందడం పట్ల ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాలుడి మృతి తనను తీవ్రంగా కలచివేసిందని ఆమె సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమాచారం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే స్పందించి, స్థానిక టీడీపీ నాయకులను సంఘటన స్థలానికి పంపించారు. బాధిత కుటుంబానికి అండగా నిలవాలని ఆదేశించారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రోడ్డు ప్రమా దాలు జరగకుండా ప్రత్యేకించి విద్యార్థులు రాకపోకలు సాగించే ప్రాంతాల్లో ఆర్టీసీ డ్రైవర్లు జాగ్రత్తలు పాటించేలా చూడాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. కాగా బస్సు ప్రమాదంలో విద్యార్థి కిరణ్ మృతి యెందడం అత్యంత బాధాకరమని ఏపీ వక్ఫ్‌బోర్డ్ చైర్మ న్, నెల్లూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

పందుల స్వైరవిహారం.. పడకేసిన పారిశుధ్యం!

సర్వత్రా దుర్గంధం... వ్యాధుల భయం
పట్టించుకోని అధికార యంత్రాంగం



పల్లిపాళెం, కామాక్షికాలనీ ప్రాంతంలో పందుల స్వైర విహారం

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్యం పడకేసింది. స్థానిక ఖాజానగర్, పల్లిపాళెం, కామాక్షికాలనీ, కాశీపాళెం, శాంతినగర్ హాస్‌తోట తదితర ప్రాంతాల్లో ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. గుడపల్లి మురుగు కాలువ నుంచి దుర్గంధం వెదజల్లుతుండడంతో వ్యాధుల భయం వెంటాడుతోందని స్థానికులు వాపోతున్నారు. బుచ్చి, జొన్నవాడ మార్గంలోని కామాక్షి కాలనీ ప్రాంతంలో ఇళ్ళ పక్కనే చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో ఈ ప్రాంతం దుర్గంధ భరితమై దోమలు, పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో బుచ్చి మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు జలుబు, దగ్గు, జ్వరాల బారిన పడ్డారు. మున్సిపాలిటీలో పలుచోట్ల అపరిశుభ్రత తాండవిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే వీధులు, మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తా, చెదారం శుభ్రం చేయించాలని కోరుతున్నారు. ఈ విషయమై కమిషనర్ బాలకృష్ణను వివరణ కోరగా వర్షాలలోనూ పారిశు ధ్యం మెరుగుకు చర్యలు చేపటామన్నారు. పట్టణంలోని మురుగుకాలువల్లో చెత్తాచెదారాన్ని తొలగిస్తామన్నారు. పందుల నిర్వాహకులకు ఇప్పటికే నోటీ సులు జారీ చేశామని, మరోసారి నోటీసులు జారీ చేసి చర్యలు చేపట్టను న్నట్టు కమిషనర్ తెలిపారు.

పట్టణమంతా దుర్గంధమే...

రామకృష్ణానగర్, రాఘవరెడ్డి కాలనీ, కాశీపాళెం, పెద్దూరు దళితవాడ, ఖాజానగర్ తదితర ప్రాంతాల్లో దుర్గంధం వెదజల్లుతోంది. వీధులన్నీ ఇంకా బురదమయంగానే ఉన్నాయి. రోడ్లు, మురుగు కాలువల వెంట పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. పాములు, పురుగులు సంచరిస్తున్నాయి. దోమల బెడద ఎక్కువైపోతోంది. అధికారులు స్పందించి వెంటనే పారిశుధ్యం మెరుగునకు చర్యలు చేపట్టాలి.

తుఫాన్ దెబ్బకు 500 హెక్టార్లలో పంట నష్టం

ఏడీఏ రాజ్‌కుమార్



దెబ్బతిన్న వరినాట్లను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

మనుబోలు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దిత్వా తుఫానుకు 500హెక్టార్లలో నారు మడి నీటమునిగిందని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని మనుబోలు, వెంకన్నపాళెం తదితర గ్రామాల్లో నీటమునిగిన నార్లు, నారు మడులను సోమవారం వ్యవసాయశాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ డి. విజయ్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ నాలుగురోజులు నీటమునిగిన నారుమడిని నీరుతీసే వీలులేకుంటే మరల రైతులు కొత్తనారుమడి వేసుకోవాలన్నారు. నీరు తీసేసిన నారుమడికి తెగుళ్ళు, పురుగు పట్టే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. తెగుళ్ళ నివారణకు పురుగుమందులు పిచికారితో పాటు, 5 సెంట్ల నారుమడికి 1కిలో యూరియా, 1కిలో పొటాష్ వేసుకోవాలి. నాట్లు వేసిన పొలంలో అయితే నీటిని బయటకు పంపిన తరువాత ఎకరాలకు 20కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ అదనంగా వేసుకోవాలని రైతులకు సూచనలు చేశారు. దీంతో పాటు లీటర్ నీటికి 2గ్రాముల సాఫ్ గాని, బావిస్టన్ ద్రావణాన్ని పైరుపై పిచికారి చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య, వీఏఏలు శివకుమార్, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

పవర్‌గ్రిడ్ పరిహారంలో అన్యాయం జరిగింది!

- జట్లకొండూరువాసుల ఆందోళన



ఆందోళన చేస్తున్న జట్లకొండూరు గ్రామస్థులు

మనుబోలు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): 2011-12లో పవర్‌గ్రిడ్ కోసం తమ భూములు ఇచ్చామని, అయితే నష్టపరిహారం విషయంలో తమకు అన్యాయం జరిగిందంటూ జట్లకొండూరు గ్రామస్థులు గ్రామ ఉప సర్పంచు ఆవుల తులసీరామ్ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేశారు. 120 ఎకరాలు తీసుకుని అప్పట్లో అధికారులు తమ పేర్లు కాకుండా ఇతరుల పేర్లను రాసి పరిహారం ఇచ్చారన్నారు. ఆ రికార్డులు పరిశీలించి తమకు పరిహారం అందించాలని భూముల లబ్ధిదారులు తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రం అందజేశారు.

గుడపల్లి కాలువ రక్షణ గోడలకు మోక్షం

రూ.50 లక్షలతో పనుల ప్రారంభం



కాలువలో పూడికతీస్తున్న ఎక్సకవేటర్

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెంలోని బైపాస్ రోడ్డు వద్ద వున్న గుడపల్లి కాలువకు ఇరు పక్కల రక్షణ గోడలు నిర్మాణానికి పనులు ఎట్టకేలకు సోమవారం ప్రారంభమయ్యాయి. గత ప్రభుత్వంలో కాలువ సైడ్ వాల్స్ నిర్మాణానికి పనులు మం జూరయ్యాయి. అయితే, అప్పట్లో 'నువ్వే మా నమ్మకం' కార్యక్రమంతో వైసీపీ నాయకులు ఆ ప్రాంతానికి వెళ్లారు. నగర పంచాయతీలో వైసీపీ అధికారంలోకి రాగానే కాలువ సైడ్ వాల్స్ నిర్మిస్తామని మాటిచ్చిన నాయకులు ముఖం చాటేశారని నిలదీస్తూ స్టిక్కర్లు అంటించడాన్ని పలువురు ఆ ప్రాంత జనాలు వ్యతిరేకించారు. అప్పటినుంచి ఆ కాలువకు అభివృద్ధి పనులు మంజూరుకే పరిమితమయ్యాయి. 2024 ఎన్నికల ప్రచారంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, తనయుడు అర్జున్‌రెడ్డి ప్రభుత్వ నిధులు, లేదా తమ సొంత నిధులతోనైనా కాలువకు సైడ్ వాల్స్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు రూ.50 లక్షలు మంజూరు చేయించారు. నిర్మాణ పనుల ప్రారంభానికి కొంత జాప్యం కావడంపై ఎమ్మెల్యే ఇటీవల సీరియస్ కావడంతో పనులు ప్రారంభించారు.

మట్టి తీశారు.. పూడ్చడం మరిచారు!



మట్టిని తీసి వదిలివేసిన అధికారులు

రాపూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మరమ్మత్తుల కోసం తీసిన మట్టిని పూడ్చడం మరిచారు. రాపూరు ప్రజలకు నీరు అందించే మంచి నీటి పైప్ లైన్ పగిలిపోయింది. నీటి పైప్ లైన్ కాలువను తవ్విన అధికారులు గత 15 రోజులుగా దానిని పూడ్చడం మరిచిపోవడంతో అక్కడ ఉన్న వ్యాపారస్తులు, అటు వైపు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాపూరు బజారువీధి వద్ద ఉన్న నీటి కాలువ అటు వ్యాపారస్తులకు, ఇటు పాదచారులకు, వాహన దారులకు ఇబ్బందికరంగా మారింది. కొద్ది రోజుల క్రితం నెట్ వర్క్ కేబుల్ పనుల నిమిత్తం చేసే పనిలో వాటర్ పైప్ లైన్ పగిలి పోవడంతో, దీని మరమ్మత్తుల కోసం తీసిన మట్టిని తిరిగి పూడ్చడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీనికి తోడు మరళ అదే ప్రదేశంలో నీటి పైప్ లైన్ పగిలి రోడ్డు మొత్తం నీరు వెదజల్లి బురదమయం అయింది. దీంతో వాహనదారులు, పాదచారులు, దుకాణాలు నిర్వహిస్తున్న వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.

ఉమీద్ పోర్టల్లో వివరాలు నమోదు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న మైనార్టీ నాయకులు

పొదలకూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ఉమిద్ పోర్టల్‌లో తప్పనిసరిగా వివరాలు నమో దు చేయాలని, వక్ఫ్‌ఆస్తులను కాపాడడం ప్రతీ ముతవల్లి, క మిటీ సభ్యుని బాధ్యత అని మాజీ జిల్లా వక్ఫ్ బోర్డు డైరె క్టర్ షేక్ జమీర్‌బాషా తెలి పారు. సో మవారం పొదలకూరు తహసీ ల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు సురేఖకు వినతిపత్రం అందజేశారు. ఉమిద్ పోర్టల్‌లో నమోదు కోసం సరైన పత్రాలు లేని మసీదులకు పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వాలని, మరో మూడు నెలల లోపు వక్ఫ్ ఆస్తుల నమోదు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. నూతనంగా అమల్లోకి వచ్చిన ఉమి ద్ యాక్ట్ ప్రకారం, రాష్ట్రంలోని అన్నీ వక్ఫ్ ఆస్తులు, మసీదులు, దర్గాలు, మ దరసాలు, అషూరా ఖానాలు తప్పనిసరిగా డిజిటల్ రిజిస్ట్రేషన్ చేయిం చుకోవాలని వక్ఫ్ సంస్థల నిర్వాహకులకు ఏపీ వక్ఫ్ బోర్డు ఛైర్మన్ జనాబ్ అ బ్దుల్ అజీజ్ పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖాదర్‌బాషా, నాయకులు అక్బర్, నన్నేసాహెబ్, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

మహిళను బెదిరించి.. బంగారు నగల చోరీ

వెంకటాచలం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మహిళను కత్తితో చంపేస్తానని బెదిరించి ఆమె మెడలోని బంగారు నగలను ఓ దుండగుడు లాక్కెళ్లిన సంఘటన మండలంలోని తిక్కవరప్పాడు గ్రామంలో సోమవారం వేకువ జామున చోటుచేసుకుంది. బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తమలపాకుల సుగుణమ్మ ఇంటి వద్దకు వేకువజామునే ఓ గుర్తుతెలియని వ్యక్తి స్కూటీపై వచ్చి ఆపాడు. ఇంట్లోకి ప్రవేశించి సుగుణమ్మ గొంతుపై కత్తిపెట్టాడు. అరిస్తే చంపేస్తానని బెదిరించి, ఆమె ఒంటిపై ఉన్న బంగారు నరుడు, ఉంగరం, కమ్మలు మొత్తం మూడు సవర్లకు పైగా బంగారు నగలను లాక్కొని అక్కడ నుంచి పరారయ్యాడు. వెంటనే బాధితురాలు సుగుణమ్మ కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి వచ్చారు. జరిగిన ఘటనపై బాధితురాలు వెంకటాచలం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాకాణీ.. పద్ధతి మార్చుకో..!

ముత్తుకూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మాట్లాడే భాష పద్ధతి మార్చుకోకపోతే మాజీ మంత్రి కాకాణి గోవ ర్ధన్ రెడ్డిని ప్రజలే సర్వేపల్లి నియోజకవర్గం నుంచి తరిమికొడతారని మండల టీడీపీ అధ్యక్షుడు నేల మల్లికార్జున్ యాదవ్ హెచ్చరించారు. ముత్తుకూరు కార్యాలయంలో సో మవారం విలేకరుల సమావే శంలో మాట్లాడుతూ టీడీపీ ప్ర భుత్వం అధికారంలోకి వచ్చాక సర్వేపల్లిలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి కాకాణి తట్టుకోలేకపోతున్నాడన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అవినీతి అక్ర మా లకు పాల్పడ్డాడన్నారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి మాచి రెడ్డి శ్రీధర్‌రెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు రాగాల శివకృష్ణ, నాయకులు కొత్తపల్లి రమేష్, అలూరు విష్ణువర్ధన్‌రావు, పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీగణపతికి వెండి బక్కెట్, చెంబు విరాళం



వెండి బక్కెట్, చెంబు అందజేస్తున్న వెంకటరెడ్డి దంపతులు

బుచ్చిరెడ్డి పాళెం, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ శ్రీ మల్లికార్జున స్వామి, కామాక్షితాయి ఆలయంలో శ్రీ లక్ష్మీగణపతికి అభిషేక కార్యక్రమాల నిమిత్తం కాకుపల్లికి చెందిన ఎస్ వెంకటరెడ్డి, మనుజ దంపతులు సోమవారం 698. 160 గ్రాముల విలువైన వెం డి బక్కెట్, వెండి చెంబును ఆలయ ఈఓ ఏవీ శ్రీనివాసులు రెడ్డికి అందజేశారు. అర్చకులు లక్ష్మీ గణపతితోపాటు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, దాతలను శేష వస్త్రాలతో సత్కరించి, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

రేపు గంధ మహోత్సవం

ఉదయగిరి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి దుర్గంపై ఉన్న అబ్దుల్ ఖాదర్ ఖాదిర్సావలి గంధమహోత్సవం బుధవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హక్కుదారుల ఇంటి నుంచి గంధం మేళతాళాల నడుమ పట్టణ పురవీధుల్లో ఊరేగింపుగా దర్గాకు చేరుతుందన్నారు.

నీటి సంపులో పడి ఒకరి మృతి

వెంకటాచలం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెముడుగుంట పంచాయతీ బురాన్‌పూర్ సమీపంలోని పైపుల ఫ్యాక్టరీలో నీటి సంపులో పడి ఓ వ్యక్తి అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు నగరంలోని బీవీ నగర్ ఎన్‌జీఓ కాలనీలో నివాసం ఉంటున్న కాంతే ప్రకాష్ రావు (55) బురాన్‌పూర్ సమీపంలోని మహాలక్ష్మి పైపుల ఫ్యాక్టరీలో గత పదేళ్లగా అకౌంటెంట్‌గా పని చేస్తున్నాడు. కాగా రెండు రోజుల కిందట ఫ్యాక్టరీకి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు, బంధు వులు అన్నిచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం ఫ్యాక్టరీలోని నీటి సంపులో ప్రకాష్ రావు మృతదేహాన్ని తోటి ఉద్యోగులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు పరిశీలించారు. ప్రమాదవశాత్తు పడి చనిపోయి ఉండవచ్చని భావిస్తున్నారు. కానీ తప్పిపోయాడనుకున్న వ్యక్తి ఇలా నీటి సంపులో శవమై కనిపించడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా మృతుడిని ఎవరైన కొట్టి సంపులో పడేశారా? లేక ప్రమాదవశాత్తు అందులో మునిగి చనిపోయాడా..? అనేది పోస్టుమార్టం రిపోర్టులో తెలిసే అవకాశాలున్నాయి. మృతుడి సోదరుడు కాంతే చలపతి రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన వెంగబాబు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనియంపాడు గ్రామానికి చెందిన సంకే వెంగబాబు (33) అనే యువకుడు సమీప ప్రకాశం జిల్లా పామూరుకు చెందిన ఓ లాడ్జిలో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాల మేరకు... వెంగబాబు కొంతకాలంగా బెంగళూరులో ఫాస్టుఫుడ్ సెంటర్ నిర్వహిస్తూ జీవనం సాగించేవాడు. ఈనేపథ్యంలో గత నెలలో కొంత నగదు అవసరమై బంధువులకు ఫోన్ చేయడంతో వారు సర్దుబాటు చేశారు. అనంతరం ఎలాంటి పరిస్థితులు చోటు చేసుకున్నాయో ఏమోగానీ వారం రోజుల క్రితం బెంగళూరు నుంచి నేరుగా పామూరుకు చేరుకొని లాడ్జీలో గదిని అద్దెకు తీసుకొని అక్కడే ఉంటున్నాడు. ఆతరుణంలో గది తలుపులు తీయకపోవడంతో సిబ్బందికి అనుమానం వచ్చి పోలీసులతో పాటు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు తాళాలు పగులగొట్టి ఆత్మహత్యకు పాల్పడినట్లు నిర్ధారించారు. అనంతరం కేసు నమోదు చేసి మృతదేహానికి కనిగిరిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గంజాయి అక్రమ రవాణాపై దాడులు

- నలుగురు రౌడీషీటర్ల అరెస్ట్
- దర్గామిట్ట స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కళ్యాణరాజు

నెల్లూరు(క్రైం), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై పోలీసులు దాడులు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో మాగుంటలేవుట్ రైల్వే ట్రాక్ వద్ద, జీజీహెచ్ సమీపంలో గంజాయిని విక్రయిచేందుకు తరలిస్తున్న నలుగురు రౌడీషీటర్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి నాలుగు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం దర్గామిట్ట పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బీ కళ్యాణరాజు కేసు వివరాలను విలేకరులకు వెల్లడించారు. నగరంలోని టెక్కేమిట్టకు చెందిన ఎం ప్రవీణ్, లేక్‌వ్యూకాలనీకి చెందిన జే. మహేష్, సారాయి అంగడి సెంటర్‌కు చెందిన షేక్ ముక్తియార్, షేక్ అబ్దుల్ ముజీద్‌లపై దర్గామిట్ట పోలీసు స్టేషన్‌లో రౌడీషీట్లు ఉన్నాయి. వ్యసనాలకు బానిసైన వీరు ఈజీ మనీకోసం గంజాయి విక్రయాలకు తెరలేపారు. ఈ విషయమై దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ కళ్యాణరాజుకు సమాచారం అందింది. ఆదివారం రాత్రి ఆయన తన సిబ్బందితో కలిసి మాగుంట లేవుట్ రైల్వే ట్రాక్ సమీపంలో మహేష్, ప్రవీణ్‌లను అదుపులోకి తీసుకు న్నారు. వారి వద్ద నుంచి రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పోలీసు స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారించగా, నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి వద్ద నుంచి గంజాయిని కొనుగోలు చేసి, వాటిని చిన్నిచిన్న ప్యాకెట్లు చేసి విక్రయించేందుకు వెళుతున్నామని పేర్కొ న్నారు. దీంతో నిందితులను అరెస్ట్ చేశామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి రవాణా, విక్రయాలు, గంజాయి తాగడం చట్టరీత్యా నేరమన్నారు. స్టేషన్ పరిధిలోని ప్రజలు, తమ ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు, నిల్వలు, సేవనం, మద్యం అక్రమ రవాణా, అనధికార విక్రయాలు, నిల్వలు, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే 94407 96308, 112 నంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు.



రౌడీషీటర్ల వివరాలు తెలుపుతున్న దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ కళ్యాణరాజు

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

నెల్లూరురూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : రెండేళ్లుగా పరారీలో ఉన్న గంజాయి కేసులోని ఓ నిందితుడిని రూరల్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. సీఐ వేణు కథనం మేరకు, ఒడిస్సాకు చెందిన చిరంజీవి మండలంలోని నారాయణరెడ్డిపేటలో నివాసం ఉంటున్నాడు. 2023లో గంజాయి విక్రయాలకు పాల్పడేవాడు. అప్పట్లో ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పరారీలో ఉంటు వచ్చిన అతన్ని సోమవారం పక్కా సమాచారంతో అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

లారీ - టిప్పర్ ఢీ



నుజ్జయిన టిప్పర్ ముందు భాగం

సంగం : మండల పరిధిలోని గురుకుల పాఠశాలకు ఎదురుగా ముంబాయి జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న బొగ్గు లారీని వెనుక వస్తున్న టిప్పర్ వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో టిప్పర్ ముందు భాగం నుజ్జయింది. ఈ సంఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయాల్లో చోరీ

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విరువూరుతో పాటు మారుతీ నగర్‌లోని రామాలయాల్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన సంఘటన సోమవారం వెలుగుచూసింది. వివరాల మేరకు... ఆదివారం రోజూమాదిరిగా పూజలు నిర్వహిం చిన భక్తులు తాళాలు వేసుకొని నివాసాలకు వెళ్లిపోయారు. సోమవారం ఉదయాన్నే అటుగా వెళ్లిన కొంతమంది ప్రధాన గేటు తాళాలు పగులకొట్టి ఉండడాన్ని గమనించి లోపలికి వెళ్లి పరిశీలిం చారు. దీంతో హుండీలను పగులకొట్టి అందులోని నగదును తీసుకెళ్లినట్లు గుర్తించారు. అలాగే సమీప కోటవర్ధినిపల్లి గ్రామం లోని చింతలపూడి రత్తయ్య నివాసంలోను చోరీకి పాల్పడిన దుండ గులు వరండాలోని చొక్కా జేబులో ఉన్న రూ. వెయ్యి నగదుతో సహా సెల్‌ఫోన్‌ను చోరీచేసి పరారయ్యారు. ఈవిషయమై గ్రామస్థులతో పాటు బాధితులు పోలీసులకు సమాచారమిచ్చారు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	150
స్కిన్ చికెన్	270
స్కిన్‌లెస్	294

కోడిగుడ్ల ధర (100): 670

కృష్ణుడిని ఏ రూపంలో చూసినా అందగాడే ! : చాగంటి

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణుడిని ఏ రూపంలో చూసినా అందంగానే ఉంటాడని చాగంటి కోటేశ్వరరావు తెలిపారు. నగరంలోని పురమందిరంలో ఆయన శంకరాచార్య కృత శ్రీజగన్నాథాష్టకం 3వరోజు సోమవారం చేసిన ప్రవచనం భక్తులను ఆకట్టుకుంది. యోగులకు జగన్నాథుడు పరిపూర్ణంగా, శ్రీకృష్ణుడిగా కనిపిస్తాడని తెలిపారు. నందనవనంలో ఉపనందుడు అనే వృద్ధుడు.. శ్రీకృష్ణుడు ఎక్కడ ఉంటే అక్కడ ఆపదలు వస్తున్నాయని బృందావనానికి వెళదామని చెప్పాడని చాగంటి తెలిపారు. బృందావనానికి వెళ్లేందుకు 3 కారణాలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఒకటోది కృష్ణుడిని ఆపదలో నుంచి రక్షించడం, రెండోది గోవులకు గ్రాసం సమృద్ధిగా లభించడం, మూడోది బృందావనం ప్రకృతి బాగుంటుందని కారణాలుగా చూపి బృందావనానికి బయలుదేరారని చాగంటి తెలిపారు. ఈ కార్యక్రమంలో చాగంటిని పూలమాలలో నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో అనంతబొట్ల వరప్రసాద్, పామర్తి బలరామమూర్తి, నాదెండ్ల సత్యనారాయణమూర్తి, శ్రీధర్, పేర్నాటి శేషారెడ్డి పాల్గొన్నారు.

చేపల చెరువులకు
వేలం వేస్తారా..?

భారీగా నష్టపోతున్న పంచాయతీలు

చెరువుల్లో చేపలు పట్టుకునే హక్కుకు వేలం నిర్వహణకు గడువు దాటింది. పంచాయతీ అధికారుల్లో స్పందన కనిపించడంలేదు. బహిరంగ వేలం ద్వారా భారీగా పంచాయతీలకు ఆదాయం వచ్చే అవకాశాలున్నా.. వాటిని సద్వినియోగం చేసుకునేందుకు అధికారులు చొరవ చూపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. 8 గ్రామాల్లో 10 చెరువులకు చేపలు పట్టుకునే హక్కుల కేటాయింపు ద్వారా నిధులు పంచాయతీలకు అందుతాయి. ఆ దిశగా గ్రామాధికారులు, పంచాయతీ డివిజన్ అధికారులు పట్టిపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పంచాయతీల్లో సర్పంచ్‌లకు పదవి కాలం ముగిస్తుండటంతో వేలం పాటలు లేకుండా అంతర్గత ఒప్పందాలు కుదురుతున్నాయన్న వాదనలు బయటకొస్తున్నాయి. జిల్లా అధికారులు జోక్యం చేసుకోకపోతే పంచాయతీలు భారీగా ఆదాయం కోల్పోయే అవకాశాలున్నట్లు ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



చెరువులో చేపలు పడుతున్న కూలీలు (ఫైల్)

● రెన్యువల్‌తో దులుపుకుంటారా..?

● 9 తటాకాలకు దాటిన గడువు

● అధికారుల్లో కానరాని చొరవ

నెల్లూరురూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పంచాయతీలకు ప్రధాన ఆదాయ వనరు చెరువుల్లో చేపల పట్టుకునే హక్కు.ఈ కేటాయింపుతో నిధులు రానున్నాయి. ఇవి ఒక్కొక్క పంచాయతీలో చెరువు విస్తీర్ణాన్ని బట్టి ఉంటాయి. అక్టోబరు, నవంబరు నెలల్లో బహిరంగ వేలం నిర్వహించి హక్కులను జూన్ నెలాఖరు వరకు కేటాయిస్తారు. ఇలా హక్కులు పొందిన వ్యక్తులు డిపాజిట్‌తో సంబంధం లేకుండా వేల పాట జరిగిన రోజే 25 శాతం నగదు చెల్లించి, మరో 15 రోజుల్లో మిగిలిన 75 శాతం నిధులు పంచాయతీ ఖాతాలో జమ చేయాలని, అనంతరం సదరు వ్యక్తుల పై పంచాయతీ అధికారులు హక్కులు కేటాయిస్తు రిజిస్ట్రేషన్ చేస్తారు. ఈ ప్రక్రియ నెల్లూరురూరల్లో ప్రతీ ఏటా జరుగుతూ వస్తుంది. కానీ ఈ ఏడాది అక్టోబరు, నవంబరులోపాటు పెట్టాల్సి ఉండగా డిసెంబరు వచ్చినకూడా గ్రామాధికారులు ఆ జోలికి వెళ్లలేదు. గొల్లందుకూరులో రెండు చెరువులు, సజ్జాపురంలో ఒకటి, పాత వెల్లంటిలో రెండు చెరువులు, కొత్తవెల్లంటిలో ఒకటి, కందమూరు, ములుముడి, సౌత్‌మోపూరు, మొగళ్ళపాళెం గ్రామాలలో ఒక్కోక చెరువుల చొప్పున వేలం పాటలు నిర్వహించేందుకు నీటి నిల్వలతో సిద్ధంగా ఉన్నాయి. కానీ ఆయా గ్రామాల సర్పంచ్, అధికారులు ఆ దిశగా చొరవ చూపడం లేదన్న ఆరోపణలు బలంగా వ్యక్తమవుతున్నాయి.

● **ఆదాయానికి భారీగా గండి**

చెరువుల్లో వేలం పాటలు నిర్వహించకపోవడం వల్ల స్థానిక గ్రామ పంచాయతీలు భారీగా ఆదాయం కోల్పోయే అవకాశాలున్నాయి. ఇంటి పన్ను, కుళాయి పన్ను వసూళ్లు ఎలాగూ లేవు. కనీసం చెరువుల ద్వారా పంచాయతీలకు వచ్చే ఆదాయానైనా ప్రజల అవసరాలకు ఖర్చు చేసేందుకు పాలకవర్గాలు చొరవ తీసుకోవడం లేదన్న విమర్శలు గుప్పుమంటున్నాయి. గతేడాది గొల్లకందుకూరులోని రెండు చెరువులు ద్వారా పంచాయతీకి రూ.20 లక్షల వరకు ఆదాయం సమకూరింది. ఇక సజ్జాపురంలో చెరువు వేలం ద్వారా రూ.12 లక్షలు పంచాయతీ ఖాతాలో జమైంది. కొత్త, పాతవెల్లంటి గ్రామాలలో రూ.11 లక్షల వరకు ఆదాయం రాగా, ములుముడి చెరువు రూ.10 లక్షలు, కందమూరులోని చెరువు రూ.5 లక్షలు, సౌత్‌మోపూరులోని రామ య్య చెరువు, మొగళ్ళపాళెంలోనిమరోక చెరువు ద్వారా రూ. 2 లక్షల వరకు పంచాయతీకి ఆదాయం సమకూరినట్లు తెలుస్తుంది. ఈ ఏడాది వీటిపై అదనంగా 5 నుంచ 10 శాతం పెంచి వేలం పాటలను చట్టప్రకారం నిర్వహిస్తే పంచాయతీలకు భారీగా ఆదాయం వచ్చే అవకాశాలున్నాయి.

● **రెన్యూవల్‌కు అంతర్గత ఒప్పందాలు**

వేల పాటలు కాకుండా చట్టవిరుద్ధమైన రెన్యూవల్‌ను తెరపైకి తీసుకువస్తున్న కొందరు సర్పంచి, గ్రామాధికారులు పంచాయతీలకు ప్రత్యక్ష మార్గాన వచ్చే ఆదాయాలను దారి మళ్లించేందుకు అంతర్గత ఒప్పందాలు చేసుకుంటున్నట్లు సమాచారం. చెరువుల్లో చేపటలు పట్టుకునే హక్కులను వేలం పాటల ద్వారానే కేటాయించాలి. పంచాయతీ రాజ్ చట్టంలో ఎక్కడ రెన్యూవల్ ప్రక్రియే లేదు. కానీ గత పాటదారులు నష్టపోయారని, అనుకున్న మేరకు వేలం పాటు జరగలేదని, చెరువుల్లో చేపలు పెరిగేందుకు సామర్థ్యంలేదన్న సాకులు చూపి ఆదాయాన్ని ఘనీయంగా తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాట్లు తెలుస్తుంది. జిల్లా అధికారులు జోక్యం చేసుకుని అర్హత కలిగిన చెరువులన్నీటికి వేలం నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.



నవాబుపేట పోలీసు స్టేషన్ పరిధిలో రాత్రి పూట రోడ్డుపై పోలీసులు

రాత్రిళ్లు తిరిగితే లాఠీ దెబ్బలే..!

● దుమ్ములేపిన పోలీసులు ● పరుగులు తీసిన యువకులు

నెల్లూరు(క్రైం) డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలో శాంతిభద్రతలు గాడి తప్పుతున్న నేపథ్యంలో పోలీసులు లాఠీలకు పని చెప్పారు. ఆదివారం సాయంత్రం నగరంలోని బోసుబొమ్మ వద్ద సీటీ బస్సు డ్రైవర్, కండెక్టర్‌పై కొందరు యువకులు బ్లేడ్‌లతో దాడి చేసిన ఘటనతో నగర పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి పోలీసులు నగరంలోని ఆరు పోలీసు స్టేషన్‌ల పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రాత్రి 10 గంటలు దాటిన తర్వాత నగర రోడ్లపై తిరుగుతున్న వాహనదారులును నిలిపి ఎక్కడకు వెళుతున్నారు, ఎందుకు అనవసరంగా రోడ్లపై తిరుగుతన్నారని ప్రశ్నించారు. పొంతన లేని సమాధానాలు చెప్పిన వారిపై, మందుబాబులపై పోలీసులు లాఠీ ఝులించారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు మాట్లాడుతూ అనవసరంగా రాత్రి పూట రోడ్లపైకి వస్తే సహించేది లేదని, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.





టైమెంత!?.. ఇప్పుడు ఇక్కడేం పని : రోడ్లపై తిరుగుతున్న యువకులను మందలిస్తున్న పోలీసులు

నగరంలో శాంతిభద్రతలు కాపాడాలి : వైసీపీ

నెల్లూరు(క్రైం) డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలో శాంతిభద్రతలు కాపాడాలని వైసీపీ నాయకులు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ డాక్టర్ అజితను కోరారు. వైసీ పీ నగర అధ్యక్షుడు, కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్ యాదవ్‌పై అన్యాయంగా పెట్టిన రౌడీషీట్‌ను ఎత్తివేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మీడియా తో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో శాంతిభద్రతలు క్షీణిచాయని, నగరంలో పట్టపగలే అల్లరి మూకలు హత్యలకు తెగబడుతున్నాయని, చిన్న చిన్న కారణాలతో క్షణికావేశంలో హత్యలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ ఇంచార్జ్ ఆనం విజయకుమార్‌రెడ్డి, నగర అధ్యక్షుడు బొబ్బల శ్రీనివాస్ యాదవ్, నాయకులు వేలూరు ఉమా మహేష్ పాల్గొన్నారు.

బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్‌గా మునిసురేష్

నెల్లూరురూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్‌గా నెల్లూరురూరల్ మండలం పెద్దచెరుకూరు సిరిగార్డెన్స్‌కు చెందిన మునిసురేష్‌ను ఆ పార్టీ సోమవారం ఎంపిక చేసింది. రాష్ట్ర బాధ్యతలు అప్పగించడం పట్ల తన బాధ్యత మరింతగా పెరిగిందని ఆయన తెలిపారు.

అక్రమ నిర్మాణాలను తొలగించండి

నెల్లూరు (సాంస్కృతికం) డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తమ స్థలాన్ని ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకుని, న్యాయం చేయాలని బట్వాడిపాలెంకు చెందిన గుర్రం ప్రభాకర్‌రావు కోరారు. సోమవారం జిల్లా జర్నలిస్టు భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ ప్రాంత హరిజనవాడలో, 1997లో పట్టాలు ఇచ్చి ఉన్నారని తెలిపారు. సర్వే నెంబరు 513లో తమ పెద్దల ద్వారా స్థలం, తమకు సంక్రమించిదని తెలిపారు. ఆ స్థలంలో తాము కొంత భాగం నివాసం ఉండేవారమని తెలిపారు. తమ స్థలాన్ని కొంతమంది ఆక్రమణదారులు, పట్టాలను సృష్టించుకుని ఆక్రమించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణ విషయమై కమిషనర్, టౌన్ ప్లానింగ్, సర్వేయర్‌లకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఉన్నతాధికారులు తమ సమస్యపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తన స్థలానికి ఎదుట కొంత మంది స్థలాన్ని ఆక్రమించి చికెన్ దుకాణం తెరిచారని, వారి పై చర్యలు తీసుకోవాలని కావలికి చెందిన శోభనాల సాయి సుస్మిత కోరారు. ఈ మేరకు పీజీఆర్ఎస్‌లో సోమవారం ఆమె కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం సుస్మిత మాట్లాడుతూ స్థలాన్ని ఆక్రమించి చికెన్ దుకాణం పెట్టడమేమిటని ప్రశ్నిస్తే, ఆక్రమించిన వారు తాము దళితులమని, ఎక్కడైనా షాపు పెట్టుకుంటామని, మరోసారి చికెన్ దుకాణాన్ని తొలగించమని కోరితే.. కులం పేరుతో తిట్టారని కేసుపెడుతామని బెదిరిస్తున్నారన్నారని తెలిపారు. వారిపై చర్యలు తీసుకొని, చికెన్ దుకాణాన్ని తొలగించేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు.

లోక్ అదాలత్‌కు వచ్చి కేసులు మాఫీ చేసుకోండి

● పన్ను బకాయిదారులకు కార్పొరేషన్ కమిషనర్ నందన్ సూచన



అర్జీదారులతో మాట్లాడుతున్న కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మొండి బకాయిల కింద తేలి, లీగల్ నోటీసులు అందుకున్న వారంతా ఈనెల 13న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌కు వచ్చి కేసులు మాఫీ చేసుకోవాలని కమిషనర్ నందన్ తెలిపారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆయన పాల్గొన్నారు.అనంతరం మీడియాతో మాట్లాడారు. మొండి బకాయిదారులందరికీ ఇప్పటికే నోటీసులు జారీ చేశామన్నారు. వారంతా సూచించిన మొత్తాన్ని జిల్లా న్యాయస్థానం వద్ద జరిగే లోక్‌అదాలత్‌లో చెల్లించి తమపై ఉన్న కేసులను మాఫీ చేసుకోవాలని స్పష్టం చేశారు. రూ. 27 కోట్ల వరకు పన్నులు, వాటి అపరాధ రుసుము కార్పొరేషన్‌కు రావాల్సి ఉందన్నారు. ముందుగా నగరంలోని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. 48 మంది వివిధ సమస్యలపై అర్జీలు అందచేశారు. ముందుగా 54వ డివిజన్ జనార్దన్‌రెడ్డికాలనీలో రోడ్డు మార్జిన్ ఆక్రమణల తొలగింపును సిటీప్లానింగ్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. నగరంలో కుక్కల బెడద తగ్గించాలని కోరుతూ సీపీఐ నాయకులు సిరాజ్, షాన్‌వాజ్‌లు కమిషనర్‌కు వినతి పత్రం అందచేశారు.

● **తాగునీటి సరఫరాకు అంతరాయం**

నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్దనున్న మంచినీటి పైపులైన్ మరమ్మతుల కారణంగా మంగళవారం నుంచి ఈనెల 11 వరకు 4,5,6,7,8,9,10 డివిజన్లతో పాటు 45,46 డివిజన్లకు తాగునీటి సరఫరా అంతరాయం ఏర్పడుతుందని కమిషనర్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన కోరారు.

11న ఎస్ఎఫ్ఐ జాతా



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు

నెల్లూరు (విద్య), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను నిర్మూలించేందుకు "డ్రగ్స్, గంజాయి అంతం-ఎస్ఎఫ్ఐ పంతం" అనే నినాదంతో జాతా నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వీ.నరేంద్ర తెలిపారు. సోమవారం నగరంలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలను ఈనెల 12 నుంచి 14 వరకు తిరుపతి జిల్లాలో నిర్వహిస్తున్నారన్నారు. నెల్లూరులో గంజాయి ముఠా చేతిలో హత్యకు గురైన పెంచలయ్యకు నివాళిగా జాత చేపట్టామన్నారు. ఈనెల 11న ఉదయం 10 గంటలకు వీఆర్‌సీ సెంటర్‌లో పెంచలయ్య జ్యోతితో జాతా నిర్వహించి అనంతరం తిరుపతి రాష్ట్ర సభలకు జ్యోతిని తీసుకెళతామని చెప్పారు. ఈ సమావేశంలో నేతలు అర్థం, విష్ణు, సుమంత్ పాల్గొన్నారు.

ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేయాలి

ఉదయగిరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలను కలిపి ఉదయగిరి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని సోమవారం విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఇన్‌చార్జి తహసీల్దారు షాజియాకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన జిల్లాల, రెవెన్యూ డివిజన్ల పునర్విభజనలో ఉదయగిరికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. మా అభ్యంతరాన్ని పరిగణలోకి తీసుకొని ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన ప్రాంతంగా, జిల్లాలో అతిపెద్ద నియోజకవర్గంగా అనాదిగా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. గత ఆరు న్నరేళ్లుగా ఉదయగిరిని జిల్లా చేయాలని ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పునర్విభజనలో ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేయాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

కొనసాగుతున్న అయ్యప్ప మండల పూజలు

నెల్లూరు (సాంస్కృతికం) డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం మండల పూజలు వైభవంగా జరిగాయి. వేదాయపాలెంలోని అయ్యప్ప ఆలయంలో కేరళ సంప్రదాయ ప్రకారం మండల పూజల్లో తొలుత అయ్యప్పస్వామికి నిర్మాల్య దర్శనం, పాలభిషేకం, మహాగణపతిహోమం, ఆలయ ప్రాంగణమంతా వివిధ సుగంధ పుష్పాలంకరణతో స్వామివారికి ఉషః పూజ, శ్రీవేలి ఉత్సవం, కలశపూజ, నవకాభిషేకం, శ్రీవేలి ఉత్సవం నిర్వహించారు. సాయంత్రం పూలంగిసేవ, దర్శనం, మహాదీపారాధన, భగవతిసేవ, శ్రీవేలి ఉత్సవం, పడికర్పూర దీపం, హరిహరాసనం సేవలు జరిగాయి. ఈ సందర్భంగా భగవతి సేవలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండల పూజలకు పడిపూజ, అన్నదానం, రాత్రి స్వాములకు భిక్షకు దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, మంజులమ్మ దంపతులు, దువ్వూరు విజయభాస్కర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి దంపతులు, కృష్ణప్రసాద్‌రెడ్డి, షర్మిల ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమాలు అధ్యక్షుడు గూడల శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య పర్యవేక్షణలో జరిగాయి. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కత్తి మోహన్‌రావు, కేజీ శంకరన్, బొగ్గుల మురళీమోహన్‌రెడ్డి, పావలా ప్రసాద్, అశోక్ చంద్ర పాల్గొన్నారు.

హరనాథపురంలో ఉచిత వైద్య శిబిరం

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : హరనాథపురంలోని సాయినగర్ టీడీపీ కార్యాలయంలో సోమవారం 18వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పెనాక శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మదన్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. వైద్యపరీక్షలు, గుండె సంబంధ పరీక్షలు, ఎక్స్‌రే, ఈసీజీ, పరీక్షలు, రక్తపరీక్షలను ఉచితంగా నిర్వహించారు. అవసరమైనవారికి ఉచితంగా మందులు అందచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కో-క్లస్టర్ ఎస్‌కే ఖాదర్‌బాషా, కో-యూనిట్ ఇన్‌చార్జి పెనక సుదీప్‌రెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి కోడూరు వనజారెడ్డి పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన ఓ మహిళ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ మందులకు, టెస్టులకు కూడా డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నది. దీంతో కోమలి దంపతులకు సోమవారం నగరంలోని క్యాన్సర్ ఆసుపత్రిలో శ్రీగణేష్ సేవా మిత్ర మండలి ఫౌండేషన్ సభ్యత్వ చందాల ద్వారా రూ.5వేలు, ప్రోగ్రామింగ్ కో ఆర్డినేటర్ దండి సుమన్ రూ.2500 కలిపి మొత్తం రూ.7500 నగదు, పండ్లు, దుప్పట్లు అందించారు. ఈ కార్యక్రమంలో గణేష్ సేవా సమితి ఫౌండేషన్ చైర్మన్ గాలి శ్రీధర్, సుమన్, సుభాషిణి, తదితర సభ్యులు, పాల్గొన్నారు.

సైనికుల సంక్షేమానికి విరాళాలు ఇవ్వాలి

నెల్లూరు (విద్య), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి ప్రజలు విరాళాలు అందించాలని ఎన్‌సీసీ సెకండ్ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు కోరారు. కొండాయపాళెం వద్ద ఉన్న జిల్లా సైనికవెల్ఫేర్ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొని, ఆయన తమ వంతుగా విరాళాన్ని అందచేసి మాట్లాడారు. ప్రతీ ఏడాది సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తారన్నారు. మాజీ సైనికులు, వారి కుటుంబాల సంక్షేమార్థం దేశ ప్రజలు తమ బాధ్యతగా విరాళాలు అందచేసి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమాధికారి హరికృష్ణ, అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్లు నాగరాజు, పెంచలయ్య, అన్ని ప్రభుత్వ, మునిసిపల్ పాఠశాలల కేడెట్స్ పాల్గొన్నారు.



విరాళాలు అందచేస్తున్న ఎన్‌సీసీ అధికారులు

వృద్ధురాలి బ్యాగులో పర్సు చోరీ

ఆరు సవర్ల బంగారం, రూ.15వేల డబ్బు మాయం

నెల్లూరు(క్రైం), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై నడిచి వెళుతున్న వృద్ధురాలి బ్యాగును గుర్తుతెలియని వ్యక్తులు కత్తిరించి, అందులోని నగల పర్సును చోరీ చేశారు. ఈ ఘటన సోమవారం నగరంలోని కాపువీధి సమీపంలో చోటుచేసుకుంది. నార్తురాజుపాలెంలోని కమ్మపాలెంకు చెందిన వింధ్యావళి అనారోగ్యంతో సోమవారం బృందావనంలోని ఓ వైద్యశాలకు వచ్చారు. అనంతరం కాపువీధిలో వస్త్రాలు కొనుగోలు చేసేందుకు, ఆమె గాంధీబొమ్మ వద్ద నుంచి నడిచి వెళుతోంది. కాపువీధి సమీపంలోకి వచ్చేసరికి గుర్తుతెలియని దుండగులు ఆమె బ్యాగును కత్తిరించి, అందులోని నగల పర్సును దోచుకెళ్లారు. దుకాణం వద్దకు వెళ్లిన వృద్ధురాలు బ్యాగు కత్తిరించడంతోపాటు నగల పర్సు కనిపించకపోవడంతో సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పర్సులో ఆరు సవర్ల బంగారు ఆభరణాలు, రూ.15 వేలు నగదు ఉన్నట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు స్థానికంగా ఉన్న సీసీపుటేజ్‌లను పరిశీలించి, కేసు నమోదు చేశారు.

అమ్మో... ఆ బడికి మేంరాం!

● సౌత్‌మోపూరులో పెచ్చులూడుతున్న పాఠశాల భవనం



నెల్లూరురూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : 'అమ్మో.. ఆ పాఠశాలకు మేం రాం... అక్కడ ఏక్షణాన ఏం జరుగుతుందో భయంగా ఉంది. నిత్యం శ్లాబు పెచ్చులూడుతున్నాయి. లోపల ఉన్నంతసేపు భయంగానే ఉంటుంది'... అంటూ గిరిజన విద్యార్థులు భీతిల్లుతున్నారు. మండలంలోని సౌత్‌మోపూరు కనుజుల మిట్ట (గిరిజనకాలనీ) వద్ద ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉంది.అది పాత భవనం కావడంతో తరుచు శ్లాబు పెచ్చులూడుతుంది. పైగా శ్లాబు కుంగిఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని అటు విద్యార్థులు, ఇటువారి తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. శనివారం మధ్యాహ్నం భోజనం చేస్తున్న సమయంలో శ్లాబు పెచ్చులూడి కిందపడ్డాయి. ఆ సమయంలో విద్యార్థులంతా బయట ఉండటంతో గండం తప్పింది. జిల్లా అధికారులు స్పందించి పాఠశాలకు మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 30 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఊరికి దూరంగా ఉండటంతో తమ పాఠశాలను ఎవరూ పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు.

మాదక ద్రవ్యాల వ్యతిరేక
సదస్సుకు రండి : జేవీవీ

నెల్లూరు (వైద్యం) డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో ఈనెల 12న మాదక ద్రవ్యాల వ్యతిరేక సదస్సును నిర్వహిస్తున్నామని, ఈ సదస్సుకు రావాలని కలెక్టర్ హిమాన్షు శుక్లాను జనవిజ్ఞాన వేదిక ఆహ్వానించింది. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో వేదిక నేతలు కలెక్టర్‌ను కలిసారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చలపతి, జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ కాలేషా సాహెబ్, డాక్టర్ శీనూనాయక్ మాట్లాడారు. జిల్లాలో మాదక ద్రవ్యాలు అమ్మకాలు జోరుగా సాగుతున్నాయన్నారు. దీంతో పెద్ద ఎత్తున యువత పెడద్రోవ పడుతున్నారని వారు చెప్పారు. వారిలో నేరస్వభావం కూడా రోజురోజుకు పెరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థి దశ నుంచి యువత స్మగ్గింగ్ వైపు అడుగులు వేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయకుమార్, బుజ్జయ్య, కామయ్య తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు ఇచ్చిన ఆహ్వాన పత్రికను చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న జనవిజ్ఞాన వేదిక నాయకులు

తలుపులు తెరుచుకోని డీడీవో కార్యాలయం !!



ప్రజల చెంతకు సుపరిపాలన తేవాలనే లక్ష్యంతో ఇటీవల ఆత్మకూరు పట్టణంలో నూతనంగా ప్రారంభించిన డివిజనల్ అభివృద్ధి కార్యాలయం తలుపులు సోమవారం ఉదయం 10-45 గంటల వరకు తెరుచుకోలేదు. డివిజన్ పరిధిలో గ్రామ, వార్డు సచివాలయాల్లో సిబ్బంది రోజూ ఉదయం 9.30 నుంచి 10.30 లోపు కార్యాలయానికి వచ్చి హాజరువేయాలి. సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉండాలి. విధుల నిమిత్తం క్షేత్రస్థాయికి వెళ్లాలంటే మూమెంట్ రిజిస్టర్లలో సంతకం చేయాలి. అలాంటి సచివాలయాలను పర్యవేక్షించి అజమాషీ చేయాల్సిన డీడీవో కార్యాలయం తలుపులు సకాలంలో తెరవకపోవడం గమనార్హం. కాగా, ఉన్నతాధికారుల కార్యాలయాల్లో సమయపాలన పాటిస్తూ పర్యవేక్షిస్తే మండల కార్యాలయాలు, సచివాలయాల్లో సిబ్బంది సైతం సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించగలుగుతారు అనడంలో సందేహం లేదు.

- ఆత్మకూరు(ఆంధ్రజ్యోతి)

సీట్ల కోసం ఫీట్లు..

స్త్రీశక్తి పథకం అమలు నాటినుంచి ఆర్టీసీ బస్టాండ్లలో ప్రయాణికుల తాకిడి ఎక్కువైంది. ఏ బస్టాండ్, బస్సు చూసినా రద్దీగా ఉంటోంది. దీనికి తోడు బస్సులు సమయానికి రాకపోవడం, తగినన్ని బస్సులు లేవనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే కొందరు ప్రయాణికులు బస్టాండ్‌కు బస్సు రాగానే ఎగబడి ఎక్కడం, బస్సెక్కే సమయంలో తోపులాట చేసుకోవడం, సీట్ల విషయంలో వివాదాలకు దిగడం సర్వసాధారణమైంది. ఇక పట్టణాల్లో బస్సులు ప్రయాణికులతో నిండిపోవడంతో పల్లెవాసులు ఎక్కేందుకు ఇబ్బందులు పడడం, మరో బస్సు కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు రద్దీ ఉన్న ప్రాంతాల్లో ఎక్కువ సంఖ్యలో బస్సులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

- ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)





అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

గడువులోగా అర్జీలు పరిష్కరించాలి

● పరిష్కారం కాని వాటిపై వివరణ ఇవ్వాలి : కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు(వ్యవసాయం), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజల నుంచి భూసమస్యలతోపాటు ఇతర రెవెన్యూ అంశాలపై అర్జీలు ఎక్కువగా వస్తున్నాయన్నారు. వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలని ఆదేశించారు. పరిష్కరించలేని సమస్యలను ఎందుకు పరిష్కరించలేదో అర్థమయ్యేలా అర్జీదారులకు వివరించాలని ఆయన కోరారు.ఈకార్యక్రమంలో జేసీ మొగిలి వెంకటేశ్వర్లు, డీఆర్వో విజయకుమార్, జడ్పీ సీఈవో శ్రీధర్‌రెడ్డి, డీపీవో వసుమతి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు రఘురామరాజు తదితర అధికారులు పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా పంచాయితీరాజ్ శాఖ ఎస్ఈ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పీఎంజీఎస్‌వై పాతిక సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా పుస్తకావిష్కరణ నిర్వహించారు.

పోలీసు పీజీఆర్ఎస్‌కి 148 ఫిర్యాదులు

నెల్లూరు(క్రైం), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కి జిల్లా వ్యాప్తంగా 148 మంది తరలి వచ్చి వారి సమస్యలను ఎస్పీ అజిత వేజెండ్లకు వినతిపత్రాల రూపంలో అందించారు. వాటిని పరిశీలించిన ఎస్పీ ఆయా ప్రాంత పోలీసు అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించి చర్చించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ చట్టపరిధిలో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, రూరల్ డీఎస్పీ జీ శ్రీనివాస రావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మూఢం వచ్చింది... లగ్గాలకు ఆగాల్సిందే..!

● మూడు నెలలు ముహూర్తాల్లేవ్!

● ఇక ఫిబ్రవరిలోనే పెళ్లిళ్లు

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసమంతా పెళ్లిళ్లు, శుభకార్యాలతో జిల్లా అంతటా కనిపించిన సందడి మౌఢ్యమి (మూఢం) రాకతో ఒక్కసారిగా సైలెంట్ అయిపోయింది. వివాహం, గృహారంభం, గృహ ప్రవేశం వంటి కార్యాలకు మూడు నెలలు ముహూర్తాలు లేకపోవడంతో కల్యాణ వేదికలు వెలవెలబోతున్నాయి. నవంబరు నెల 26న ప్రారంభమైన శుక్ర మౌఢ్యమి, 2026 ఫిబ్రవరి నెల 17వతేదీ వరకు ఉంటుంది. అప్పటి వరకు శుభ గడియలు లేవని పండితులు చెబుతున్నారు. ఈ కాలంలో పెళ్లిళ్లు, నిశ్చితార్థం, గృహ ప్రవేశం, శంకుస్థాపన, దేవతా విగ్రహ ప్రతిష్ఠలు, కొత్తగా వ్యాపారాలు, బోర్లు తవ్వించడం, యాత్రలు వంటివి చేయరాదని సూచిస్తున్నారు. సీమంతం, నామకరణం, అన్నప్రాసన, నవగ్రహ శాంతులు, హోమాలు, నిత్య పూజలు, కార్యక్రమాలు వంటివి నిర్వహించుకోవచ్చంటున్నారు. సో... ఫిబ్రవరి మూడో వారం వరకు లగ్గాలకు ఆగాల్సిందే నన్నమాట.

రేపు విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

నెల్లూరు(క్రైం) డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని బుధవారం వెంకటచలం మండలంలోని కంపోటిజ్ రీజినల్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు ఏ మహమ్మద్ అయూబ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన వారు అలింకో సంస్థ ఇచ్చిన స్లిప్పు, ఆధార్‌కార్డు జెరాక్స్ కాపీని తీసుకురావాలని తెలిపారు.

ప్రతి శనివారం నో బ్యాగ్ డే!

● సృజనాత్మకంగా ప్రోత్సహించేందుకే నిర్వహణ

● ప్రభుత్వ పాఠశాలల్లో తప్పనిసరి

● జిల్లాకు రూ.14,47,000 విడుదల

చదువంటే... బండెడు పుస్తకాలు, ర్యాంకులే కాదు.. చదువంటే మనిషి సంపాదించుకునే జ్ఞానం...సంఘజీవిగా ఎలా మెదగాలో నేర్పే విజ్ఞానం...అయితే ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువంటే అర్థం మారిపోయింది. స్కూలుకు వెళ్లే చిన్నారులను చూస్తే విద్యార్థులా, బాలకార్మికులా...? అనే అనుమానం కలుగుతుంది. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం పాఠశాలల్లో నోబ్యాగ్ డేని అమలు చేస్తోంది. నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా శనివారం నో బ్యాగ్‌డేను అమలు చేయాలని ఎప్పుడో ఆదేశించింది. అయినా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక చర్యలకు ఉపక్రమించింది. ఇక కచ్చితంగా ప్రతీ శనివారం పాఠశాలల్లో నో బ్యాగ్ డే అమలు చేయాల్సిందేనని ఆదేశాలిచ్చింది. ఇందుకు ప్రత్యేకంగా నిధులను కూడా కేటాయించింది.



పాఠశాలలో నో బ్యాగ్ డే కార్యక్రమాల్లో చిన్నారుల ఆటలు

నెల్లూరు (విద్య), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలకు ప్రతీ శనివారం విద్యార్థులు బ్యాగులు తీసుకురావాల్సిన అవసరం లేదు. ప్రతిరోజూ నిర్వహించే తరగతులకు బదులుగా ఇతరత్రా పోటీలు నిర్వహించనున్నారు. ఇప్పటికే పాఠశాల విద్యాశాఖ అకడమిక్ క్యాలెండర్‌కు విడుదల చేసి, దాన్ని అనుసరించాలని ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థులకు కొత్తదనం ఉండేలా శనివారం రోజున క్విజ్‌లు, సమకాలీన అంశాలపై డిబేట్‌లు, సదస్సులు, వృత్తివిద్య అంశాలపై అవగాహన, క్రీడలు, రాజ్యాంగంపై మౌఖిక పోటీలు నిర్వహించనున్నారు. పాఠ్యాంశాలకు సంబంధించి అంశాలే అయినా రోటీన్‌గా కాకుండా మౌఖిక విధానంలో టెస్టులు నిర్వహిస్తున్నారు. ఇందువల్ల విద్యార్థులకు వారంలో ఒక రోజు కొత్తగా ఉండడంతో పాటు, కొత్త అంశాలపై అవగాహన పెరిగేలా కార్యక్రమాలను రూపకల్పన చేశారు. గతంలో నెలలలో మూడో శనివారం మాత్రమే దీన్ని అమలు చేయడం, అత్యధిక పాఠశాలల్లో ఈ విధానం అమలు కాకపోవడంతో ప్రభుత్వం మాత్రం దీన్ని ప్రతీ శనివారం అమలు చేయాలని స్పష్టం చేసింది. ఈ విద్యాసంవత్సరం నుంచి దీన్ని అమలు చేస్తున్నారు. ప్రభుత్వం నిధులు కూడా విడుదల చేసింది. ప్రాథమిక పాఠశాలలు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు వేర్వేరుగా నిధులు మంజూరు చేసింది. ఈ నిధుల సాయంతో కావాల్సిన సామగ్రిని కొనుగోలు చేసి పాఠశాలలకు అందిస్తున్నారు.

● ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ

ప్రతీ శనివారం రోజున 1, 2 తరగతుల విద్యార్థులకు పాడుకుందాం, సృజన, నటిద్దాం, మాట్లాడుకుందాం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 3, 4, 5 తరగతుల విద్యార్థులకు సృజన, పరిశుభ్రత, చదువుకుందాం, తోటకు పోదాం, విందాం వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. 6 నుంచి 10వతరగతి వరకు విద్యార్థులతో సృజనాత్మకత, విద్య, వైజ్ఞానిక నమూనాల రూపకల్పన, ఆటపాటలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో 2,576 పాఠశాలలకు రూ.14,47,000 మంజూరు చేశారు. వీటిలో ప్రాథమిక పాఠశాలలకు ఒక్కొక్కదానికి రూ.500లు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు రూ.1000ల చొప్పున నిధులు విడుదల చేసి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు

విధి నిర్వహణలో గుండెపోటు..

విద్యుత్ సబ్‌స్టేషన్ షిఫ్ట్ ఆపరేటర్ మృతి



గుండెపోటుతో మృతిచెందిన షిఫ్ట్ ఆపరేటర్ షఫీ (ఫైల్)

ఏఎస్ పేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో షిఫ్ట్ ఆపరేటర్ మృతిచెందిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి మండలంలోని దూబగుంట గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల మేరకు... ఆత్మకూరు మండలం నెల్లూరుపాళెం గ్రామానికి చెందిన షేక్ షఫీ దూబగుంట గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి నైట్ డ్యూటీకి వెళ్లిన ఆయన విధులలో ఉండగా అర్ధరాత్రి ఆకస్మాత్తుగా స్పృహతప్పి పడిపోయాడు. దీనితో తోటి ఉద్యోగులు ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించి గ్రామంలోని ఓ ఆర్ఎంపి వైద్యుడి దగ్గరకు తీసుకెళ్లి చికిత్స అందించి కొంత కోలుకోవడంతో సబ్‌స్టేషన్‌కు తిరిగి తీసుకొచ్చారు. కాగా, కొంత సమయానికే ఆయన మళ్లీ స్పృహ కోల్పోవడంతో ఆత్మకూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స అందించే లోపే మృతిచెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సైనికుల త్యాగాలు వెలకట్టలేనివి

● సాయుధ దళాల పతాక దినోత్సవ హుండీ డ్రైవ్‌లో కలెక్టర్ శుక్లా



సైనిక సంక్షేమ నిధికి విరాళం చెక్కును కలెక్టర్ శుక్లాకు అందచేస్తున్న మాజీ సైనికులు

నెల్లూరు(క్రైం) డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): దేశ రక్షణలో సైనికుల త్యాగాలు వెలకట్టలేమని, వారి సంక్షేమానికి ఉపయోగపడే సంక్షేమ నిధికి విరాళాల సమీకరణకు ప్రతీ ఒక్కరు సహకరించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం హుండీ డ్రైవ్ కార్యక్రమాన్ని కలెక్టర్ చాంబర్‌లో తమవంతు నగదు అందచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సైనిక సంక్షేమ నిధికి రూ.10 వేలు చొప్పున విరాళం అందజేసిన మాజీ సైనికులు మల్లికార్జున రావు, సైనిక సొసైటీ వారిని కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జేసీ ఎం. వెంకటేశ్వర్లు, డీఆర్వో విజయకుమార్, జిల్లా సైనిక సంక్షేమ అధికారి జీ. హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాకెట్ యుగంలోనూ.. 'రచ్చబండ' రాజ్యాంగమే!

● అన్ని సభలకూ అండ.. ఈ రచ్చబండే!

పల్లెలు దేశ ప్రగతికి పట్టుగొమ్మలు. ప్రపంచానికి పట్టెడన్నం పెట్టే.. కన్న తల్లులు! మరి.. సంపద సృష్టికర్తలైన రైతులు, వ్యవసాయ కూలీల సంక్షేమం కోసం.. వారి సాదకబాదకాలు చర్చించుకునేందుకు పల్లెల్లో కనీసం ఓ 'ప్రత్యేక వేదిక' లేకపోవడం నిజంగా దయనీయం. గత ప్రభుత్వంలో ఆర్భాటంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశామని ప్రగల్భాలు పలికిన నాటి పాలకుల అసమర్థతకు ఈ ఫొటో అద్దం పడుతోంది. గ్రామాలకు ఆర్థిక పరిపుష్టిని కలిగించే దిశగా జరిగిన ప్రయత్నాలూ గత ప్రభుత్వంలో శూన్యమే..అనడానికి ఈ చిత్రమే తిరుగులేని సాక్ష్యం. దశాబ్దాల క్రితం పంచాయతీల్లో గ్రామంలో జరిగే మంచి చెడుల గురించి ఇలా.. రచ్చబండలపై అందరూ కూర్చుని చర్చించుకునే వారు. అచ్చం అలాంటి ముచ్చటే సోమవారం గురివిందపూడి గ్రామంలో జరిగింది. కాకపోతే ఇది ప్రభుత్వ అధికారులు నిర్వహించిన గ్రామసభ. ఉపాధిహామీ పనులపై మూడురోజులుగా గడిచిన ఆర్థిక సంవత్సరంలో చేసిన ఉపాధిపను లపై అధికారులు తనిఖీలు చేశారు. అనంతరం ఇందుకు సంబంధించిన గ్రామసభను ఇదిగో.. ఇలా 'రచ్చబండ' పైనే నిర్వహిం చారు. ఎందుకంటే.. ఇక్కడ పంచాయతీ కార్యాలయానికి గానీ, సచివాలయానికి గానీ పక్కా భవనాలు నిర్మించలేదు. దీంతో గ్రామానికి సంబంధించి ఎలాంటి గ్రామసభలైనా ఇలాగే నిర్వహిస్తారు. కూలీలతో పాటే ఏపీవో రాజమ్మ, పంచాయతీ కార్యదర్శి జయంతి ఇతర సిబ్బంది నేల(రచ్చబండ)పైనే కూర్చుని గ్రామ సభను ముగించడం గమనార్హం.



గురివిందపూడిలో రచ్చబండపై ఉపాధి హామీ గ్రామసభ నిర్వహిస్తున్న ఏపీవో రాజమ్మ

- మనుబోలు, (ఆంధ్రజ్యోతి)

గోడకు సీసీ కెమెరా ఏర్పాటు



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సంగం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెయిన్ బజార్‌లోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద వేలాడుతున్న సీసీ కెమెరాను సోమవారం గోడకు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరా వేలాడుతుండడంతో ఆదివారం ఆంధ్రజ్యోతిలో వేలాడుతున్న నిఘానేత్రం అని కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన పోలీసులు సీసీ కెమెరాను గోడకు ఏర్పాటు చేశారు.

కలువాయిని తిరుపతిలో కలపొద్దు!

● ఒంటికాలిపై నిలబడి నిరసన, రాస్తారోకో

● దివ్యాంగులూ పోరుబాట

కలువాయి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కలువాయి మండలాన్ని తిరుపతి జిల్లాలో కలపొద్దంటూ నిరసనలు కొనసాగుతున్నాయి. సోమవారం నిరసనకారులు నల్లబ్యాడ్జీలు ధరించి ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. 'సేవ్ కలువాయి, తిరుపతి వద్దు.. నెల్లూరు ముద్దు' అంటూ నినాదాలు చేశారు. ఈ ప్రాంత ప్రజల మనోభావాలు అర్థం చేసుకుని ప్రభుత్వ పెద్దలు అనుకూలంగా నిర్ణయం తీసుకోవాలని వేడుకున్నారు. ఈ ఆందోళనతో సుమారు అరగంట పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. 'కలువాయి కోసం మేము సైతం' అంటూ వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో దివ్యాంగులు స్థానిక బస్టాండు సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీల నాయకులతోపాటు వ్యాపారులు, ఉద్యోగులు పాల్గొని సంఘీభావం తెలియజేశారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

రాపూరును నెల్లూరు జిల్లాలోనే ఉంచండి..

● కలెక్టర్‌కు రాపూరు జేఏసీ నాయకుల వినతి

రాపూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాలో ఉన్న రాపూరు మండలాన్ని తిరుపతి జిల్లాలో విలీనం చేయవద్దని, యథాతథంగా నెల్లూరు జిల్లాలోనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని మండల జేఏసీ నాయకులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం నెల్లూరు కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో వినతి పత్రం సమర్పించారు. నెల్లూరు జిల్లా నుండి తిరుపతి జిల్లాలో కలపడం వల్ల కలిగే నష్టాలను వివరించి, విలీనం ప్రక్రియను ఆపాలని కోరారు. అలాగే పెంచలకోన ఆలయ కమిటీ మాజీ చైర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి, తన అనుచరులతో కలిసి రాపూరు మండల రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎమ్మార్వో లక్ష్మి నరసింహంకు వినతిపత్రం అందజేశారు. మండల ప్రజల అభిప్రాయం మేరకు సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలని, తమ ఆత్మగౌరవాన్ని నిలబెట్టాలని కోరారు. 'సేవ్ రాపూరు.. సేవ్ నెల్లూరు' అంటూ నినాదాలు చేశారు.



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న చెన్ను తిరుపాల్ రెడ్డి, నాయకులు



కలెక్టర్ కార్యాలయంలో అధికారికి వినతి పత్రం అందచేస్తున్న రాపూరు వాసులు

ఎవరి కోసం విభజన సీఎం గారూ!

● జిల్లా విభజనను వ్యతిరేకిస్తూ కలెక్టరేట్ ఎదుట బీజేపీ ధర్నా



కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ, బీసీ సంఘాల నాయకులు

నెల్లూరు(వ్యవసాయం), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మండలాల విభజనను ఎందుకు.... ఎవరి కోసం చేస్తున్నారో సీఎం చంద్రబాబు జిల్లా ప్రజలకు సమాధానం చెప్పాలని బీజేపీ నాయకులు మిడతల రమేష్ అన్నారు. జిల్లాలోని రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలను తిరుపతి జిల్లాకు కేటాయించడంపై సోమవారం బీజేపీ, బీసీ సంక్షేమ సంఘం, బీసీవై పార్టీ సంయుక్తంగా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరువు సమయంలో పొదలకూరు, మనుబోలు ఆయకట్టుదారులకు నీటి సమస్యలు ఎదురవుతాయని, నెల్లూరు, తిరుపతి అధికారుల మధ్య కండలేరు జలాశయం మూలంగా జలవివాదాలు ఏర్పడతాయన్నారు. కేవలం ఇద్దరు, ముగ్గురు వ్యక్తుల కోసం నెల్లూరు నుంచి రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలను వేరుచేయడం దుర్మార్గమన్నారు. ఇంత అన్యాయం జరుగుతుంటే డీసీఎం పవన్ కళ్యాణ్ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు కందికట్ల రాజేశ్వరి, భైరి శ్రీనివాస్, నరాల సుబ్బారెడ్డి, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు సమాధి శ్రీనివాసులు, సోమ అనూరాధ, బీసీవై పార్టీ నేతలు హజరత్‌యాదవ్, సోమగోపాల్, మనోహర్, ఆనందు, నరేష్, చింతగింజల సుబ్రహ్మణ్యం, ప్రశాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు గంధ మహోత్సవం

ఉదయగిరి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి దుర్గంపై ఉన్న అబ్దుల్ ఖాదర్ ఖాదిర్వావలి గంధమహోత్సవం బుధవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హక్కుదారుల ఇంటి నుంచి గంధం మేళతాళాల నడుమ పట్టణ పురవీధుల్లో ఊరేగింపుగా దర్గాకు చేరుతుందన్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం భక్తులకు గంధం పంచడం జరుగుతుందన్నారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 12314
వెండి కిలో ధర	రూ. 183900
వెండి ఒక గ్రాము	రూ. 188.90

సమస్యల పరిష్కారం కోసం

సొసైటీ ఉద్యోగుల ధర్నా



బ్యాంకు ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సొసైటీ ఉద్యోగులు

ఉదయగిరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక కేంద్ర సహకార బ్యాంకు ఎదుట సోమవారం ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు, వరికుంటపాడు, మర్రిపాడు మండలాలకు చెందిన సొసైటీ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాష్ట్రంలో సహకార సంఘ యూనియన్ పిలుపు మేరకు ఈ ధర్నా చేపట్టామన్నారు. సహకార సంఘాల్లో పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలన్నారు. జీవో నెంబర్ 36ను అమలుపర్చి 2019, 2024 సంవత్సరానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ చేపట్టి మధ్యంతర భృతి ఇవ్వాలన్నారు. 2019 తర్వాత ఉద్యోగంలో చేరిన వారిని రెగ్యులర్ చేసి హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలన్నారు. అనంతరం మేనేజర్ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల సొసైటీల సీఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల కోసం దరఖాస్తుకు అవకాశం కల్పించాలి

● తహసీల్దారుకు ఆర్ఎంపీఐ సభ్యుల వినతి



తహసీల్దారుకు వినతిపత్రం అందచేస్తున్న ఆర్ఎంపీఐ సభ్యులు

సంగం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు రేషన్‌కార్డులు ఉండి వసతిలేక ఉమ్మడి కుటుంబంలో ఉన్నవారికి ఇంటి స్థలాలు, కాలనీ ఇళ్ల కోసం దరఖాస్తుకు అవకాశం కల్పించాలని ఆర్ఎంపీఐ (భారత విప్లవ మార్క్సిస్ట్ పార్టీ) ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దారు సోమ్లా నాయక్‌కు వినతి పత్రం అందచేశారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన హౌస్ హోల్డింగ్ మ్యాపింగ్ వల్ల ఇంటిస్థలానికి, పక్కాఇంటికి దరఖాస్తుకు అనర్హత చూపిస్తోందని. దీనివల్ల పలు పేద కుటుంబాలు పథ కాలకు నోచుకోవడం లేదన్నారు. అధికారులు స్పందించి హౌస్ హోల్డింగ్ మ్యాప్ యాప్‌లో డిలీట్ ఆప్షన్ కల్పించి ప్రభుత్వ పథకాలకు అర్హత కల్పించాలని కోరారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



దువ్వూరు వద్ద రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను పరిశీలిస్తున్న అధికారులు

సంగం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎన్‌హెచ్ రహదారి 67పై తరచుగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను సోమవారం అధికారులు పరిశీలించారు. మండల పరిధిలోని పెరమ, సంగం, దువ్వూరు వద్ద తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. జిల్లా ఎస్పీ అజితా వేజెండ్ల ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా డీఎస్పీ వేణుగోపాల్ మాట్లాడుతూ త్వరలో నేషనల్ హైవే అధికారులతో చర్చించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సీఐ గంగాధర్, ఎస్ఐ రాజేష్, ట్రైనీ ఇన్‌స్పెక్టర్ రాములు ఉన్నారు.

సంగమేశ్వరాలయ ఈనాం భూముల పరిశీలన



పొలాల వద్ద రికార్డులు పరిశీలిస్తున్న ఏసీ జనార్దన్‌రెడ్డి

సంగం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగమేశ్వరాలయ ఈనాం భూములను దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ జనార్ధన్ రెడ్డి సోమవారం పరిశీలించారు. సంగమేశ్వరాలయానికి సుమారు 12.44 ఎకరాల ఈనాం భూములు ఉన్నాయి. వీటిని ఆలయానికి సేవ చేసే భజంత్రీలు, పూజారులకు సాగు చేసుకునేందుకు అందచేశారు. ఏళ్లతరబడి వారి ఆధీనంలో ఉన్నాయి. వీరికి ఆలయానికి సేవ చేసుకుంటూ భూములను అనుభవించుకునే హక్కు మాత్రమే ఉంటుంది. విక్రయించే హక్కులేదు. కానీ ఇటీవల కొన్నిచోట్ల దేవదాయ ఈనాం భూములను విక్రయించారని ఆరోపణలు వెలువడడంతో ఆ శాఖ నివేదిక కోరింది. ఆమేరకు జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సంగమేశ్వరాలయ ఈనాం భూములను పరిశీలించారు. అయితే సంగా చెరువులోని 2.75 ఈనాం భూమిని విక్రయించినట్లు విచారణలో తేలింది. ఈమేరకు నివేదికను ప్రభుత్వానికి అందచేయనున్నట్లు ఏసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సంగమేశ్వరాలయ ఈవో రఘురామయ్య, సర్వేయర్ రాజ, ఆర్ఐ, వీఆర్వో తదితరులు ఉన్నారు.

తహసీల్దారు కార్యాలయం తనిఖీ

ఏఎస్ పేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని సోమవారం ఆత్మకూరు ఆర్డీవో పావని తనిఖీ చేశారు. ఈసందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం బియల్‌వోల సమావేశం నిర్వహించి ఎస్ఐఆర్ మ్యాపింగ్ గురించి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు అనిల్‌కుమార్, ఆర్ఐలు, వీఆర్‌వోలు, బియల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

కారు చోరీ కేసులో నిందితుల అరెస్ట్

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైకుంఠపురంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో ఓ కారును చోరీ చేసిన కేసులో సోమవారం నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ రఘునాథ్ తెలిపారు. ఉదయగిరి మండలం కృష్ణంపల్లి గ్రామానికి చెందిన రాజారెడ్డి తన కారు చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. దీంతో గాలింపు చర్యలు చేపట్టి చోరీకి పాల్పడిన సతీష్, గోపాల్, పాలాక్ష, సుబ్రమణ్యం అనే నిందితులను అరెస్టు చేసి ఉదయగిరి కోర్టులో హాజరు పరచడంతో పాటు కారును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

నత్తనడకన జలజీవన్ మిషన్ పనులు

● అధికారుల పర్యవేక్షణ లోపం.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ● ముందుకు సాగని పనులు ● నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం

సంగం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అధికారుల పర్యవేక్షణ లోపం.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా జలజీవన్ మిషన్ పథకం పనులు నత్తనడక నడుస్తున్నాయి. దీంతో ఇంటింటికీ కుళాయి ఏర్పాటుచేసి తాగునీటి సరఫరా చేయాలనే ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని కొరిమెర్ల, తలుపూరుపాడు, తరుణవాయి, దాసరిపాళెం, వంగల్లు, జండాదిబ్బ, అన్నారెడ్డిపాళెం, ఎస్‌వీఆర్‌పురం తదితర గ్రామాల్లో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సహకారంతో జలజీవన్ మిషన్ పథకానికి సుమారు రూ. 4 కోట్ల నిధులు ఆరు నెలల కిందట మంజూరు చేశారు. ఆమేరకు టెండర్లు పిలవగా అన్ని టెండర్లు ఒక్కరే దక్కించుకున్నారు.

నత్తనడకన సాగుతున్న పనులు

కాగా, పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఒక్కరే కావడంతో ఒక్కో గ్రామంలో పనులు మొదలుపెట్టడం కొంతమేర చేసి ఆపేయడం, తరువాత మరో గ్రామంలో పనులు ప్రారంభిస్తున్నారు. ఎక్కడ చేసినా 20 నుంచి 30శాతం పనులు చేసి ఆపేశారు. ఏ ఒక్క గ్రామంలో కూడా పూర్తిస్థాయిలో పనులు చేయకుండా అన్ని చోట్ల అరకొరగా చేయడంతో ఎక్కడా అందుబాటులోకి రాలేదు. పనులు నత్త నడక నడుస్తున్నాయి. కొరిమెర్లలో ఓవర్ హెడ్ ట్యాంకు పిల్లర్స్ పనుల వరకు చేసి ఆపేశారు. తలుపూరుపాడులో ఓవర్ హెడ్ ట్యాంకు పనులు ప్రారంభించి వదిలేశారు. తరుణవాయిలో బోరుపాయింట్ వేశారు. మెయిన్ పైపులైన్ వేసి నిలిపేశారు. అదేవిధంగా అన్నారెడ్డిపాళెం, జండాదిబ్బ, పడమటిపాళెంలో కూడా అరకొర పనులుచేసి వదిలేశారు. పనులు మంజూరై ఆరు నెలలవుతున్నా వంగల్లులో ఇంతవరకు ప్రారంభించలేదు. ఈనేపథ్యంలో వరుసగా వచ్చిన ముంథా, దిత్వా తుఫాన్‌ల ప్రభావంతో జలజీవన్ మిషన్ పనులు ముందుకు సాగడం లేదు.



కొరిమెర్లలో అసంపూర్తిగా ఉన్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు

పర్యవేక్షణ కరువు

జలజీవన్ మిషన్ పనులపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనులు సాగడం లేదని, పనుల్లో నాణ్యత కూడా అంతంత మాత్రమేనని స్థానిక నాయకులు ఆరోపిస్తున్నారు. అంతేకాక సంగం దళితవాడలో ఏడాది కిందట పూర్తయిన జలజీవన్ మిషన్‌లో వేసిన కుళాయిలకు ఇంతవరకు ఇంటింటికీ నీటి సరఫరా చేసిన దాఖలాలు లేవు. గ్రామస్తులడిగితే అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. దీంతో ఇంటింటికీ కుళాయి ఏర్పాటుచేసి తాగునీరు సరఫరా చేయాలనే ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోందని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు.

ఓటు మ్యాపింగ్ సర్వేపై సమీక్ష



ఓటు మ్యాపింగ్ సర్వేపై సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీవో పావని

సంగం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఆర్డీవో పావని బీఎల్‌వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఓటు మ్యాపింగ్ బూత్‌లవారీగా (సర్) సర్వేపై సమీక్షించారు. మ్యాపింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని బీఎల్‌వోలను ఆదేశించారు. అనంతరం సర్ సర్వేపై పలు సూచనలు సలహాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సోమ్లా నాయక్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఎంఈవోలను కలిసిన యూటీఎఫ్ కార్యవర్గం



ఎంఈవోలకు బ్యాగులు అందజేస్తున్న యూటీఎఫ్ కార్యవర్గ సభ్యులు

ఉదయగిరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో సోమవారం నూతనంగా ఎంపికైన యూటీఎఫ్ మండల కార్యవర్గం ఎంఈవోలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను కమిటీ ఎంఈవోలతో చర్చించింది. నూతన కమిటీకి వారు అభినందనలు తెలిపారు. అనంతరం ఎంఈవోలకు లగేజీ బ్యాగులు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ చంద్రశేఖర్ రెడ్డి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురేష్, మహ్మద్‌హనీఫ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ కమిటీ ఎంపిక

ఏఎస్ పేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఏఎస్ పేట మండల నూతన కమిటీ ఎంపిక కార్యక్రమం సోమవారం జరిగింది. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గంగాధర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. గౌరవ అధ్యక్షుడిగా షేక్ జిలాని పాషా, అధ్యక్షుడిగా ఎస్‌డి ఫయాజ్ అలీ, ప్రధాన కార్యదర్శిగా జి వెంకట రాజాలతో పాటు కోశాధికారి, సభ్యులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

చర్చి అభివృద్ధికి చేయూత

సంగం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగాలకండ్రికలో ఉన్న చర్చిలో ఫ్లోరింగ్‌కు టైల్స్ వేయించేందుకు ఎన్ఆర్ఐ ముత్యాల విజయచంద్ర సోమవారం ముందుకు వచ్చారు. ఆమేరకు చర్చిని పరిశీలించారు. అవసరమైన టైల్స్‌కు తన ట్రస్ట్ ద్వారా నగదు వెచ్చించి క్రిస్మస్ లోపు చర్చిని సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు



అల్లిక వీధిలో బ్లీచింగ్ చల్లుతున్న పారిశుధ్య సిబ్బంది

సీతారామపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అల్లిక వీధి, బెస్తకాలనీలలో పంచాయతీ కార్యదర్శి పిడుగు రవీంద్ర ఆధ్వర్యంలో పారిశుధ్య పనులను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి పిడుగు రవీంద్ర మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి వీధిలో పారిశుధ్య పనులు చేపట్టాలని, డ్రైనేజీలను శుభ్రం చేయించాలని, రోడ్ల పక్క చెత్తాచెదారాలను తొలగించి బ్లీచింగ్ చల్లాలని గ్రీన్ అంబాసిడర్లకు సూచించారు.

ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేయాలి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగులు

ఉదయగిరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలను కలిపి ఉదయగిరి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ చేయాలని సోమవారం విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఇన్‌చార్జి తహసీల్దారు షాజియాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన జిల్లాల, రెవెన్యూ డివిజన్ల పునర్విభజనలో ఉదయగిరికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. గత ఆరున్నరేళ్లుగా ఉదయగిరిని జిల్లా చేయాలని ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పునర్విభజనలో ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేయాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ, విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగులు షేక్ ఎండీ ఖాజా, దస్తగిరిఅహ్మద్, జిలానీ, గౌస్, జమీర్, మజీద్, సయ్యద్ జాఫర్‌మొహిద్దీన్ పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి



ఉదయగిరిలో అనధికార లేఅవుట్‌ను పరిశీలిస్తున్న నుడా అధికారులు

ఉదయగిరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అనధికార లేఅవుట్ల, భవన యజమానులు ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులైజేషన్ స్కీం)ను సద్వినియోగం చేసుకోవాలని నుడా అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి చంద్రశేఖర్ సూచించారు. సోమవారం పంచాయతీ అధికారులతో కలిసి ఉదయగిరి పట్టణంలో పలు అనధికార లేఅవుట్లు, భవన నిర్మాణాలను పరిశీలించి నిబంధనలను అతక్రమించిన వారికి నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ జిల్లాలో అన్ని మండలాలను, మున్సిపాలిటీలను నుడా పరిధిలోకి చేర్చడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనధికార లేఅవుట్లు, భవన నిర్మాణాలను రెగ్యులైజేషన్ చేసేందుకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. గతంలో 14 శాతం ఉన్న ఫీజును ప్రభుత్వం 7 శాతానికి కుదించిందన్నారు. జిల్లాలో 473 అనధికార లేవుట్లను గుర్తించగా ఇప్పటివరకు 100 మంది ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారన్నారు. పంచాయతీ పరిధిలో 300 చదరపు మీటర్ల స్థలంలో పది మీటర్ల ఎత్తులో నిర్మించే భవనాలకు మాత్రమే అనుమతి ఇస్తుందని, అంతకుమించి నిర్మాణాలు చేపడితే నుడా నుంచి అనుమతులు తప్పనిసరిగా పొందాలన్నారు. అనుమతులు పొందని లేఅవుట్ల, భవన యజమాలనుపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మోహన్‌రావు, నుడా సర్వేయరు గిరీష్‌కుమార్, ప్లానింగ్ సెక్షన్ పంచాయతీ కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, పంచాయతీ ఈవో కరీముల్లా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులను అధోగతి పాలుచేసే చట్టాలు వద్దు



నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘం నాయకులు

ఆత్మకూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దేశంలో వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసి రైతులను అధోగతి పాలుచేసే చట్టాలు వద్దని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆత్మకూరు మండల శాఖ ఆధ్వర్యంలో సోమ వారం నిరసన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన విత్తన చట్టం-2025, విద్యుత్ సంస్కరణల చట్టం-2025 ప్రతులను స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి లక్కు కృష్ణప్రసాద్ మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీలు విత్తనాలను విక్రయించుకునేందుకు సులువైన చట్టాలు చేశారని విమర్శించారు. విద్యుత్ సంస్కరణ చట్టం మరీ దారుణంగా ఉందన్నారు. విద్యుత్ సరఫరాలో ప్రైవేట్ వ్యక్తులను విద్యుత్ వ్యాపారంలోకి దించబోతుందన్నారు. ఈ విషయాలను ఆన్‌లైన్‌లో పెట్టి రైతుల సలహాలు, సూచనలు అడగడం అన్యాయమన్నారు. చదువుకోని గ్రామీణ రైతాంగం ఈ చట్టాల మీద తమ అభిప్రాయాలను వెలిబుచ్చే అవకాశంలేదని తెలిపారు. ఇలాంటి చట్టాలను కేంద్రప్రభుత్వం ఉపసంహరించుకోవాలని దేశంలోని 500 రైతు సంఘాలు ఆల్ ఇండియా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశాయన్నారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు కృష్ణమోహన్, రూరల్ ప్రజాసంఘం, కౌలురైతు సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, పెంచలయ్య, శ్రీనివాసులురెడ్డి, రైతులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి.. సురక్షితంగా ప్రయాణించండి : సీఐ



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్ఐలు

ఉదయగిరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి సురక్షిత ప్రయాణాన్ని సాగించాలని ఉదయగిరి సీఐ ఎన్ వెంకటరావు, ఎస్ఐ ఇంద్రసేనా రెడ్డిలు సూచించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి పట్టణ సమీపంలోని విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద 167-బీజీ జాతీయ రహదారిపై వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు వేసుకోవడంతోపాటు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఆటోవాలాలు పరిమితికి మించి ప్రయాణికులను చేరవేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా నిబంధనలు అతిక్రమించిన, సరైన పత్రాలు లేని పలు వాహనాలకు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్టీల చలో కలెక్టరేట్



చలో కలెక్టరేట్‌కు సిద్ధమైన గిరిజనులు

అనంతసాగరం డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తమకు జీవనోపాధి కల్పించాలని స్థానిక గిరిజన కాలనీకి చెందిన గిరిజనులు సోమవారం చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపట్టారు. గిరిజనుల సంక్షేమం కోసం ఎస్టీ కార్పొరేషన్ ద్వారా తమకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమానికి సీపీఎం నేతలు సంఘీభావం తెలిపారు.

నీటి సంపులో పడి ఒకరి మృతి

వెంకటాచలం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెముడుగుంట పంచాయతీ బురాన్‌పూర్ సమీపంలోని పైపుల ఫ్యాక్టరీలో నీటి సంపులో పడి ఓ వ్యక్తి అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు నగరంలోని బీవీ నగర్ ఎన్‌జీఓ కాలనీలో నివాసం ఉంటున్న కాంతే ప్రకాష్ రావు (55) బురాన్‌పూర్ సమీపంలోని మహాలక్ష్మి పైపుల ఫ్యాక్టరీలో గత పదేళ్లగా అకౌంటెంట్‌గా పని చేస్తున్నాడు. కాగా రెండు రోజుల కిందట ఫ్యాక్టరీకి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు, బంధు వులు అన్నిచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం ఫ్యాక్టరీలోని నీటి సంపులో ప్రకాష్ రావు మృతదేహాన్ని తోటి ఉద్యోగులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు పరిశీలించారు. ప్రమాదవశాత్తు పడి చనిపోయి ఉండవచ్చని భావిస్తున్నారు. కానీ తప్పిపోయాడనుకున్న వ్యక్తి ఇలా నీటి సంపులో శవమై కనిపించడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా మృతుడిని ఎవరైన కొట్టి సంపులో పడేశారా? లేక ప్రమాదవశాత్తు అందులో మునిగి చనిపోయాడా..? అనేది పోస్టుమార్టం రిపోర్టులో తెలిసే అవకాశాలున్నాయి. మృతుడి సోదరుడు కాంతే చలపతి రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన వెంగబాబు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనియంపాడు గ్రామానికి చెందిన సంకే వెంగబాబు (33) అనే యువకుడు సమీప ప్రకాశం జిల్లా పామూరుకు చెందిన ఓ లాడ్జిలో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాల మేరకు... వెంగబాబు కొంతకాలంగా బెంగళూరులో ఫాస్టుఫుడ్ సెంటర్ నిర్వహిస్తూ జీవనం సాగించేవాడు. ఈనేపథ్యంలో గత నెలలో కొంత నగదు అవసరమై బంధువులకు ఫోన్ చేయడంతో వారు సర్దుబాటు చేశారు. అనంతరం ఎలాంటి పరిస్థితులు చోటు చేసుకున్నాయో ఏమోగానీ వారం రోజుల క్రితం బెంగళూరు నుంచి నేరుగా పామూరుకు చేరుకొని లాడ్జీలో గదిని అద్దెకు తీసుకొని అక్కడే ఉంటున్నాడు. ఆతరుణంలో గది తలుపులు తీయకపోవడంతో సిబ్బందికి అనుమానం వచ్చి పోలీసులతో పాటు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు తాళాలు పగులగొట్టి ఆత్మహత్యకు పాల్పడినట్లు నిర్ధారించారు. అనంతరం కేసు నమోదు చేసి మృతదేహానికి కనిగిరిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గంజాయి అక్రమ రవాణాపై దాడులు

● నలుగురు రౌడీషీటర్ల అరెస్ట్

● దర్గామిట్ట స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కళ్యాణరాజు

నెల్లూరు(క్రైం), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై పోలీసులు దాడులు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో మాగుంటలేవుట్ రైల్వే ట్రాక్ వద్ద, జీజీహెచ్ సమీపంలో గంజాయిని విక్రయించేందుకు తరలిస్తున్న నలుగురు రౌడీషీటర్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి నాలుగు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం దర్గామిట్ట పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బీ కళ్యాణరాజు కేసు వివరాలను విలేకరులకు వెల్లడించారు. నగరంలోని టెక్కేమిట్టకు చెందిన ఎం ప్రవీణ్, లేక్‌వ్యూకాలనీకి చెందిన జే. మహేష్, సారాయి అంగడి సెంటర్‌కు చెందిన షేక్ ముక్తియార్, షేక్ అబ్దుల్ ముజీద్‌లపై దర్గామిట్ట పోలీసు స్టేషన్‌లో రౌడీషీట్లు ఉన్నాయి. వ్యసనాలకు బానిసైన వీరు ఈజీ మనీకోసం గంజాయి విక్రయాలకు తెరలేపారు. ఈ విషయమై దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ కళ్యాణరాజుకు సమాచారం అందింది. ఆదివారం రాత్రి ఆయన తన సిబ్బందితో కలిసి మాగుంట లేవుట్ రైల్వే ట్రాక్ సమీపంలో మహేష్, ప్రవీణ్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పోలీసు స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారించగా, నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి వద్ద నుంచి గంజాయిని కొనుగోలు చేసి, వాటిని చిన్ని చిన్న ప్యాకెట్లు చేసి విక్రయించేందుకు వెళుతున్నామని పేర్కొన్నారు. దీంతో నిందితులను అరెస్ట్ చేశామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి రవాణా, విక్రయాలు, గంజాయి తాగడం చట్టరీత్యా నేరమన్నారు. స్టేషన్ పరిధిలోని ప్రజలు, తమ ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు, నిల్వలు, సేవనం, మద్యం అక్రమ రవాణా, అనధికార విక్రయాలు, నిల్వలు, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే 94407 96308, 112 నంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు.



రౌడీషీటర్ల వివరాలు తెలుపుతున్న దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ కళ్యాణరాజు

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

నెల్లూరురూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : రెండేళ్లుగా పరారీలో ఉన్న గంజాయి కేసులోని ఓ నిందితుడిని రూరల్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. సీఐ వేణు కథనం మేరకు, ఒడిస్సాకు చెందిన చిరంజీవి మండలంలోని నారాయణరెడ్డిపేటలో నివాసం ఉంటున్నాడు. 2023లో గంజాయి విక్రయాలకు పాల్పడేవాడు. అప్పట్లో ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పరారీలో ఉంటు వచ్చిన అతన్ని సోమవారం పక్కా సమాచారంతో అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

లారీ - టిప్పర్ ఢీ



నుజ్జయిన టిప్పర్ ముందు భాగం

సంగం : మండల పరిధిలోని గురుకుల పాఠశాలకు ఎదురుగా ముంబాయి జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న బొగ్గు లారీని వెనుక వస్తున్న టిప్పర్ వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో టిప్పర్ ముందు భాగం నుజ్జయింది. ఈ సంఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయాల్లో చోరీ

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విరువూరుతో పాటు మారుతీనగర్‌లోని రామాలయాల్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన సంఘటన సోమవారం వెలుగుచూసింది. వివరాల మేరకు... ఆదివారం రోజూమాదిరిగా పూజలు నిర్వహించిన భక్తులు తాళాలు వేసుకొని నివాసాలకు వెళ్లిపోయారు. సోమవారం ఉదయాన్నే అటుగా వెళ్లిన కొంతమంది ప్రధాన గేటు తాళాలు పగులకొట్టి ఉండడాన్ని గమనించి లోపలికి వెళ్లి పరిశీలించారు. దీంతో హుండీలను పగులకొట్టి అందులోని నగదును తీసుకెళ్లినట్లు గుర్తించారు. అలాగే సమీప కోటవర్ధినిపల్లి గ్రామంలోని చింతలపూడి రత్తయ్య నివాసంలోను చోరీకి పాల్పడిన దుండగులు వరండాలోని చొక్కా జేబులో ఉన్న రూ. వెయ్యి నగదుతో సహా సెల్‌ఫోన్‌ను చోరీచేసి పరారయ్యారు. ఈవిషయమై గ్రామస్థులతో పాటు బాధితులు పోలీసులకు సమాచారమిచ్చారు

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	150
స్కిన్ చికెన్	270
స్కిన్‌లెస్	294

కోడిగుడ్ల ధర (100): 670

తెల్లగుంటలో మంచినీటి సమస్య పరిష్కరించాలి

బిట్రగుంట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ తెల్లగుంటలో నెల రోజులుగా నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామ ప్రజలు అధికారులను వేడుకొంటున్నారు. సోమవారం పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా తాగేందుకు నీరు లేక అవస్థలు పడుతున్నామన్నారు. అయినా పట్టించుకునే నాథుడులేడని ఆవేదన చెందారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రాజేంద్ర దృష్టికి పలుమార్లు తీసుకు పోయిన ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. మరమ్మతులకు గురైన పాత విద్యుత్ మోటర్ పనిచేయకపోవడం వలన ఈ సమస్య నెలకొం దన్నారు. దీంతో కాలువలో నీటితో దుస్తులు శుభ్రం చేసుకోవడం, రూ.15 చొప్పున క్యాన్ వాటర్ కొనుగోలు చేస్తూ జీవిస్తున్నామని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

కంపు కొడుతున్న రోడ్లు!


సినిమా హాల్ రోడ్డులో మడుగు కట్టిన మురుగు, దుర్వాసనకు ముక్కు మూసుకుని వెళుతున్న వ్యక్తి

● అవస్థల్లో ప్రజలు ● నిద్రమత్తులో అధికారులు

కావలి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలో పలు రోడ్లల్లో మురుగు నిల్వ చేరి కంపు కొడుతోన్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో నివశించే ప్రజలు, వ్యాపారులు, పాదచారులు తీవ్ర అవస్థలు పడుతోన్నారు. అయినా మున్సిపల్ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు నిమ్మకే నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా పట్టణంలోని దేవాలయాలు, సినిమాహాళ్లకు వెళ్లే రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ మార్గంలో లత థియేటర్ ఎదురు రోడ్డు మురుగునీరు మడుగు కట్టి దుర్గంధం వెదజల్లుతోంది. ఈ మార్గంలో ప్రజలు రాకపోకలుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవటంలేదు. అక్కడ రోజురోజుకు మురుగు నీటి నిల్వ పెరుగుతున్నా వాటిని నివారించే వారే కరువయ్యారు. ఇది ఎక్కడో మారు మూల అనుకుంటే పొరపాటు.. పట్టణంలో అత్యంత రద్దీగా ఉండే రోడ్లలో సినిమాహాల్ రోడ్డు ఒకటి. ఆ రోడ్డులో మురుగునీరు నిల్వచేరి దుర్గంధం వెదజల్లుతున్నా అధికారులకు చీమ కుట్టినట్లుగా కూడా లేదు. ప్రధానమైన రోడ్డులో పరిస్థితి ఇలా ఉంటే ఇక మారుమూల ప్రాంతాల రోడ్లపై కన్నెత్తి చూసే దిక్కే ఉండరనిపిస్తోంది. అయ్యప్ప మాల, శివమాల వంటి మాలలు వేసుకున్న భక్తులు నిత్యం చెప్పులు లేకుండా దేవాలయాలకు ఆ మార్గంలో రాకపోకలు సాగించాల్సి ఉండగా ఆ మురుగునీటిలో అడుగు పెట్టక తప్పడం లేదు. లత థియేటర్‌కు ఎదురుగా ఉన్న వడ్డిపాలెం వెళ్లే రోడ్డులో మురుగు నీరు కాలువలు పూర్తిగా పూడిపోవడంతో ఆ నీరంతో సినిమామాల్ రోడ్డులోకి చేరి అంతా మురుగు నీటిమయం అవుతోంది. ప్రధాన వీధిలోకి మురుగు నీరు చేరి దుర్గంధం వెదజల్లుతున్నా అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారో అర్థం కావడం లేదు. ఈ ప్రాంతంలో పాదచారులు, రాకపోకలు సాగించే వాహన చోదకులు ముక్కు మూసుకోక తప్పడం లేదు. ఆ మురుగు నీటి వలన రోగాలు వచ్చే ప్రమాదం పొంచి ఉంది. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందించి అక్కడ మురుగు నీరు చేరకుండా తగు చర్యలు చేట్టాల్సి ఉంది.

● మలుపులో ప్రమాదకరంగా గుంత

పట్టణంలోని ట్రంకురోడ్డులో ఆర్డీవో కార్యాలయం వైపు వెళ్లే మలుపు వద్ద రోడ్డు పక్కన పెద్ద గుంత తీశారు. ఆ గుంతను ఎందుకు తీశారో తెలియదు కానీ దానిని పూడ్చకపోవడంతో దాని వలన ప్రమాదం పొంచి ఉంది. ఆర్డీవో కార్యాలయ మలుపు వద్ద ఉన్న ఆ గుంత వలన కార్యాలయానికి రాకపోకలు సాగించే వారితో పాటు ట్రంకురోడ్డులో రాక పోకలు సాగించే వారు కూడా ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే ఆ గుంతను పూడ్చి దాని వలన ప్రమాదాలు జరుగకుండా చూడాల్సి ఉంది.


ఆర్డీవో కార్యాలయం మలుపు వద్ద ఉన్న పెద్ద గుంత

డ్రంకన్ డ్రైవ్‌లో ఐదుగురి అరెస్ట్

● ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా

కావలి రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడిపిన ఐదుగురిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. వారికి ఒక్కొక్కరికి రూ.10 వేల వంతున జరిమానా విధించారు. పోలీసుల కథనం మేరకు.. పట్టణ సమీపంలోని ముసునూరు జాతీయ రహదారి టోల్‌ప్లాజా వద్ద సోమవారం రూరల్ సీఐ జీ.రాజేశ్వరరావు తమ సిబ్బందితో కలసి వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడుపుతున్న 5 మందిని అరెస్ట్ చేసి ప్రిన్సిపల్ సివిల్ కోర్టు న్యాయాధికారి ఎదుట హాజరుపర్చగా ఒక్కో వాహనదారుడికి రూ.10 వేల జరిమానా విధించారు. సీఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రమాదాలకు గురైతే కుటుంబాలు రోడ్డున పడుతాయన్నారు. గంజాయి, నిషేధిత మత్తుపదార్థాల అమ్మకాలు, అసాంఘీక శక్తుల నియంత్రణపై జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ప్రత్యేక చర్యలు చేపట్టారని తెలిపారు. పట్టణ, గ్రామ శివారు ప్రాంతాల్లో ఎక్కడైనా గంజాయి, మత్తుపదార్థాల అమ్మకాలు, వినియోగం జరుగుతున్నట్లయితే 9440796337కు సమాచారం ఇవ్వాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

నేడు పెన్షనర్ల క్రీడా పోటీలు

కావలి(టౌన్), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కావలి తాలూకా పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ఆల్ ఇండియా పెన్షనర్స్ డేని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని ఉదయగిరి రోడులోని మినీ స్టేడియం క్రీడా మైదానంలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు ఆకుల రమణయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

బంగారు కుటుంబాలకు రెడ్‌క్రాస్ భరోసా

● ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ ● ఒంటరి వృద్ధ మహిళలకు నిత్యావసర సరుకుల పంపిణీ


వృద్ధురాలికి నిత్యావసరాలు అందజేస్తున్న ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ, రెడ్‌క్రాస్ బాధ్యులు

కావలి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పీ-4 పథకంలో భాగంగా గిరిజన సామాజిక వర్గానికి చెందిన 42 బంగారు కుటుంబాలను కావలి రెడ్‌క్రాస్ దత్తత తీసుకున్నట్లు కావలి రెడ్‌క్రాస్ అధ్యక్షుడు, ఆర్డీవో ఎం.సన్నీ వంశీకృష్ణ తెలిపారు. అందులో భాగంగా ఐదుగురు ఒంటరి వృద్ధ మహిళలకు రెడ్‌క్రాస్ పాలక మండలి సభ్యులు జనిగర్ల మనోహర్ దాతృత్వంతో బియ్యం, నిత్యావసరాలను సోమవారం ఆర్డీవో చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ పట్టణ శివారులోని చెరు వు కట్ట గిరిజన సంఘంలో స్థానిక వార్డు సచివాలయ సిబ్బందితో కలిసి రెడ్‌క్రాస్ పాలక మండలి సభ్యులు బెజవాడ ప్రసన్నకుమార్ బృందం సర్వే చేసి 42 బంగారు కుటుంబాలను గుర్తించిందన్నారు. వాటిలో 10 కుటుంబాల యువతులకు కుట్టుశిక్షణ లేదా ఇతర నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామన్నారు. 30 కుటుంబాలలోని విద్యార్థులకు విద్యాపరమైన శిక్షణ, పాఠశాలలకు వెళ్లేందుకు సైకిళ్లు అందజేస్తామన్నారు. ఐదుగురు ఒంటరి వృద్ధ మహిళలకు ప్రతి నెలా బియ్యం, నిత్యావసరాలు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డీ.రవిప్రకాష్, ఉపాధ్యక్షుడు బెజవాడ రవికుమార్, వైస్‌చైర్మన్ కే.హరినారపరెడ్డి, పాలకమండలి సభ్యులు బెజవాడ ప్రసన్న కుమార్, జనిగర్ల మమోహర్, జిల్లా పాలకమండలి సభ్యులు కలికి శ్రీహరిరెడ్డి, జూనియర్ రెడ్‌క్రాస్ కన్వీనర్ గాదిరెడ్డి హరినాథ్ పాల్గొన్నారు.

ఇళ్లపై విద్యుత్ తీగల తొలగింపు

లింగసముద్రం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): లింగసముద్రంలోని రామకృష్ణాపురంలో ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్న 11 కేవీ విద్యుత్ వైర్లను అధికారులు, సిబ్బంది సోమవారం తొలగించారు. గ్రామంలో 10 ఇళ్లపై 11 కేవీ విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉండడంతో ఇటీవల గ్రామాన్ని సందర్శించిన కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఆ విద్యుత్ తీగలను తొలగించాలని అందకు అవసరమైన నిధులు గ్రామ పంచాయతీ నుంచి మంజూరుకు చర్యలు తీసుకున్నారు. దీంతో ఏఈ ఫిరోజ్, సిబ్బంది నివాసాలపై ఉన్న తీగలను తొలగించి ఇళ్లకు దూరంగా ఏర్పాటు చేశారు. దీంతో ఎన్నో ఏళ్ల నుంచి పరిష్కారం కాని సమస్యను ఎమ్మెల్యే నాగేశ్వరరావు పరిష్కరించడంతో బాధితులు ఆయనకు, డీఈ వీరయ్య, ఏడీఈ విజయ్‌బాబు, ఏఈ ఫిరోజ్, సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శికి కూడా కృతజ్ఞతలు తెలిపారు.

తీరప్రాంత పరిరక్షణలో భాగస్వాములు కావాలి

● అవగాహన కల్పించిన మెరైన్ సీఐ శేషయ్య


గ్రామకాపులు, పెద్దలతో మెరైన్ సీఐ, సిబ్బంది

కావలి రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తీరప్రాంత పరిరక్షణలో ఆ ప్రాంత వాసులు భాగస్వాములు కావాలని ఇస్కపల్లి మెరైన్ సీఐ సీహెచ్‌వీ. శేషయ్య పేర్కొన్నారు. మండలంలోని చెన్నాయిపాలెం పల్లెపాలెంలో సోమవారం తీరప్రాంత పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ సముద్రంలో తిరిగే బోట్లకు తప్పనిసరిగా రిజిస్టర్ చేయించుకోవాలని, బోట్ల పై భాగంలో పసుపు, కింది భాగంలో నీలిరంగు వేయించుకోవాలని సూచించారు. వేటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా లైఫ్ జాకెట్లు వేసుకోవాలని, సముద్రమార్గంలో మన దేశానికి ఉగ్రవాదులు ప్రవేశించకుండా, స్మగ్లింగ్ వంటి అక్రమరవాణా అరికట్టేందుకు తీరప్రాంత వాసులు మెరైన్ పోలీసులతో మమేకమై సహకారం అందించాలన్నారు. అలాగే మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లినప్పు డు కొత్తవ్యక్తులు, బోట్లు కనిపించినా వేట సాగించేటప్పుడు ఏదైనా ఆపద ఏర్పడినా వెంటనే కోస్టల్ సెక్యూరిటీ టోల్ ఫ్రీ నెంబరు 1093కు, కోస్టుగార్డు టోల్ ఫ్రీ నెంబరు 1554కు, ఇస్కపల్లి కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. కాగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తుమ్మలపెంట సముద్ర తీరాన్ని మెరైన్ సీఐ శేషయ్య సిబ్బందితో పరిశీలించారు. తీరప్రాంత పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు దిత్వా తుఫాన్ ప్రభావంతో తీరంలో ఏర్పడిన గుంటలను గజ ఈతగాళ్లతో గుర్తించి సూచిక చిహ్నాలను ఏర్పాటు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జానకిరామిరెడ్డి, వీఆర్వో మల్లికార్జున్, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్ కేశవరావు, సాగరమిత్ర సభ్యులు అరుణ, కృష్ణవేణి, గ్రామ కాపులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పసుపుకొమ్ముల ప్రాసెసింగ్‌పై శిక్షణ



పసుపుతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై మహిళలకు శిక్షణ ఇస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

కందుకూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పసుపు కొమ్ముల ప్రాసెసింగ్‌లో ఆధునిక సాంకేతికతను అనుసరించటం ద్వారా రైతులు మెరుగైన నాణ్యతతో పాటు అధిక ఆదాయం పొందవచ్చునని కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టరు జీ.ప్రసాద్‌బాబు తెలిపారు. కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టరు బీ. నిహారిక ఆధ్వర్యంలో పసుపు కొమ్ముల ప్రాసెసింగ్, విలువ జోడింపుపై నిర్వహించిన మూడు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్ర మం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో సాంప్రదాయ పద్ధతిలో పసుపు కొమ్ముల ప్రాసె సింగ్ 20 నుంచి 25 రోజులు పట్టేదని, ప్రస్తుతం ఆధునిక విధానంలో కేవలం 8 నుంచి 12 గంటల్లో పూర్తవడంతో పాటు పరిశుభ్రత, రంగు, కుర్కు మిన్ శాతం గణనీయంగా మెరుగవడంతో నాణ్యమైన పసుపుకొమ్ములను నిల్వచేసుకునే సదుపాయం ఉందని వివరించారు. పసుపుతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై హ్యాండ్ ఆన్ ప్రాక్టికల్ శిక్షణనూ అందించారు. పసుపు బిస్కెట్లు, పసుపు కేక్, పచ్చిపసుపు పికిల్, పచ్చిపసుపు పన్నీర్, పసుపు లడ్డూ, కోవా, బర్ఫీ, హల్వా, పసుపు పచ్చడి, పసుపు పంజీరి, చాక్లెట్ల తయారీ ప్రక్రియపై శిక్షణనిచ్చారు. పసుపు ఉత్పత్తులకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నందున వ్యాపారావకాశాలు విస్తారంగా ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ ఫుడ్‌ప్రాసెసింగ్ సొసైటీ ప్రతినిధి భానుచంద్ర మాట్లాడుతూ ప్రాసెసింగ్ యంత్రాల కొనుగోలుకు లభించే సబ్సిడీలు, దరఖాస్తు విధానం, అర్హతలను వివరించారు. కార్యక్రమంలో రైతులు, మహిళా రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు



విద్యార్థులను సత్కరిస్తున్న ఆక్స్‌ఫర్డ్ నిర్వాహకులు, అధ్యాపకులు

కందుకూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీఆర్ ఆక్స్‌ఫర్డ్ ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ విద్యార్థుల ఫేర్‌వెల్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. సాంప్రదాయ దుస్తులతో హాజరైన విద్యార్థినీ విద్యార్థులు నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం ఉత్తమ అధ్యాపకులను ఘనంగా సత్కరించటంతో పాటు గత విద్యా సంవత్సరంలో జేఈఈలో ఉత్తమ ర్యాంకులు సాధించి ఐఐటీ, ఎన్ఐటీలలో సీట్లు పొందిన విద్యార్థినీ విద్యార్థులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు బీ.నరేంద్రబాబు, జీ. బాలభాస్కర్, ప్రిన్సిపాల్ అబ్బూరి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


నగదు అందజేస్తున్న టీడీపీ నేతలు

కలిగిరి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమర గుడ్లదొన ఎస్సీ కాలనీలో ఆదివారం రాత్రి జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బుట్టి శ్రీనివాసులు ఇల్లు పూర్తిగా దగ్ధమై దుస్తులు, గృహోపకరణాలు, ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. ఈ ఘటనలో బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. ఈ విషయాన్ని స్థానిక టీడీపీ నేతలు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.10వేల ఆర్థిక సహాయం మంజూరు చేయించి టీడీపీ నాయకులు రాధాకృష్ణ, రమేష్‌ల ద్వారా సోమవారం బాధిత కుటుంబానికి అందజేశారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని స్థానిక నాయకులు పేర్కొన్నారు.

క్రీడాకారులకు అభినందన


క్రీడాకారులను అభినందిస్తున్న యాజమాన్యం

కావలి(టౌన్), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్శిటీ అంతర్ కళాశాలల క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి వివిధ క్రీడాంశాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను సోమవారం కళాశాలలో అభినందించారు. శ్రీసాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బాబావలి అధ్యక్షతన కరస్పాడెంట్ విజేతలను అభినందించి మాట్లాడారు. పీడీ వీ.శ్రీనివాసులు మాట్లాడుతూ అథ్లెటిక్స్‌లో తమ విద్యార్థులు 13 పతకాలు సాధించడమే కాక కబడ్డీలో వీఎస్‌యూ ఛాంపియన్లుగా నిలిచారన్నారు.

దుస్థితిలో సింగపేట గిరిజన కాలనీ

● వర్షం వస్తే మురికి కూపమే.. ● దశాబ్దాల కాలంగా ఇదే పరిస్థితి

అల్లూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని సింగపేట గిరిజన కాలనీ దశాబ్దాల కాలంగా దుస్థితిలో ఉంది. ఈ కాలనీలో కేవలం 42 కుటుంబాలు, 158 మందికిపైగా గిరిజన ప్రజలు నివశిస్తున్నారు. ఈ కాలనీ ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు ఈ ప్రాంతంలో ఏదైనా అభివృద్ధి జరిగింది అంటే కేవలం సిమెంటు రోడ్డు నిర్మాణం మాత్రమే. సాధారణంగా సిమెంటు రోడ్డు నిర్మాణం చేపడితే అందుకు అనుగుణంగా సైడ్ డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలి. అయితే ఇక్కడ ఆ పరిస్థితి లేదు. వర్షం వస్తే రోడ్లు సైతం మురికి కూపాలుగా మారిపోయి నిత్యం వ్యాధుల బారిన పడే వాతావరణంలో ఇక్కడి గిరిజనులు జీవిస్తున్నారు. ఈ గిరిజన కాలనీ ఏర్పాటు సమయంలో రోడ్డుకు, గ్రామానికి లోతట్టు ప్రాంతం కావడంతో పూర్తిస్థాయిలో లెవలింగ్ చేయకుండానే స్థలాలు కేటాయించి హుటాహుటిన కాంట్రాక్టర్లు ఇళ్ల నిర్మాణం చేపట్టారు. దీంతో నేటికీ వీరికి డ్రైనేజీ సమస్య వెంటాడుతూనే ఉంది. సరైన రీతిలో లెవలింగ్ చేయకపోవడంతో ఈ కాలనీలో చేరిన వర్షపు నీరు, మురికి నీరు వెళ్లే వెసులుబాటు లేక నిల్వ చేరి ఇళ్ల ఆవరణలోనే మడుగులు కట్టి దోమల ఉత్పత్తికి కారణంగా మారుతోంది. గత రెండు దశాబ్దాలుగా అధికారులు, పాలకులు ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నామంటున్నారే తప్ప పట్టించుకున్న నాథుడే లేరు. గిరిజనాభివృద్ధి సంస్థ అధికారులైతే ఇటువైపు కనీసం తొంగి చూసిన దాఖలాలు లేవు. వీరికి ఏదో విధంగా సాయపడాలనే కుతూహలంతో స్థానిక నాయకులు అధికారుల వెంటపడి అలసిపోతున్నారే తప్ప ఫలితం లేకుండా ఉంది. కాగా గతంలో నిర్మించిన ఇళ్లు నాశిరకంగా ఉండడంతో ఆ ఇళ్లను వదిలి పక్కనే స్థలాల్లో గుడిసెలను ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారు. అవి ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి. ఇదిలా ఉండగా సింగపేట గ్రామం అల్లూరు నగర పంచాయతీలో చేర్చడంతో ఇక్కడ అభివృద్ధి పనులకు ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇప్పటికైనా కలెక్టరు, గిరిజనాభివృద్ధి శాఖాధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయా లని గిరిజనులు కోరుతున్నారు.


మురికి గుంటగా గిరిజన కాలనీలోని రోడ్డు


ఇళ్లు, రోడ్డు పక్కన నిలిచిన మురుగు నీరు

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి ఇరుముడి పూజ


చెన్నకేశవస్వామి ఆలయంలో ఇరుముడి పూజలో అయ్యప్ప మాలాధార భక్తులు

బిట్రగుంట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలోని పలు గ్రామాలకు చెందిన అయ్యప్పస్వామి మాల ధరించిన భక్తులు సోమవారం ఇరుముడి కట్టుకుని వేర్వేరుగా శబరిమలకు బయలు దేరారు. ఈ సందర్భంగా బోగోలు చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణం లో గురుస్వామి సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఇరుముడుల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దగదర్తి మండలం ఉలవపాళ్లలోని దక్షిణముఖ భక్తఆంజనేయ స్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోగోలు, గుడ్లూరు మండలాల నుంచి 41 మంది అయ్యప్పమాలధారణ భక్తులు శబరిమలకు బయలు దేరి వెళ్లారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలి

కొండాపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని వడ్డించాలని మండల విద్యాశాఖాధికారి-2 ఆనందరావు నిర్వాహకులకు సూచించారు. సోమవారం మండల పరిధిలోని తూర్పుజంగాలపల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల సమగ్ర వివరాలను నమోదు చేయాలన్నారు. అక్కడే విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనాన్ని చేశారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.


మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న ఎంఈవో ఆనందరావు

సహకార బ్యాంకు ఉద్యోగుల నిరసన


సహకార బ్యాంకు ఎదుట నిరసన తెలుపుతున్న సిబ్బంది

అల్లూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : తాము ప్రభుత్వం ముందుంచిన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని సహకార బ్యాంకులు, రూరల్ బ్యాంకుల అధికారులు, సిబ్బంది సోమవారం నిరసన తెలిపారు. అల్లూరు పీఏసీఎస్, కోఆపరేటివ్ రూరల్ బ్యాంకులు మూసివేసి తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ సహకార బ్యాంకు మేనేజరుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ముందుంచిన డిమాండ్లను నెరవేర్చాలని లేకుంటే ఈనెల 16న జిల్లాకేంద్ర సహకార బ్యాంకు, జిల్లా కోఆపరేటివ్ కార్యాలయం వద్ద ధర్నా చేపడతామన్నారు. అప్పుడు కూడా పరిష్కరించకుంటే రాష్ట్ర యూనియన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున విజయవాడలో ధర్నా చేపట్టేందుకు సిద్ధమవుతామని తెలిపారు. వీరికి అల్లూరు శాఖ మేనేజరు స్వప్న సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మహేష్ కుమార్, రాధయ్య తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో వసతులు కల్పించకపోవడం బాధాకరం

కావలి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల విద్యార్థు లు చదువుకునే సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో కనీస వసతులు కల్పించక పోవడం బాధాకరమని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి తెలిపారు. దళిత సంఘర్షణ సమితి అధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవో ఎం. సన్నీ వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లి మాట్లాడుతూ జిల్లాలో గతంలో 150 సంక్షేమ హాస్టళ్లు ఉండగా వాటిల్లో సగానికి పైగా తీసివేయడంతో ప్రస్తుతం 65 మిగిలాయన్నారు. ఈ హాస్టళ్లకు కూడా కిటికీలు, బాత్‌రూములకు తలుపులు సక్రమంగా లేవని, దోమల నివారణకు కిటికీలకు మెస్‌లు లేవన్నారు. మినరల్ వాటర్ లేదని, చలికి కప్పుకోవడానికి దుప్పట్లు లేవన్నారు. ఇలా హాస్టళ్లలో కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. హాస్టళ్లకు బడ్జెట్ ఉన్నప్పటికీ వసతులు సమకూర్చేందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. అల్లూరు, దగదర్తి మండలాల్లో ఒక్క హాస్టల్ కూడా లేదన్నా రు. దీంతో బడుగు బలహీన వర్గాల విద్యార్థులు చదువులకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నేతలు కమతం బాబు, జరుగుమల్లి విజయరత్నం తదితరులు పాల్గొన్నారు.


ఆర్డీవోకు వినతిపత్రం అందచేస్తున్న దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మల్లి, తదితరులు

నకిలీ వరి విత్తనాలతో నిండా మునిగిపోయాం


దెబ్బతిన్న వరిపంటను కలెక్టర్‌కు చూపుతున్న రైతులు

పీజీఆర్ఎస్‌లో రైతుల ఆవేదన

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): 'మా ప్రాంతంలో వరి ఎక్కువగా పండిస్తాం. ఓ డీలరు మమ్మల్ని మోసం చేసి నకిలీ వరి విత్తనాలు ఇవ్వడంతో నిండా మునిగిపోయాం' అని సూళ్లూరుపేట ప్రాంత రైతులు ఆందోళన వ్యక్తంచేశారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు హాజరై దెబ్బతిన్న వరి పంటను కలెక్టర్ వెంకటేశ్వర్‌కు చూపారు. 'సూళ్లూరుపేటలోని పూజిత ఆగ్రో సర్వీస్ సెంటర్‌లో సెప్టెంబరు నెలలో బీపీటీ 2782 నెంబరు వరి విత్తనాలను కొన్నాం. సూళ్లూరుపేటతో పాటు దొరవారిసత్రం, వరదయ్యపాళెం రైతులూ వీటిని కొన్నారు. పైరు నాటిన 20 రోజులకే పొట్టు వెన్ను రావడంతో తీవ్రంగా నష్టపోయాం. సుమారు 2వేల ఎకరాల్లో ఆ డీలర్ ఇచ్చిన నకిలీ విత్తనాల వల్ల పంట దెబ్బతింది. దీనిపై అడిగితే ఎలాంటి సమాధానం లేదు. ఆ కంపెనీ వాళ్లేమో వారికి సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. నకిలీ విత్తనాలు సరఫరాచేసి పూజిత ఆగ్రో సర్వీస్, అన్నపూర్ణ సీడ్స్‌పై క్రిమినల్ కేసులు నమోదుచేసి మాకు నష్టపరిహారం చెల్లించండి' అని కలెక్టర్‌కు భాస్కర్‌రెడ్డి, చలపతి, సుబ్బారెడ్డితో పాటు 20మంది రైతులు విజ్ఞప్తి చేశారు. దీనిపై విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని బాధిత రైతులకు కలెక్టర్ హామీ ఇచ్చారు. దీనిపై విచారించాలంటూ జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావును ఆదేశించారు.

పీజీఆర్ఎస్‌లో భూ సమస్యలే ఎక్కువ 6

15 నుంచి నో హెల్మెట్.. నో పెట్రోల్

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలలో దాదాపు 45 శాతం మరణాలు ద్విచక్ర వాహనదారుల మితిమీరిన వేగం, హెల్మెట్ లేకపోవడం వల్లే జరుగుతున్నాయని గణాంకాలు సూచిస్తున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఎస్పీ సుబ్బరాయుడి ఆదేశాల మేరకు పోలీసులు జిల్లా వ్యాప్తంగా హెల్మెట్‌పై అవగాహన కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో 15వ తేది నుంచి హెల్మెట్ లేకుంటే ద్విచక్ర వాహనాలకు పెట్రోలు పట్టకుండా నిబంధనలు అమలు చేయనున్నారు. ఇక, వెనుక కూర్చున్న వారూ హెల్మెట్ ధరించాలని పోలీసులు చెబుతున్నారు. సరైన రోడ్డు భద్రతా నియమాలు పాటించక ఎవరైనా మరణిస్తే.. ఆ కుటుంబం ఛిన్నాభిన్నం అవుతుందనేది గుర్తించాలని ఎస్పీ సూచించారు.

అంధ విద్యార్థి సాహసం

నంగిలి నుంచి పుత్తూరు దాకా హైవేపై స్కేటింగ్ మారథాన్

పిల్లల్లో డ్రగ్స్, మొబైల్ వ్యసనాలపై అవగాహన కల్పించడమే లక్ష్యం


చిత్తూరు శివారు ప్రాంతమైన వరిగపల్లె వద్ద హర్షవర్ధన్ స్కేటింగ్

చిత్తూరు అర్బన్/బంగారుపాళ్యం/శ్రీకాళహస్తి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పుట్టుకతోనే చూపులేదు. కానీ సెల్‌ఫోనుకు వ్యసనమై మిగతా పిల్లలూ కంటి చూపును కోల్పోకూడదు. డ్రగ్స్‌కు అలవాటుపడి జీవితాన్ని నాశనం చేసుకోకూడదు. ఈ దిశగా పిల్లల్లో అవగాహన కల్పించడానికి 11 ఏళ్ల అంధబాలుడు టాస్క్ రోడ్డు స్కేటింగ్ మారథాన్‌కు పూనుకున్నాడు. కర్ణాటక సరిహద్దులోని నంగిలి నుంచి సోమవారం ఉదయం 7గంటలకు ప్రారంభమైన స్కేటింగ్ యాత్ర పలమనేరు, బంగారుపాళ్యం, చిత్తూరు, తిరుపతి, శ్రీకాళహస్తి మీదుగా దాదాపు 230 కిలోమీటర్లు పూర్తి చేసుకుని పుత్తూరుకు చేరుకుంది. ఈ యాత్ర రాత్రి 10.20 గంటలకు శ్రీకాళహస్తి పట్టణ సమీపం ఊరందూరు వద్దకు చేరుకోగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి స్వాగతం పలికారు. బాలుడి ప్రతిభను అభినందించారు. ఇతడి తల్లిదండ్రులను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. బాలుడికి ప్రోత్సాహకంగా రూ.20 వేలు అందించారు. టీడీపీ నేత కన్నలి ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం యాత్ర పుత్తూరువైపు బయలుదేరింది. సోమవారం అర్ధరాత్రి దాటాక గమ్యస్థానాన్ని చేరుకునే అవకాశం ఉందని కోచ్ ప్రతాప్ తెలిపారు. ఈ సాహసాన్ని వజ్ర వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థల ప్రతినిధులు రికార్డు చేశారు. కాగా, హర్షవర్ధన్ స్కేటింగ్ చేస్తూ వెళ్లే మార్గంలో ముందు, వెనకాల పోలీసులతో పాటు అంబులెన్స్ కూడా వెళుతోంది.


ఊరందూరు వద్ద హర్షవర్ధన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎవరీ హర్షవర్ధన్?

తిరుపతిలో నివసిస్తోన్న ఏర్పేడు మండలం ఎండీ పుత్తూరుకు చెందిన మునిబాబు, రాజకుమారి దంపతులు కుమారుడు మురారి హర్షవర్ధన్. పుట్టుకతోనే అంధుడైన ఇతడు తిరుచానూరులోని నవజీవన్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. గతేడాది శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వేసవి శిక్షణ తరగతులకు హాజరయ్యాడు. ఇతడి ప్రతిభను గుర్తించిన కోచ్‌లు ప్రతాప్, ప్రేమనాథ్ స్కేటింగ్ నేర్పించారు. పుత్తూరులోని టాలెంట్ స్కేటింగ్ అకాడమీలో ఆరునెలలు శిక్షణ తీసుకున్నాడు. ఆరు నెలలుగా రోడ్డుపై వెళ్లేటప్పుడు వాహనాలతో పాటు ఎత్తుపల్లాలను దాటుకుని ఎలా వెళ్లాలో శిక్షణ తీసుకున్నాడు. పిల్లల్లో డ్రగ్స్, మొబైల్ వ్యసనాలపై అవగాహన కల్పించడమే తన మారథాన్ లక్ష్యంగా నిర్ణయించుకున్నాడు. శాప్ ఛైర్మన్ రవి నాయుడి దృష్టికి ఈ విషయం తీసుకెళ్లగా ఆయన తిరుపతి,చిత్తూరు జిల్లాల క్రీడాసాధికార సంస్థ అధికారులకు సహకారం అందించాలని సూచించారు. వ్యక్తిగతంగానూ ఆర్థికసాయం అందించారు.

11న ఎంపీపీ, వైస్‌ఎంపీపీ ఎన్నికలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలకు సంబంధించి ఏర్పేడు, వరదయ్యపాళెం ఎంపీపీ.. సత్యవేడు వైస్ ఎంపీపీ స్థానాలు ఖాళీ అయ్యాయి. వీటిని ఈనెల 11న ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ ఎన్నికలకు ఆయా ఎంపీడీవోలు ఏర్పాట్లు చేస్తున్నారు. వరదయ్యపాళెం ఎంపీపీ ఎన్నిక విషయంలో కోర్టు ఉత్తర్వుల కారణంగా వాయిదా వేసినట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. ఈఎన్నికలకు అబ్జర్వర్‌గా ఇన్‌ఛార్జి జేసీ మౌర్య వ్యవహరించనున్నారు.

నేటి నుంచి ఉపాధ్యాయ అర్హత పరీక్షలు

- జిల్లాలో 9, చెన్నైలో 3 కేంద్రాల ఏర్పాటు

తిరుపతి(విద్య), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏపీ ఉపాధ్యాయ అర్హత పరీక్షలు మంగళవారం నుంచి 21వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈ పరీక్షలకు తిరుపతిలోని జూపార్క్ సమీపంలోని అయాన్ డిజిటల్ జోన్, శ్రీరామ, అన్నమాచార్య, ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలు.. పుత్తూరులో వెంకట పెరుమాల్, గూడూరు ఆదిశంకర, నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలు, కోట ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలను కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. అలాగే చెన్నై కుంద్రత్తూరు సారధి నగర్‌లోని అయాన్ డిజిటల్ జోన్, చెంగల్పట్టు జిల్లా పొన్మార్‌లో డాక్టర్ కె. వాసుదేవ ఇంజినీరింగ్ కళాశాల, గుమ్మిడిపూండి, మంగవరం శ్రీ జయరాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలల్లో పరీక్షలుజరుగనున్నాయి. ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు, మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లుగా పరీక్షలను నిర్వహించనున్నట్లు డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు. నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరు. హాల్‌టికెట్, ఏదేని ఒరిజనల్ గుర్తింపు కార్డు తీసుకురావాలి.

తిరుపతిలో ఈట్ స్ట్రీట్

జోరుగా సాగుతున్న పనులు



తిరుపతి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న ఈట్ స్ట్రీట్ (ఫుడ్ కోర్ట్)కు వేగంగా అడుగులు పడుతోంది. ప్రస్తుత నగరపాలక సంస్థ కార్యాలయానికి ఎదురుగా ఉన్న అచ్యుత దేవరాయలు మార్గంలో ఈ పనులు చురుగ్గా సాగుతున్నాయి. 40 నుంచి 50 స్టాళ్లు ఏర్పాటు చేయనున్నారు. 8/16 సైజు గల 12 కంటైనర్లను స్టాళ్లుగా మార్చనున్నారు. మిగిలినవి నిర్దేశించిన ఖాళీ స్థలాన్ని స్టాళ్లుగా మార్చుకునేందుకు టెండరుదారుకు కేటాయించనున్నారు. రెండు నెలల్లో పూర్తి చేసి, ఫుడ్ కోర్టు అందుబాటులోకి తీసుకురానున్నట్టు కార్పొరేషన్ వర్గాలు చెబుతున్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఫుడ్ కోర్టు ఏర్పాటు చేయాలని ప్రయత్నాలు జరిగాయి. కపిలతీర్థం రోడ్డు, ఆర్టీసీ బస్టాండు ప్రాంతం, వెస్ట్ చర్చి ప్రాంతాలను పరిశీలించారు. కానీ కార్యరూపం దాల్చలేదు. కూటమి అధికారంలోకి వచ్చాక కమిషనర్ మౌర్య ఫుడ్ కోర్ట్‌పై ప్రత్యేక చొరవ చూపించారు. దాదాపు రూ.80లక్షలతో ఈట్ స్ట్రీట్ ఏర్పాటుకు కౌన్సిల్ ఆమోదం తీసుకుని అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఫుడ్ కోర్టులోని స్టాళ్లను టెండర్ల ద్వారా కేటాయించనున్నారు.

సంస్కృత వర్సిటీలో లైంగిక వేధింపులపై హోం మంత్రి ఆరా

తిరుపతి(నేరవిభాగం/విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో లైంగిక వేధింపుల కేసు దర్యాప్తు పురోగతిపై సోమవారం హోంమంత్రి అనిత ఆరా తీశారు. ఆమె ఎస్పీ సుబ్బరాయుడితో మాట్లాడారు. 'ఈ ఘటనకు సంబంధించి ఫిర్యాదురాగానే కేసు నమోదు చేశాం. దర్యాప్తు అధికారిగా డీఎస్పీభక్తవత్సలంను నియమించాం. బాధితురాలి వాగ్మూలం తీసుకోవడానికి డీఎస్పీ ఆధ్వర్యంలో వెస్ట్ సీఐ మురళీ మోహన్, అలిపిరి ఎస్ఐ అజిత, మహిళా కానిస్టేబుళ్లు ఒడిశావెళ్లారు. తిరుపతిలో దర్యాప్తు చేయడానికి మరో బృందాన్ని ఏర్పాటు చేశాం. ఇలా ఒక కేసులో రెండుబృందాలతో ముమ్మరంగా విచారణ చేపట్టాం' అని హోం మంత్రికి ఎస్పీ వివరించారు. ఈ కేసు దర్యాప్తు మరింత వేగవంతం చేసి బాధితురాలికి త్వరగా న్యాయంజరిగేలా చూడాలని మంత్రి అనిత ఆదేశించారు.

నేడు షిర్డి రైలు ప్రారంభం

తిరుపతి(సెంట్రల్), డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): తిరుపతి- షిర్డీ రెగ్యులర్ ఎక్స్‌ప్రెస్ రైలును మంగళవారం ఢిల్లీ నుంచి కేంద్ర మంత్రి సోమన్న వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా మంత్రి బి.సి.జనార్దన్‌రెడ్డి తిరుపతి కార్యక్రమంలో పాల్గొంటారని స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజరు సంజయ్ కుమార్ శ్రీవాత్సవ మంగళవారం తిరుపతికి చేరుకోనున్నారు ఈ ప్రారంభోత్సవ సభ ఏర్పాట్లను సోమవారం గుంతకల్లు అదనపు డివిజన్ మేనేజరు యు.సుధాకర్ పరిశీలించారు. డిప్యూటీ సీఈ వామనమూర్తి, డి.ప్రభాకర్, మాధవరావు, ఆర్కే సింగ్, సంజయ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

మీపై సీబీఐ కేసులున్నాయ్

- రిటైర్డు టీచరుకు సైబర్ నేరగాళ్ల బెదిరింపులు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మీపై సీబీఐ కేసులున్నాయంటూ తిరుపతిలోని ఓ విశ్రాంత ఉపాధ్యాయుడికి సైబర్ నేరగాళ్లు ఫోనుచేసి బెదిరించారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సైబర్ క్రైం పోలీసులు తెలిపిన ప్రకారం.. తిరుపతిలో ఒక రిటైర్డు టీచర్‌కు ఈనెల 6న ఫోను వచ్చింది. 'నేను సీబీఐ ఆఫీసు నుంచి మాట్లాడుతున్నా. మీ ఫోన్ నెంబరు నుంచి మహిళలకు అనుచిత మెసేజ్‌లు పంపిన కేసులో విచారణకు మీరు బెంగళూరుకు రావాలి' అని బెదిరించారు. ఆ తర్వాత తాము ఇండియన్ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్ నుంచి మాట్లాడుతున్నామని చెప్పారు. 'ఇప్పుడు పోలీసులకు కాల్ కనెక్టు చేస్తున్నాం. మీపై సీబీఐ కేసులున్నాయి. మీరు ఆధార్ కార్డు అమ్మడంతో.. మీ పేరిట బ్యాంకు అకౌంట్లు ఓపెన్ చేశారు. రూ.మూడు కోట్లకపైగా లావాదేవీలు జరిగాయి. ఈ కేసు సుప్రీంకోర్టుకు వెళ్లింది. దీనిపై పోలీసు అరెస్టు ఉంది. ఇంట్లో ఎవరికీ చెప్పొద్దు. గదిలోకి వెళ్లి డోర్ లాక్ చేసి మాట్లాడు. మీ వద్ద ఎంత డబ్బుందో చెప్పండి' అంటూ రిటైర్డు టీచర్‌ను మానసికంగా కుంగదీశారు. ఈ కేసుల్లో నిర్దోషిగా బయట పడాలంటే తక్షణం రూ.8 లక్షలు డిపాజిట్ చేయాలన్నారు. ఎక్కడో అనుమానం వచ్చిన ఆ రిటైర్డు టీచరు సోమవారం తిరుపతి సైబర్ క్రైం ఆఫీసులో ఫిర్యాదు చేశారు. అవి నకిలీ సైబర్ కాల్స్ అని, భయపడాల్సిన అవసరం లేదని సీఐ వినోద్‌కుమార్ భరోసా ఇచ్చారు. ఇలాంటి వాటిపై వెంటనే 112కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.

ఏఐ ఆధారిత వ్యవస్థతో తిరుమల ఆలయంలో అద్భుత ఫలితాలు

- ఐసీసీసీ పనితీరును వివరించిన అదనపు ఈవో


ఐసీసీసీలోని డ్యాష్ బోర్డు


వివరాలు వెల్లడిస్తున్న అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల ఆలయంలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(ఐసీసీసీ) అద్భుతమైన ఫలితాలను ఇస్తోందని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. మూడు నెలల కిందట తిరుమలలోని వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో ప్రారంభించిన ఐసీసీసీ సెంటర్ పనితీరును సీవీఎస్వో మురళీకృష్ణ, సెంటర్ నిర్వాహకులు జేపీ(వర్చువల్)తో కలిసి ఆయన మీడియాకు వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో కూడిన ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్ భవిష్యత్తులో మంచి దర్శనం చేయించేందుకు డేటా జనరేట్ సిస్టమ్‌కు ఎంతోగానో సహాయ పడుతుందన్నారు. ఎన్ఆర్ఐ దాతల సహకారంతో రూ.25 కోట్ల నుంచి రూ.30 కోట్ల బడ్జెట్‌తో ఐసీసీసీని ప్రారంభించామని, ఇప్పటికే రూ.16.5 నుంచి రూ.17 కోట్లు ఖర్చు చేసి అత్యాధునిక పరికరాలను సమకూర్చామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు కూడా ఈ వ్యవస్థపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, పలు సూచనలు చేశారన్నారు. అదనపు ఈవో వివరించిన దాని ప్రకారం..

ఏఐ ఆధారిత వ్యవస్థవల్ల ఉపయోగం ఇదీ..

దర్శనానికి ప్రతిరోజు ఎంతమంది భక్తులు వస్తున్నారు, ఏ కంపార్టుమెంట్లలో ఎంత సమయం వేచి ఉన్నారు, ఏ సమయంలో ఎంతమంది దర్శనం చేసుకుంటున్నారు, వారికి సకాలంలో అన్నప్రసాదాలు అందుతున్నాయా, కంపార్టుమెంట్లు ఏవైనా ఖాళీగా ఉన్నాయా వంటి వివరాలను ఈ వ్యవస్థ రికార్డు చేస్తుంది. ఎవరికి ముందు దర్శనం కల్పించాలో కూడా సూచన చేస్తుంది. కంపార్టుమెంట్‌లో 450 మందికి మించి భక్తులు ఉంటే వెంటనే రెడ్ అలర్ట్ ఇస్తుంది. ఒకవేళ తక్కువగా ఉంటే గ్రీన్ స్పేస్ కనిపిస్తుంది. వీరికి దర్శనానికి పట్టే సమయాన్ని కూడా తెలియజేస్తుంది. ఒక భక్తుడు ఎన్ని సార్లు దర్శనానికి వచ్చారు, ఏ సమయంలో ఎక్కడ ఉన్నాడు, ఎంత సమయంలో దర్శనం చేసుకున్నాడనే పూర్తి వివరాలు నమోదవుతాయి. ఇలా ప్రతి అంశం రికార్డు చేయడం ద్వారా దర్శన సమయాన్ని తగ్గించడానికి అవకాశం ఏర్పడుతుంది. అలాగే ట్రాఫిక్ నియంత్రణను మెరుగుపరిచేందుకు ఈ వ్యవస్థ కీలకంగా వ్యవహరించనుంది. ప్రస్తుతం తిరుమలలో, అలిపిరిలో ఎన్ని వాహనాలున్నాయి, ఎంత సమయం ఉన్నాయి, బ్లాక్ లిస్ట్‌లో ఉన్న వాహనాలేవైనా తిరుమలకు చేరుకున్నాయా, నో పార్కింగ్‌లో ఉన్న వాహనాలు ఎన్ని ఇలా ప్రతిదీ ఈ వ్యవస్థద్వారా తెలుసుకోవచ్చు. ఈ వ్యవస్థను మరింత మెరుగుపరిచేందుకు ప్రస్తుతం వైకుంఠం క్యూకాంప్లెక్స్1, 2తో పాటు నారాయణగిరి షెడ్లు, రింగురోడ్డులోని క్యూలైన్‌లో ఉన్న 69 గేట్లతో పాటు నడకమార్గాలు, అలిపిరిలో అదనంగా సుమారు 250 ఆధునిక కెమెరాలను ఏర్పాటు చేసి ఐసీసీసీకి అనుసంధానం చేయనున్నారు.

భవిష్యత్తులో ఇవీ ప్రయోజనాలు..

- కంపార్టుమెంట్లు, క్యూలైన్లలోని భక్తుల ఎమోషన్స్‌ని కూడా ఈ వ్యవస్థ ముందుగానే పసిగట్టి హెచ్చరిస్తుంది. ఏదైనా గొడవలు జరిగేట్టు ఉన్నా, అగ్నిప్రమాదాలు జరిగినా గుర్తించి ఆయా విభాగాల అధికారులకు సమాచారం చేరవేస్తుంది.
- పాతనేరస్థుల డేటాను కూడా ఈ వ్యవస్థలో పొందుపరుస్తారు. వీరిలో ఏవరైనా క్యూలైన్లు, కంపార్టుమెంట్లలోకి ప్రవేశిస్తే పసిగట్టి అలర్ట్ చేస్తుంది.
- ఎవరైనా తప్పిపోతే, ఆ వ్యక్తి ఫొటోను అప్‌లోడ్ చేసిన వెంటనే ఎక్కడ ఉన్నారో సులువుగా గుర్తిస్తుంది.
- ఎలక్ట్రికల్ వస్తువులతో పాటు నిషేధిత వస్తువులను గుర్తిస్తుంది.



సాయుధ దళాల పతాక దినోత్సవానికి
విరివిగా విరాళాలివ్వండి


తిరుచానూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన సైనికుల కుటుంబాలకు విరివిగా విరాళాలు అందజేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. సోమవారంరాత్రి కలెక్టరేట్‌లో ఆయన తన వంతు సాయంగా విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక్ సంక్షేమాధికారి కేవీ రాఘవులు, మాజీ సైనిక సంఘ ప్రతినిధులు మనోహర్‌రెడ్డి, ఆనందరెడ్డి, కేశవ, జయప్రకాష్‌రెడ్డి, జయప్రకాష్, వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

సాయుధ దళాల పతాక దినోత్సవానికి విరాళమిస్తున్న కలెక్టర్

నేటి ఎస్వీ యూనివర్సిటీ డిగ్రీ పరీక్షల రద్దు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో మంగళవారం నిర్వహించాల్సిన డిగ్రీ 3, 5వ సెమిస్టర్‌తో పాటు డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలు రద్దయ్యాయి. సాంకేతిక కారణాలతో ఈ పరీక్షలను రద్దు చేసినట్లు డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాళ్ళు, పరీక్షా కేంద్రాలకు ఎస్వీయూ పరీక్షల విభాగం సమాచారాన్ని పంపింది. బుధవారం నుంచి జరగాల్సిన పరీక్షలు యథావిధిగా ఉంటాయని సీఈ రాజమాణిక్యం తెలిపారు.

సర్వ దర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 17 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.69 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,343

తలనీలాలు సమర్పించినవారు: 26,505

పీజీఆర్ఎస్‌లో భూ సమస్యలే ఎక్కువ

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు జిల్లా వ్యాప్తంగా ప్రజలు తరలివచ్చారు. ముఖ్యంగా పింఛన్లు అందలేదని, ఇంటి పట్టాలకు స్థలం చూపలేదని, భూకబ్జాలపై చర్యలు తీసుకోవాలని, సంక్షేమ పథకాలు అందలేదని.. ఇలా వివిధ సమస్యలపై 308 అర్జీలు వచ్చాయి. అందులో భూ సమస్యలపైనే 184 ఉన్నాయి. అర్జీదారుల సమస్యలను విన్న కలెక్టర్ వెంకటేశ్వర్.. సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రతి అర్జీకి జవాబు ఇవ్వాలని నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని అధికారులను హెచ్చరించారు. కలెక్టర్‌తోపాటు డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీలు దేవేంద్రరెడ్డి, రోజ్మాండ్ తదితరులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

పరిహారం ఇవ్వండి



సూళ్లూరుపేట మండలం ఎర్ర బాళెం గ్రామసర్వేలో వంద అంకణాలకుపైగా మా భూమి పోర్టుకట్టకు పోయింది. మిగిలిన భూమి హైవేకు పోయింది. ఇప్పటివరకు పరిహారం ఇవ్వలేదు. భూమి లేకపోవడంతో కుటుంబ పోషణకష్టంగా మారింది.మీరైనా ఆదుకోండి.

- బాలమురళీకృష్ణ, దివ్యాంగుడు, సూళ్లూరుపేట

పొలానికి దారి కల్పించండి



అయ్యా.. నాకు చంద్రగిరి మండలం భీమవరం రెవెన్యూ లెక్కదాఖల్లో 56సెంట్ల భూమి ఉంది. అక్కడికి వెళ్లే దారిని కొందరు ఆక్రమించారు. అడిగితే దౌర్జన్యం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు మా పొలాలకు హద్దులు చూపడంలేదు. మీరైనా కనికరించి హద్దులు చూపించండి.

- చల్లా రవి, కందులవారిపల్లి చంద్రగిరి మండలం

వికలత్వ సర్టిఫికెట్ మంజూరు చేయండి



మా అబ్బాయి గోవర్ధన్‌కు రెండేళ్ల క్రితం నరాల బలహీనత ఏర్పడి నడవలేని స్థితికి చేరుకున్నాడు. వీల్‌చైర్‌కే పరిమితమయ్యాడు. ఆస్పత్రుల్లో చూపించినా ఫలితం కనిపించడం లేదు. మార్చిలో పదవ తరగతి పరీక్షలు రాయాల్సి ఉంది. డిజేబులిటీ సర్టిఫికెట్ మంజూరు చేయాలి.

- నాదముని, తొండవాడ, చంద్రగిరి మండలం



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు - ఆందోళన చేస్తున్న అఖిల భారతీయ జనసంఘ్ నాయకులు

ఇళ్లస్థలాలు మంజూరు చేయండి

వేదాంతపురం పంచాయతీ రాందాసు కాలనీలోని పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్ కోరారు. ఈ మేరకు కాలనీ వాసులతో కలిసి కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. గత ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసి స్థలం చూపించకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా న్యాయం చేయాలని కోరారు. జిల్లాలో భూకబ్జాలను ప్రోత్సహించే అధికారులను కఠినంగా శిక్షించాలని అఖిల భారతీయ జనసంఘ్ నేతలు సుధాకర్ చౌదరి, రమణారెడ్డి, విజయశంకర్, రాజేంద్రప్రసాద్ తదితరులు కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు.

మూడు చక్రాల వాహనం మంజూరు చేయండి



వికలత్వం కారణంగా వీల్‌చైర్‌కే పరిమితమయ్యాం. హోటల్‌లో కార్మికులుగా పనిచేస్తున్నాం. వికలత్వ కోటాలో మూడు చక్రాల మోటారు వాహనాన్ని మంజూరు చేసి ఆదుకోండి.

- జయశంకర్, జన్‌సుందర్‌రాజు, మదనంబేడు, సత్యవేడు

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

- డయల్ యువర్ సీఎండీకి 70 వినతులు



విద్యుత్ వినియోగదారుల సమస్యలను వింటున్న సీఎండీ శివశంకర్

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చూపకుండా చర్యలు చేపట్టాలని సీఎండీ శివశంకర్ ఆదేశించారు. తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు 'డయల్ యువర్ సదరన్ డిస్కం సీఎండీ' కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, లోఓల్టేజ్ సమస్య, వ్యవసాయ విద్యుత్ సర్వీసులు మంజూరులో జాప్యం, కాలిపోయి, చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్లు త్వరితగతిన మార్చాలి, విద్యుత్ లైన్లు మార్పు చేయాలంటూ.. వివిధ సమస్యలపై 70 వినతులు వచ్చాయన్నారు. వీటిలో కర్నూలు నుంచి 18, కడప 13, అనంతపురం 15, నెల్లూరు 3, శ్రీసత్యసాయి3, చిత్తూరు1, తిరుపతి11, నంద్యాల 6 చొప్పున ఉన్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దీర్ఘకాలంగా పరిష్కారం కాని సమస్యలను తన దృష్టికి తెస్తే ప్రాధాన్యమిచ్చి పరిష్కరిస్తామని చెప్పారు. టోల్ ఫ్రీ నెంబర్లు 1912, 1800 425155333 కి కాల్ చేసి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కె.గురవయ్య, పి.అయూబ్‌ఖాన్, కె.రామమోహనరావు, చీఫ్ జనరల్ మేనేజర్లు జె.రమణాదేవి, ఎస్.శోభావాలంటీనా, పి.హెచ్.జానకిరామ్, ఎం.మురళీకుమార్, కె.ఆదిశేషయ్య, ఎం.ఉమాపతి, జీఎంలు జి.చక్రపాణి, ఎం.కృష్ణారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, డి.సురేంద్రరావు, పి.భాస్కర్‌రెడ్డి, ప్రసాద్, వెంకట రాజు, విజయన్ పాల్గొన్నారు.

ఈతకెళ్లి యువకుడి మృతి



ఈశ్వరయ్య(ఫైల్‌ఫొటో)

వాకాడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈతకెళ్లిన యువకుడు నీటిలో మునిగి మృతి చెందిన ఘటన మండలంలోని గొల్లపాళెంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గొల్లపాళెం గ్రామానికి చెందిన విన్నమాల ఈశ్వరయ్య(37) సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో మహాలక్ష్మమ్మ దేవాలయం పక్కన ఉన్న గుంటలో ఈత కొట్టేందుకు దిగాడు. బయటకు రాకపోవడంతో స్థానికులు గాలించి మృతదేహాన్ని వెలికితీశారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని బాలిరెడ్డిపాళెం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

హామీ అమలు చేసేవరకు పోరాటం



విద్యాసంస్థల బంద్ పోస్టర్లను విడుదల చేస్తున్న జేఏసీ నాయకులు

గూడూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ అమలు చేసేవరకు శాంతియుతంగా పోరాటం సాగిస్తామని జేఏసీ కన్వీనర్ దశరథరామిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక టవర్ క్లాక్ సెంటర్ వద్ద జేఏసీ ఆధ్వర్యంలో రెండో రోజు రిలే దీక్ష నిర్వహించారు. సీపీఐ, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు దీక్షకు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ మాట్లాడుతూ గూడూరును తిరుపతి జిల్లాలో కలపడం వల్ల ప్రజలు, ఉద్యోగులు అవస్థలు పడుతున్నారన్నారు. నియోజకవర్గ ప్రజల ఇబ్బందులను గుర్తించిన చంద్రబాబునాయుడు, లోకేశ్ గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారని, తీరా జిల్లాల పునర్విభజనలో తుది ముసాయిదాలో ఈ అంశాన్ని చేర్చకపోవడంతో అన్యాయమన్నారు. గూడూరును నెల్లూరులో కలపాలని, లేనిపక్షంలో జిల్లా కేంద్రంగా ప్రకటించాలన్న డిమాండ్‌తో ఈ నెల 10వ తేదీన జేఏసీ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం విద్యాసంస్థల బంద్‌కు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, పవన్‌కుమార్, బాలకృష్ణంరాజు, శంకర్‌రెడ్డి, ప్రభాకర్, మనోజ్‌కుమార్, శశికుమార్, సునీల్ కుమార్, మణి, చంద్రమోహన్, నిరంజన్‌రెడ్డి, విజయ్‌కుమార్, మల్లికార్జున, శరత్, జమాలుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం



విరాళమిచ్చిన దాతలు

తిరుమల, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందింది. తిరుపతికి చెందిన భక్తవత్సలం, పీ చిరదీప్ కృష్ణ, ఉమా మహేశ్వరి ఈ విరాళాన్ని ఆదివారం తిరుమలలోని దాతల విభాగంలో వీరు అందజేశారు.

దామానెల్లూరు సచివాలయ
ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

సూళ్లూరుపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దామానెల్లూరు సచివాలయంలో పనిచేసే ఉద్యోగులకు ఎంపీడీవో మురళీకృష్ణ ఎట్టకేలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గత నెల 30న తుఫాన్ సమయంలో సచివాలయంలో పనిచేసే ఉద్యోగులు విధులకు డుమ్మా కొట్టారు. ఎంపీడీవో ఆ గ్రామ పరిశీలనకు వెళ్లగా ఈ విషయం బయటపడింది. దీనిపై ఈనెల 1వ తేదీన 'విపత్తు వేళా.. విధుల్లో ఉండరే!' శీర్షికన ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితం అయింది. దీంతో జిల్లా అధికారులు ఆరా తీసి చర్యలకు ఆదేశించారు. అయితే మండలస్థాయి అధికారులు మీనమేషాలు లెక్కించడంతో జిల్లా అధికారులు మరోమారు ఎంపీడీవోను హెచ్చరించడంతో పంచాయతీ కార్యదర్శితో పాటు సచివాలయ సిబ్బందికి సోమవారం సాయంత్రం వాట్సప్ గ్రూపులో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అయితే సోమవారం 8వ తేదీ షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ, ఈ నెల 3వ తేదీ ఇచ్చినట్లు పేర్కొనడం గమనార్హం. అందులోనూ ఐదు రోజుల ముందు తేదీ వేసి రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

పోలీసు స్టేషన్లకు యువ ఎస్‌ఐలు



తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసు స్టేషన్లకు యువ ఎస్‌ఐలు వచ్చారు. 30 మంది పీఎస్‌ఐలను వివిధ స్టేషన్లకు పోస్టింగ్ ఇచ్చారు. ఇప్పటి వరకు ఎస్‌ఐలుగా పనిచేసిన కొందరిని వీఆర్‌కు, స్పెషల్ బ్రాంచ్‌కు, డీసీఆర్‌బీకి నియమించారు. తిరుపతిలో ఈస్ట్ పోలీసు స్టేషన్‌కున్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని కొత్తగా ముగ్గురు ఎస్‌ఐలను నియమించారు. వడమాలపేటకు ధర్మారెడ్డి స్థానంలో నూతన ఎస్‌ఐను నియమిస్తూ ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. కాగా, యువ ఎస్‌ఐలు సోమవారం ఎస్పీ సుబ్బరాయుడిని మర్యాద పూర్వకంగా కలిశారు. మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని ఎస్పీ వారికి సూచించారు. పోలీసు శాఖ ప్రతిష్ఠతను ప్రజల్లో ఇనుమడింపచేయాలని ఆదేశించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమాజంలో అసాంఘిక శక్తుల ఆట కట్టించాలని అన్నారు.

16 నుంచి దేశమంతా తిరుప్పావై ప్రవచనాలు

తిరుమల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పవిత్ర ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ఈనెల 16 నుంచి జనవరి 14వ తేదీ వరకు దేశవ్యాప్తంగా 233 కేంద్రాల్లో ప్రముఖ పండితులు తిరుప్పావై ప్రవచనాలు చేయనున్నారు. ఏపీలో 76, తెలంగాణ 57, తమిళనాడు 73, కర్ణాటక 21, పుదుచ్చేరి 4, న్యూఢిల్లీ, ఒడిశాల్లో ఒక్కో కేంద్రంలో తిరుప్పావై ప్రవచనాలు నిర్వహిస్తారు. ఇక, తిరుమల శ్రీవారి ఆలయంలోనూ ధనుర్మాసంలో సుప్రభాతం బదులు తిరుప్పావై నివేదించడం విశేషం. తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరం, కేటీ రోడ్డులోని వరదరాజస్వామి ఆలయంలోనూ తిరుప్పావై ప్రవచనాలు పారాయణం చేస్తారు.

పార్లమెంటులో ఎంపీ వాయిదా తీర్మానం

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సంస్కృత వర్సిటీ ఘటనపై లోక్‌సభలో తిరుపతి ఎంపీ గురుమూర్తి సోమవారం అడ్జర్నమెంట్ మోషన్ నోటీసు ఇచ్చారు. విద్యార్థులకు మార్గనిర్దేశం చేయాల్సిన గురువులే ఇలాంటి అనైతిక చర్యలకు పాల్పడటం తిరుపతి ప్రతిష్ఠను దెబ్బతీస్తోందన్నారు. వెంటనే ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని కోరారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థి సంఘాల ఆందోళన

సంస్కృత వర్సిటీలో విద్యార్థి సంఘాలు సోమవారం ఆందోళన చేపట్టాయి. వీరిని గేటు వద్దే పోలీసులు అడ్డుకోగా.. అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. లైంగిక వేధింపుల ఘటనలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు లక్ష్మణ్ కుమార్, శేఖర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. బాధ్యులను ఉద్యోగాల నుంచి తొలగించాలన్నారు. ఘటన జరిగి ఇన్ని రోజులైనా అధికారులు ఎందుకు గుట్టుగా ఉంచారని ప్రశ్నించారు. విద్యార్థి సంఘ నేతలు డాక్టర్ ఓబుల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, సుందర్ రాజు, శివకుమార్, స్వరూప్ కుమార్, యశ్వంత్ రెడ్డి, వినోద్ కుమార్, చెంగల్రెడ్డి, రఫీ, ప్రదీప్ కుమార్, భాస్కర్‌యాదవ్, విజయ్, వినోద్ కుమార్, నాగేశ్వరరావు, హరినాయక్, తిరువర్ధన్ రెడ్డి, ఓబులేసు పాల్గొన్నారు.

శ్రీసిటీలో సర్క్యులర్ ఎకానమీ, వ్యర్థాల రీసైక్లింగ్ పాలసీపై సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న కృష్ణయ్య

సత్యవేడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సర్క్యులర్ ఎకానమీ వ్యర్థాల రీసైక్లింగ్ పాలసీపై ఉన్నత స్థాయి సమావేశం సోమవారం శ్రీసిటీలో జరిగింది. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి(ఏపీపీసీబీ) ఛైర్మన్ పి.కృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆ శాఖ అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు, పర్యావరణ నిపుణులు పాల్గొన్నారు. కాలుష్య నియంత్రణతో పాటు చెత్త నుంచి సంపద సృష్టించాలన్న రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలపై చర్చించారు. పి.కృష్ణయ్య, ఇతర ప్రతినిధులకు సాదర స్వాగతం పలికిన శ్రీసిటీ ప్రెసిడెంట్ సతీష్ కామత్, శ్రీసిటీ అమలు చేస్తున్న రెడ్యూస్, రీయూజ్, రీ సైకిల్(3ఆర్) విధానాల ప్రాధాన్యతను, నిబద్ధతను వివరించారు. ప్రత్యేకించి శ్రీసిటీ జీరో వ్యర్థలక్ష్యాలను ప్రస్తావిస్తూ.. స్కోర్ పోర్టల్‌ను వినియోగించుకుని శ్రీసిటీ ప్రాంతంలో 3ఆర్ పద్ధతులను మరింత బలోపేతం చేయాలంటూ పరిశ్రమ ప్రతినిధులకు పిలుపునిచ్చారు. శ్రీసిటీ సుస్థిర పర్యావరణ హిత కార్యక్రమాలను ప్రశంసించిన కృష్ణయ్య, ఈతరహా ఏకో సిస్టమ్‌ని అభివృద్ధి చేయడంలో ఇతర పారిశ్రామిక కేంద్రాలకు శ్రీసిటీ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. శుద్ధి చేసిన మురుగునీటి పునర్వినియోగం, పారిశ్రామిక ఉప ఉత్పత్తులను రీసైకిల్, పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించడం అత్యుత్తమ పద్ధతులుగా పేర్కొన్న ఆయన, వ్యర్థ నిర్వహణ ఏజెన్సీలు నిబంధనలను కచ్చితంగా పాటించాలని కోరారు. జీవ వైవిధ్య పరిరక్షణ, పచ్చదనం పెంపును శ్రీసిటీ పరిశ్రమలు బాధ్యతగా స్వీకరించడం సంతోషంగా ఉందన్నారు. శ్రీసిటీ సుస్థిరత ప్రణాళికను ప్రస్తావిస్తూ భవిష్యత్తుకు 3ఆర్ పద్ధతులు అనివార్యమని ఉద్ఘాటించారు. ఉపాధిసృష్టి, కాలుష్యనియంత్రణ మధ్య సమతుల్యతను పరిశ్రమలు పాటించాలని, ఇందుకోసం రెగ్యులర్ ఆడిట్లు, పర్యవేక్షణ అవసరమని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన సర్క్యులర్ ఎకానమీ విధానాన్ని వివరిస్తూ సర్క్యులర్ పార్కులు, 3ఆర్ సెంటర్లు, ప్లాస్టిక్ నిషేధం, చెత్త నిర్మూలన, ఎంఎస్ఎంఈలకు అవకాశాలు వంటి పలు కార్యక్రమాలు ఇందులో భాగంగా పేర్కొన్నారు. ఈ విధానం 2025 ఆగస్టులో రాష్ట్ర కేబినెట్ ఆమోదం పొందిందన్నారు. అన్ని రంగాల్లో 3ఆర్ సూత్రాల ప్రాతిపదికగా వ్యర్థాలను వనరులుగా మార్చి అమలు చేయడం ఈ విధానం లక్ష్యంగా వివరించారు. తన సందేశంలో ఏపీపీసీబీ ఛైర్మన్‌కు ధన్యవాదాలు తెలిపిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, సర్క్యులర్ ఎకానమీ, వ్యర్థాల పునర్వినియోగంపై సమగ్ర విధానాన్ని రూపొందించిన రాష్ట్ర ప్రభుత్వ దూరదృష్టిని, నాయకత్వాన్ని కొనియాడారు. సర్క్యులర్ ఎకానమీ సూత్రాల ఆచరణ, సుస్థిర పారిశ్రామిక ప్రగతి అంశాలలో శ్రీసిటీ కీలకపాత్ర పోషిస్తోందని ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఏపీపీసీబీ సభ్యుడు నాగేశ్వరరాజు, సీనియర్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మునిప్రసాద్‌తో పాటు ఆ శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. శ్రీసిటీలోని వివిధ పరిశ్రమల నుంచి వంద మందికిపైగా మానవ వనరులు, పర్యావరణం, ఆరోగ్య, భద్రత మేనేజర్లు హాజరయ్యారు. సమావేశంలో వివిధ సమస్యలు, ప్లాస్టిక్ నిషేధం, వ్యర్థాల శుద్ధి వంటి అంశాలపై చురుకైన చర్చలు సాగాయి.

వైకుంఠ ఏకాదశికి సమన్వయంతో పనిచేయాలి



పోలీసు అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి, ద్వాదశి రోజుల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, కష్టాలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. తిరుపతిలోని కమాండ్ కంట్రోలు యూనిట్‌లో సోమవారం ఆయన జిల్లాలోని పోలీసు అధికారులతో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై ముందస్తు సమావేశం నిర్వహించారు. తిరుమలకు భారీగా వచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, లైన్ మేనేజ్‌మెంటు, అత్యవసర స్పందన బృందాల నియామకం, పాదచారి మార్గాల భద్రత వంటి అంశాలపై చర్చించి కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. చిన్న పిల్లలు తప్పిపోకుండా ప్రత్యేక హెల్ప్ డెస్కులు, చైల్డ్ మిస్సింగ్ టీమ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు.

పుష్కరిణి.. పులకింత

ఆహ్లాదకరంగా గడుపుతున్న ప్రజలు





వైష్ణవ కోనేరులో రంగు చేపలకు ఆహారం వేస్తున్న చిన్నారులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణంలోని కోనేర్లు నిండు జలాలతో కళకళలాడుతున్నాయి. పుష్కరిణిల వద్ద భక్తులు, స్థానికులు ఆహ్లాదకరంగా గడుపుతున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయం సమీపంలోని భరద్వాజతీర్థం కోనేరులో ఇటీవల కురిసిన వర్షాలతో నిండుగా నీరు చేరింది. ఇక్కడ పచ్చని చెట్లు, ఉద్యానవనంగా సేద తీరే పరిసరాలతో పాటు నీటిపై సంచరించే బాతులు ఆకర్షిస్తున్నాయి. ముక్కంటి ఆలయానికి విచ్చేసే భక్తులతోపాటు స్థానికులు సాయంత్రం వేళ సరదాగా భరద్వాజ తీర్థం వద్దకు చేరుకుని ఉల్లాసంగా గడుపుతున్నారు.

భారీ రంగు చేపలు

శ్రీకాళహస్తి పట్టణం జయరామరావువీధిలోని వైష్ణవ పుష్కరిణిలో భారీ రంగుచేపలు పిల్లలు, పెద్దలను మైమరిపిస్తున్నాయి. వర్షాలకు పుష్కరణి నిండుగా మారడంతో సాయంత్రం వేళ చేపలకు ఆహారం వేసేందుకు పిల్లలు, పెద్దలు పుష్కరిణి వద్దకు చేరుకుని పులకిస్తున్నారు. ఐదేళ్ల కిందట కోనేరు ఎదురుగా ఉన్న ఓ అక్వేరియం షాపు నిర్వాహకుడు రంగు చేపలను పుష్కరిణిలో వదిలారు. అవి పెరుగుతూ వాటి సంతతిని వృద్ధి చేశాయి. దాంతో ఎక్కడా లేని విధంగా ఈ కోనేరులో వర్షాకాలంలో భారీ రంగు చేపలు గోల్డ్‌ఫిష్, వైట్, బ్లాక్ చేపలు ఆకర్షిస్తున్నాయి. ఇక, నారదపుష్కరణి కూడా నిండుకుండలా కనువిందుచేస్తోంది. ఉదయం, సాయంత్రం కోనేరులో స్థానికులు సేద తీరుతున్నారు.





భరద్వాజతీర్థం వద్ద సందడిగా..

రైతుల అభ్యున్నతికి ప్రాధాన్యం



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

తడ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతులకు లభ్యున్నతికి ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. సోమవారం పులివేంద్ర వద్ద ఉన్న వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏఎంసీ ఛైర్మన్ ఆకుతోట రమేష్ అధ్యక్షతన నూతన కార్యవర్గ మొదటి సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే నెలవల మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రైతుల అభ్యున్నతి కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. జీఎస్టీ తగ్గింపుతో వ్యవసాయ పనిముట్లు తక్కువ ధరకు లభిస్తున్నాయని చెప్పారు. సమావేశంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ కార్యదర్శి రావమ్మ, వైస్ ఛైర్మన్ రవీంద్రారెడ్డి, మాజీ ఛైర్మన్ తిరుమూరు సుధాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు సెల్వం, పళణి, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఏఎంసీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే మొక్కలు నాటారు.

రైతులను ఆదుకోండి



తహసీల్దార్ హరికృష్ణతో మాట్లాడుతున్న నరేంద్రరెడ్డి

పెళ్లకూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరి పైర్లు దెబ్బతిని నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి కోరారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ హరికృష్ణ, ఎంపీడీవో ప్రమీలారాణి, వ్యవసాధికారి విజయభారతిలకు వినతిపత్రం అందజేశారు. మండలంలో ఇటీవల కురిసిన వర్షాలతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు చెందిన వరి నారుమడులు, పైర్లు నష్టంతో పాటు పాలచ్చూరు దళితవాడలో ఇళ్లు కూలాయని అధికారులకు వివరించారు. ఇంకా పొలాల్లో వర్షపునీరు నిలిచి ఉందని, రహదారులు దెబ్బతిన్నాయని, యాలకారికండ్రిగ ప్రభుత్వ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుందని పేర్కొన్నారు. ప్రభుత్వానికి నష్టాలపై నివేదించి బాధితులకు నష్టపరిహారం అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రామకృష్ణ, చలపతి తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి పాఠశాల బస్సు నడిపిన డ్రైవర్

పోలీసులకు అప్పగించిన స్థానికులు

నాయుడుపేట టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ కార్పొరేట్ పాఠశాలకు చెందిన బస్సును డ్రైవర్ మద్యం తాగి నడుపుతూ గడియారం సెంటర్‌లోని పోలేరమ్మ ఆలయం ఎదుట ఉన్న టేబుల్‌ను ఢీకొట్టాడు. అదే సమయంలో మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరిని ఢీకొట్టబోగా వారు తప్పించుకున్నారు. గమనించిన స్థానికులు మద్యం తాగి బస్సు నడుపుతున్న డ్రైవర్‌ను పోలీసులకు అప్పగించారు. పోలీసులు బస్సును స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థులను మరో బస్సులో పాఠశాలకు తరలించారు.

టెన్త్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో మునిరత్నం

నాయుడుపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈవో మునిరత్నం అన్నారు. సోమవారం నాయుడుపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ వంద రోజుల విద్యాభ్యాసం యాక్షన్ ప్లాన్‌ను తెలియజేశారు. ఏఎంవో చంద్రశేఖర్ నాయుడు మాట్లాడుతూ పది పబ్లిక్ పరీక్షలపై విద్యార్థులు ఆందోళన చెందవద్దని, 100 రోజుల యాక్షన్ ప్లాన్ పాటిస్తే వందశాతం ఉత్తీర్ణత సాధ్యమవుతుందన్నారు. వారి వెంట హెచ్‌ఎం మంజుల ఉన్నారు.

జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో విద్యార్థి ప్రతిభ



విద్యార్థి లోకేష్‌ను, కోచ్ శివశంకర్‌ను అభినందిస్తున్న శ్రీనివాసులురెడ్డి

గూడూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి సబ్‌జూనియర్స్ ఆర్చరీ పోటీల్లో లయోలా జూనియర్ కళాశాల విద్యార్థి వెంకటలోకేష్ ప్రతిభ చాటారని కరస్పాండెంట్ పంటా శ్రీనివాసులురెడ్డి తెలిపారు. సోమవారం కళాశాలలో విద్యార్థి వెంటకలోకేష్‌ను, కోచ్ శివశంకర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ అరుణాచల్‌ప్రదేశ్‌లో గత నెలలో నిర్వహించిన సబ్‌జూనియర్స్ జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో వెంకటలోకేష్ ప్రతిభచాటి సిల్వర్ మెడల్ సాధించాడన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజనారాయణ, శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం



కోఆపరేటివ్ బ్యాంక్ వద్ద సహకార సంఘాల ఉద్యోగుల ఆందోళన

కోట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల్లో పనిచేసే ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని సహకార సంఘాల ఉద్యోగులు హెచ్చరించారు. సోమవారం కోటలోని సహకార బ్యాంక్ వద్ద నిరసన తెలిపారు. మండలంలోని తిన్నెలపూడి, నెల్లూరుపల్లి కొత్తపాళెం, సిద్దవరం, చిట్టేడు, ఊనుగుంటపాళెం సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదన్నారు. పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలు తీసుకువెళ్లినా పట్టించుకోలేదన్నారు. తమ సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యం చేరండి

నాయుడుపేట టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యం చేరాలని అర్బన్ సీఐ బాబి అన్నారు. నాయుడుపేట - మేనకూరు పారిశ్రామికవాడ సమీపంలో సోమవారం ఉదయం పరిశ్రమలకు వెళ్లే ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఆదిలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ఢీకొని ఒకరికి గాయాలు

సూళ్లూరుపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న బిలాస్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. పట్టణంలోని కోళ్లమిట్ట ప్రాంతానికి చెందిన వంజువాకం బాబు ఫోన్‌లో మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ఉన్న రైల్వేగేటు దాటుతుండగా రైలు ఢీకొంది. గాయపడిన బాబును 108 వాహనంలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం గూడూరుకు తీసుకెళ్లారు.

ఆటో చోరీ

నాయుడుపేట టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పిచ్చిరెడ్డితోపులో తన ఇంటి ముందు పార్కింగ్ చేసిన ఆటో చోరీకి గురైనట్లు బాధితుడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆదివారం రాత్రి ఇంటి ముందు ఆటో పార్కింగ్ చేశానని, సోమవారం ఉదయం లేచి చూసేసరికి కనిపించలేదని, పరిసర ప్రాంతాల్లో గాలించి ఆచూకీ లేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

భూవివాదంలో ఒకరిపై కేసు

వాకాడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగన్నపాళెం గ్రామానికి చెందిన ఒకే కుటుంబంలో అన్నదమ్ముల మధ్య భూమి పంపకాల విషయంలో సోమవారం వివాదం జరిగింది. తమ్ముడుపై అన్న దాడిచేయడంతో బాధితుడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు అన్న మల్లికార్జున్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నిఖిల్ తెలిపారు.

తారురోడ్డుపై సిమెంట్‌తో అతుకులు

కంకర తేలడంతో నరకంగా ప్రయాణం - అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్న ద్విచక్ర వాహనదారులు



కంకర తేలడంతో అధ్వానంగా ఉన్న శ్రీహరికోట రోడ్డు

సూళ్లూరుపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే షార్ రోడ్డు అధ్వానంగా మారింది. పట్టణంలోని షార్ వై జంక్షన్ నుంచి ఉద్యోగుల కాలనీ కేఆర్‌పాలెం వరకు రోడ్డు గోతులు ఏర్పడి రాళ్లు తేలడంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. చిన్నపాటి వర్షమొచ్చినా అంబేడ్కర్ గురుకులం నుంచి సాయిబాబ ఆలయం వరకు రోడ్డుపై మోకాటి లోతు నీరు నిలబడుతోంది. గతంలో బీటీ రోడ్డుకు సిమెంట్‌తో అతుకులు వేసి గుంతలను పూడ్చారు. ఆ సిమెంట్ లేచిపోవడంతో మళ్లీ గోతులు ఏర్పడి ప్రయాణం నరకంగా మారింది. మొంథా, దిత్వా తుఫాన్లతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డుపై సన్నని కంకర లేయడంతో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి అయ్యి ప్రమాదాలకు గురవుతున్నారు. రాకెట్ ప్రయోగాలకు సంబంధించిన సామగ్రి, ఉపగ్రహాలు, లిక్విడ్‌లను తీసుకెళ్లే భారీ వాహనాలు ఈ రోడ్డులో షార్‌కు వెళ్తుంటాయి. రోడ్డు అధ్వానంగా ఉండడంతో భారీ వాహనాలు వెళ్లే సమయంలో ఇబ్బందులు తప్పడంలేదు. దీనికి తోతు కేఆర్‌పాలెం వద్ద షార్ ఉద్యోగులకు నివాసాల నిర్మాణం జరుగుతోంది. అదే విధంగా షార్ బస్సు గ్యారేజ్ వద్ద మరో ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయి. ఈ నిర్మాణాలకు రాళ్లు, సిమెంట్, ఇతర సామగ్రిని తరలిస్తున్న భారీ వాహనాలు పలు సందర్భాల్లో రోడ్డు పక్కకు ఒరిగిపోయిన ఘటనలు ఉన్నాయి. వారం రోజుల క్రితం ఓ ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోయి స్కూటరిస్టుకు చెయ్యి విరిగింది. రెండు రోజుల క్రితం ఓ మహిళా స్కూటీలో వెళ్తూ గోతిలో ఇరుక్కుపోయింది. ఇలా తరచూద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడిపోవడం పరిపాటిగా మారిపోయింది. షార్ యాజమాన్యం స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.





ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న కర్పూరజ్యోతి జ్వాలలు - అయ్యప్పస్వామి దీపోత్సవంలో మహిళలు

అంబరాన్నంటిన అయ్యప్పస్వామి జ్యోతి పూజోత్సవం



అయ్యప్పస్వామిని దర్శించుకుంటున్న సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, విజయభాస్కర్‌రెడ్డి, రాజారెడ్డి తదితరులు

నాయుడుపేట/టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలోని పార్కు ప్రాంగణంలో సోమవారం రాత్రి అయ్యప్పస్వామి జ్యోతి పూజోత్సవం వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ గణపతిహోమం నిర్వహించారు. శబరిమలై తరహాలో అయ్యప్పస్వామి దేవాలయాన్ని రూపొందించి స్వామివారిని కొలువుదీర్చారు. అయ్యప్ప పడి మెట్ల వద్ద వెయ్యి కిలోల కర్పూర గడ్డలను అఖండ జ్యోతికి సిద్ధం చేశారు. సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, సీనియర్ నాయకులు శిరసనంబేటి విజయ భాస్కర్‌రెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డి, రఫీ అఖండజ్యోతి ప్రజ్వలనం చేశారు. దేదీప్యమానంగా వెలుగుతున్న అఖండ కర్పూరజ్యోతి జ్వాలలను భక్తులు దర్శించుకున్నారు. అనంతరం అయ్యప్పస్వామికి నగరోత్సవం నిర్వహించారు. మహిళలు దీపాలతో హారతుపడుతూ నగరోత్సవంలో పాల్గొన్నారు. అయ్యప్ప స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం జనసంద్రమైంది. ఈ కార్యక్రమంలో గురుస్వామి ప్రతాప్, అయ్యప్పస్వామి సేవాసంఘం సభ్యులు వెంకటకృష్ణారెడ్డి, చంద్రారెడ్డి, అంకయ్య, మునిరాజ, సుబ్రమణి, జలంధర్, చదలవాడ కుమార్, చిరువెళ్ల మునిరాజ, కనమర్లపూడి సుబ్రమణి, శ్రీనివాసులు, గాదిరెడ్డి గోపి, కిషోర్‌బాబు, పార్థసారధి, సంజయ్, నిత్యకృష్ణారెడ్డి, సుధీర్‌రెడ్డి, ధనంజయ, నారాయణ, రవి, చంద్రశేఖర్‌రెడ్డి, ఏతేంద్ర, షైలారి రాజశేఖర్, జీవీఆర్ నాయుడు, చెంచయ్య, చెంచుకృష్ణయ్య, సుబ్బారావు, అమరేంద్ర, అత్తికాయల సుబ్రహ్మణ్యం, అవధానం సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో రైతు మృతి

నాయుడుపేట టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగమాంబపురం గ్రామానికి చెందిన రైతు గురుప్రసాద్(45) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.... గురుప్రసాద్‌కు పండ్లూరు సమీపంలో ఉన్న పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం పొలం వద్దకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రయినా ఇంటికి రాకపోయేసరికి కుటుంబసభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికారు. సోమవారం ఉదయం సమీపంలోని ఓ కాలువలో గురుప్రసాద్ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య కౌశల్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. కాగా, ఆదివారం కాలువపై తూము వద్ద గురుప్రసాదం కూర్చొని ఉండగా గమనించినట్లు స్థానికులు చెబుతున్నారు.

రాచపాళెం చెరువులో గుర్తుతెలియని మృతదేహం

ఓజిలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం రాచపాళెం చెరువులో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చెరువులో మృతదేహం ఉన్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఐ శ్రీకాంత్ తన సిబ్బందితో అక్కడకు వెళ్లి మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతుడికి సుమారుగా 35 ఏళ్లు ఉంటాయని, చేతిపై తమిళభాషలో పచ్చబొట్టు ఉందని, మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బాలకార్మికులను విద్యావంతులను చేయాలి

నాయుడుపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బాలకార్మికులను గుర్తించి వారిని విద్యావంతులు చేయాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ వాసప్ప అన్నారు. సోమవారం బాలకార్మికుల నిర్మూలనపై ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పెళ్లకూరు మండలం తాళ్వాయిపాడు గ్రామంలో ప్రతి ఇంటినీ సందర్శించి బాలకార్మికుల నిర్మూలన, విద్య ప్రాముఖ్యాన్ని తెలియజేశారు. బడి ఈడు పిల్లలను పాఠశాలకు పంపాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణాకుమారి పర్యవేక్షించారు.

మత్స్యకార గ్రామాలతో ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయండి



ఎంపీడీవో సాయిప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న మత్స్యకారులు

వాకాడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండూరుపాళెం, అంజలాపురం మత్స్యకార గ్రామాలతో ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం ఎంపీడీవో సాయిప్రసాద్‌కు మత్స్యకార నాయకులు వినతిపత్రం అందజేశారు. కొండూరుపాళెం, అంజలాపురం గ్రామాల్లో 1100 మంది నుంచి మత్స్యకారులు ఉన్నారని, తమను గుర్తించి ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో మత్స్యకార నాయకులు పూడి మహేంద్ర, రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాల మెరుగుకు చర్యలు



సాగర్‌కుమార్‌కు మొమెంటో అందజేస్తున్న విద్యాశాఖ అధికారులు

గూడూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను, విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు రాష్ట్ర పభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని డీవైఈవో సనత్‌కుమార్, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో టీచ్ టూల్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. అనంతరం గత నెల 26వ తేదీన మాక్ అసెంబ్లీలో పాల్గొన్న విద్యార్థి సాగర్‌కుమార్‌కు మొమెంటో అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో కాంచన, ప్రేమ్‌కుమార్, మాధవిలత, రెహమాన్, భారతి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించండి

గూడూరు అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్ల సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు ఇంద్రావతి, ప్రభావతి అన్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో కార్యాలయ ఏవో శిరీషాకు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.తమ సమస్యలను పరిష్కారించాలని కోరుతూ ఈనెల 12న జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శివకుమార్, రమణయ్య, పెంచలమ్మ, లక్ష్మి, ఆసియాబేగం పాల్గొన్నారు.

అదృశ్యమైన యువకుడి మృతదేహం లభ్యం

బాలాయపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన యువకుడి మృతదేహం లభ్యమైంది. బాలాయపల్లి మండలం అలిమిలి గ్రామానికి చెందిన పొట్టేళ్ల శీనయ్య, వెంకటరమణమ్మ దంపతుల కుమారుడు ప్రసన్నకుమార్(32) గత నెల 30 నుంచి కపించకుండాపోయాడు. ఈ నెల 3న శీనయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. గ్రామంలోని కొందరు యువకులతో కలిసి ప్రసన్నకుమార్ ఈతకు వెళ్లాడని తెలియడంతో కైవల్యానది వెంబడి గాలించారు. సోమవారం నిండలి సమీపాన కైవల్యానది బ్రిడ్జి వద్ద మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం వెంకటగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అంబేడ్కర్ భవనం కోసమే కంచె

వెంకటగిరి, డిసెంబర్ 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమ్మవారిపేట సర్వే నంబర్ 217లోని ప్రభుత్వ స్థలంలో అంబేడ్కర్ భవన నిర్మాణం చేపట్టాలని నిర్ణయించామని, ఇందు కోసమే కంచె వేశామని బహుజన సంఘాల నేతలు పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసి కంచె వేశారంటూ ఈనెల 5వ తేది ఆంధ్రజ్యోతి పత్రికలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు సోమవారం కంచె తొలగించనున్నారని తెలుసుకున్న బహుజన సంఘాల నేతలు సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. అక్కడే మీడియాతో మాట్లాడారు. సదరు స్థలాన్ని అంబేడ్కర్ భవన నిర్మాణానికి కేటాయించాలని కలెక్టర్‌ను కోరామని, ఈ నేపథ్యంలో కంచె వేసి కాపాడుకుంటూ వస్తున్నామని చెప్పారు. కంచె తొలగిస్తే బహుజనులంతా ఒక్కటై అడ్డుకుంటామని బహుజన సంఘాల నేతలు స్పష్టం చేశారు.

కౌలు రైతుపై దౌర్జన్యం

పోలీసులకు ఫిర్యాదు

ఓజిలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సగుటూరుకు చెందిన కౌలు రైతు కలపాటి వేణుపై అదేగ్రామానికి చెందిన కురుగొండ సురేష్, సుబాషిని దౌర్జన్యం చేసినట్లు బాధితుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి కథనం మేరకు వివరాలు... సగుటూరుకు చెందిన కురుగొండ మంజులమ్మకు చెందిన 3.60 ఎకరాల పొలాన్ని వేణు కౌలుకు తీసుకున్నాడు. దుక్కి చేసి నాట్లు వేసేందుకు సిద్ధం చేసుకున్నాడు. ఈ క్రమంలో సురేష్, సుబాషి పొలం పనులను అడ్డుకున్నారు. ప్రశ్నించిన వేణును దూషించడమే కాకుండా దౌర్జన్యం చేసి భయపెట్టారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో బాధితుడు పేర్కొన్నాడు.

మున్సిపల్ కార్మికుల వేతన బకాయిలు చెల్లించండి

నాయుడుపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు నాలుగు నెలల వేతనాలను తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెంగయ్య డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లాకు సీఐటీయూ నేత శివకవి ముకుందతో కలసి వినతిపత్రం అందజేశారు. కార్మికులకు యూనిఫాం, చెప్పులు, సబ్బులు, నూనెలు, పారిశుధ్య పరికరాలు అందజేయాలన్నారు. అలాగే కార్మికులు గతంలో 17 రోజులు సమ్మె చేశారని, ఆ సమయంలో వేతనాలు కూడా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రమణమ్మ, అంకయ్య, మల్లికార్జున, సుబ్రహ్మణ్యం, సాయి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్నభోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

నాయుడుపేట టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి శివకవి ముకుంద అన్నారు. సోమవారం నాయుడుపేటలోని విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈవోకు వినతిపత్రం అందజేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి విజయమ్మ మాట్లాడుతూ కార్మికులకు ఉద్యోగ భద్రతతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ నాయకులు వాణి, రజియా, మల్లిక, చంద్రమ్మ, సుఖన్య, తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ అర్జీలకు ప్రాధాన్యం

డక్కిలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజావిజ్ఞప్తుల దినంలో అందే అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తహసీల్దారు శ్రీనివాసులు అన్నారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావిజ్ఞప్తుల దినంలో ఎక్కువగా భూ సమస్యలపై అర్జీలు వచ్చినట్లు వివరించారు. ప్రజలు విన్నవించిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని వీఆర్వోలను ఆదేశించారు. కార్యక్రమంలో మాధవాయపాళెం సింగిల్ విండో అధ్యక్షుడు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసులు నడపాలని ప్రయాణికుల నిరసన

కోట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కోట - ముత్తుకూరు బస్సు సర్వీసులను యథావిధిగా నడపాలంటూ కోట ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం ప్రయాణికులు నిరసన తెలిపారు. వాకాడు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులను కోట బస్టాండ్ నుంచి ఉదయం 8 గంటల నుంచి రాత్రి పొద్దుయేవరకు ముత్తుకూరు, నెల్లూరువైపు సర్వీ సులు నడుపుతుంటారు. ఇవి ఉద్యోగులు, విద్యార్థులు, ఆసుపత్రులకు వెళ్లే రోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేవి. అయితే ఇటీవల నుంచి ఆర్టీసీ అధికారులు కోట, ముత్తుకూరు సర్వీసులు సక్రమంగా నడవటం లేదని ప్రయాణికులు విమర్శిస్తున్నారు.

సచివాలయంలో తనిఖీలు

కోట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిన్నెలపూడి సచివాలయాన్ని గ్రామవార్డు, సచివాలయాల డిప్యూటీ ఎంపీడీవో అల్లిబాషా సోమవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. విధుల నిర్వహణలో అలసత్వం వహించవద్దని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి రియాజ్‌ఉద్దీన్ అహ్మద్ తదితరులు ఉన్నారు.

రోడ్డుపై కూలిన చెట్టు



కోట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కోట మండలం వీరారెడ్డిసత్రం, వెంకన్నపాళెం గ్రామాల మార్గంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డుపై సోమవారం ఓ చెట్టు కూలిపోయింది. కోట నుంచి వాకాడుకు వెళ్తున్న విద్యుత్ మెయిన్ లైన్‌పై చెట్టు పడింది. ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రమాదం తప్పింది. రోడ్డుపై చెట్టు కూలిపోవడంతో రెండు గంటలపాటు ట్రాఫిక్ జామ్ అయింది. విద్యుత్ అధికారులు చెట్టును పక్కకు తొలగించడంతో వాహనాల రాకపోకలు కొనసాగాయి.

శానిటేషన్ సిబ్బందికి దుస్తుల పంపిణీ

నాయుడుపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బందికి 108 ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బల్లి కిరణ్‌కుమార్ తన తల్లి రమణమ్మ తృతీయ వర్ధంతి సందర్భంగా సోమవారం దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ అమర్‌నాథ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

సూళ్లూరుపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయులకు టీచ్ టూల్ ట్రైనింగ్ కార్యక్రమంలో తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మూడు మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు ఎంఈవోలు సునీలా, శీనయ్య ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు.